29 . 10. 2025

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

బుధవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 149 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు

## నీటి తరలింపు

**80టీఎంసీల నీటిని తరలించేందుకు ప్రణాళికలు**

**చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష**



**హైదరాబాద్, అక్టోబర్28(వెలుతురు):** తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు 80టీఎంసీల నీటిని తరలించేం దుకు.. ప్రణాళికలు సిద్ధం చేయాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సాగు,

## "ఏరో-ఇంజిన్" రాజధానిగా తెలంగాణ

- 2030 నాటికి తీర్చిదిద్దేలా సమగ్ర "రోడ్ మ్యాప్"
- ఇక్కడి నుంచే ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థలకు "ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్"
- రూ.425 కోట్ల పెట్టుబడి. 500 మందికి కొత్తగా ఉద్యోగాలు
- ఆదిభట్ల "న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ" ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్ బాబు



**ఆదిభట్ల వెలుతురు అక్టోబర్ 28:** 2030 నాటికి తెలంగాణను దేశ "ఏరో-ఇంజిన్" రాజధానిగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని అని మంత్రి శ్రీధర్ బాబు

## సినీ కార్మికులకు ప్రభుత్వం అండ

- టిక్కెట్ల రేట్లలో కార్మిక సంక్షేమం కోసం 20శాతం
- ఆరోగ్యశ్రీ, ఇళ్ల స్థలాలు, పిల్లలకు ప్రత్యేక స్కూలు
- ఆస్కార్ స్థాయికి సినీ పరిశ్రమను తీసుకెళ్లిన ఘనత మీదే
- సినీకార్మిక సంఘం సన్మాన సభలో సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, అక్టోబర్28( వెలుతురు):** ప్రపంచ సినీ పరిశ్రమకు హైదరాబాద్ నగరం వేదిక కావాలనేది తన సంకల్పమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సినీ కార్మికుల సమాఖ్య ఆధ్వర్యంలో యూసుఫ్‌గూడ పోలీస్ గ్రౌండ్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి సన్మాన సభ జరిగింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. యూసుఫ్‌గూడలో నిర్వహించిన సినీ కార్మికుల అభినందన సభలో సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సినీ కార్మికుల సంక్షేమంపై సీఎం పలు కీలక హామీలు ఇచ్చారు. కృష్ణా నగర్‌లో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో కార్మికుల పిల్లల కోసం కార్పొరేట్ స్థాయి పాఠశాల నిర్మిస్తాం. ఉదయం టిఫిన్, మధ్యాహ్నం లంచ్ కూడా అందిస్తాం. రాజీవ్ ఆరోగ్యశ్రీతో పాటు ఉచిత వైద్యం కూడా అందిస్తాం అని చెప్పారు. తన మాటకు కట్టుబడి కృష్ణానగర్‌కు



మొంథా తుఫాన్ ప్రభావం..

## పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి..

- రైతు నేస్తం కార్యక్రమంలో మంత్రి తుమ్మల
- సీసీఐ పత్తి కొనుగోళ్లు ప్రారంభం
- పత్తి క్వింటా మద్దతు ధర 8110 రూపాయలు
- పత్తి తేమ శాతం 20 వరకు ఉన్నప్పటికి కొనుగోలు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి...
- తేమ శాతం విషయంలో పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి...
- సమస్యలు ఉంటే పత్తి రైతులు టోల్ ఫ్రీ నెంబర్ లో సంప్రదించవచ్చు



## లైంగిక వేధింపుల్లో హెచ్ఎం, సిబ్బంది పాత్రపై కొనసాగుతున్న విచారణ

### అవసమైతే వారిపైనా పోక్సో కేసు నమోదు చేయాలి

- ఈ ఘటనపై కరీంనగర్ జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ సీరియస్ గా ఉన్నారు
- ప్రాథమిక విచారణ ఆధారంగా చర్యలు తీసుకుంటున్నారు
- పిల్లల భవిష్యత్తుతో ముడి పడి ఉన్న సమస్య
- దయచేసి మీడియా సంయమనం పాటించాలి
- ఆందోళనలో ఉన్న తల్లిదండ్రులకు భరోసా కల్పించాలి
- వంగరలో గురుకుల విద్యార్థి ఆత్మహత్య దారుణం
- ఇకనైనా గురుకులాలు, హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి
- బీఆర్ఎస్ పాలన తరహాలోనే కాంగ్రెస్ పాలన కొనసాగుతోంది
- తెలుగు రాష్ట్రాలపై భారీ వర్షాల నేపథ్యంలో రంగంలోకి ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు కేంద్రం సిద్ధం
- కరీంనగర్ లో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ వెల్లడి



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 28:** కరీంనగర్ జిల్లాలోని ఓ పాఠశాలలో యాకుబ్ భాషా అనే అటెండర్ విద్యార్థులపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఘటనలో కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం గత 5 రోజుల నుండే లోతైన విచారణ జరిపి నివేదిక తెప్పించుకున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. పోక్సో కేసు కావడంతో విషయం బయటకు వస్తే విద్యార్థుల

## పంచాయితీ రాజ్ ఈఎన్‌సి, రూరల్ వాటర్ సప్లై ఈఎన్‌సిలపై ఆరోపణలు



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో అవినీతి రాజ్యమేలుతోంది. ఈ ఎన్ సి పదవి కోసం భారీగా ముడుపులు ముట్టాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో రెండు రోజుల్లో రిటైర్మెంట్ కానున్న ప్రస్తుత ఈ ఎన్ సి జోగా రెడ్డికి ఐదు నెలల పదవి కాలం బాధ్యతలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు, ఆ శాఖ కార్యదర్శి శ్రీధర్. ఇటు ముఖ్యమంత్రి సలహాదారుల అండదండలతో తమ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి ఐదు నెలల పదవి కాలం పొడిగిస్తూ నిర్ణయం తీసుకోవడం పిఆర్ ఉద్యోగుల్లో కలవరం సృష్టిస్తుంది. అటు రూరల్ వాటర్ సప్లై లోను ముఖ్యమంత్రి సలహాదారుని మద్దతు తోనే కృపాకర్ రెడ్డికి మరో ఐదు నెలల బాధ్యతలు ఇచ్చింది ప్రభుత్వం. గత పదేళ్లుగా అదే శాఖలో ఈఎన్సీగా ఉంటూ వస్తున్న కృపాకర్ రెడ్డికి అప్పటి ప్రభుత్వంలో సీఎంఓ లో సెక్రెటరీ స్థాయిలో ఉన్న మహిళ ఉన్నతాధికారి చొరవతో ఉంటు వచ్చారు. మళ్ళీ కాంగ్రెస్ ప్రభుత్వంలో కుల సమీకరణం ఆధారంగా చక్రం తిప్పుతున్నారన్న పేరుంది. గత టీఆర్ఎస్ హయాంలో కొనసాగిన కుల సమీకరణం ఇప్పుడు కాంగ్రెస్ లో కొనసాగుతుంది. అర్హత కలిగిన అధికారులు పంచాయితీ రాజ్, రూరల్ వాటర్ సప్లై లో ఉన్నప్పటికీ కులం లాబియింగ్ ద్వారా పదవులు తెచ్చుకున్నారన్న విమర్శలు ఉన్నాయి. పాత ప్రభుత్వంలో కుల ప్రాతిపదికన జరిగిన ఉన్నత పోస్టుల అంశంపై టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆత్మవిమర్శ చేసుకున్నట్లు ప్రకటించారు. కానీ కాంగ్రెస్ లో ఆ పరిస్థితి కనిపించడం లేదట. అటు ఆర్ అండ్ బి డిపార్ట్మెంట్ లో ఒకే సామజిక వర్గానికి చెందిన అధికారుల హావ నడుస్తోందట. వారంతా తమ తోటి ఉద్యోగులతో ముఖ్యమంత్రి, అయన సలహాదారు, మంత్రుల స్థానాల్లో ఉన్నది తమ సామజిక వర్గానికి చెందిన వారే అంటు చెప్పుకొని తిరుగుతున్నట్లు జోరుగా ప్రచారం సాగుతోంది.

PRESS Club HYDERABAD

## హృదయపూర్వక కృతజ్ఞతలు



హోరా హోరీగా, అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆదివారం నాడు జరిగిన హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికల్లో మీ విలువైన సమయాన్ని కేటాయించి, మీ అమూల్యమైన ఓటుతో నన్ను ఉపాధ్యక్షుడిగా మంచి మెజారిటీతో గెలిపించిన మీకు జీవితాంతం రుణపడి ఉంటాను. గత ఎన్నికల్లో కూడా అనూహ్య మెజారిటీతో నన్ను కోశాధికారిగా ఎన్నుకొని మీకు సేవ చేసే అవకాశం కల్పించారు. వరసగా మీరు అందిస్తున్న ఈ ప్రోత్సాహం నాకు కొండంత బలాన్ని అందిస్తుంది. మీరు నాపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ముచేయకుండా అహర్నిశలు మీ సేవకు అంకితమవుతాను. మీ అభిమానానికి పాత్రుడిని అవ్వడం నా అదృష్టంగా భావిస్తున్నాను. నా వైపు నుండి మీకు ఎలాంటి సహాయ, సహకారాలు అవసరమైనా ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ మీకు సేవ చేస్తాను. మీ సంక్షేమం కోసం ఎలాంటి త్యాగానికైనా వెనకడకుండా, అహర్నిశలు శ్రమిస్తానని మనస్ఫూర్తిగా భరోసా ఇస్తూ, జర్నలిస్టు పెద్దలకు, నా శ్రేయోభిలాషులకు పేరుపేరునా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. మునుముందు మీ ఆశీస్సులు ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను.

మీ శ్రేయోభిలాషి

**ఏ రాజేష్**

ఉపాధ్యక్షుడు

హైదరాబాద్ ప్రెస్ క్లబ్

9391016666



## తుమ్మిడిహట్టి నుంచి సుందిళ్ల వరకు నీటి తరలింపు

తాగు నీరు అందించాలని మార్గనిర్దేశం చేశారు. తుమ్మిడిహట్టి దగ్గర పాత పనులను ఉపయోగించుకుంటూ.. అంచనాలను తయారు చేయాలని సీఎం సూచించారు. సుందిళ్లకి రివర్ చేసి వినియోగంలోకి తీసుకొచ్చి శ్రీపాద ఎల్లంపల్లికి నీటిని తీసుకువచ్చేందుకు అవసరమైన ప్రణాళికలు, అంచనాలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తుమ్మిడిహట్టి దగ్గర చేపట్టాల్సిన ప్రాజెక్టుపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంగళవారం రాష్ట్ర సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకి సీఎం పలు కీలక సూచనలు చేశారు. అలాగే, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల లేఖ రాశారు. ఈ లేఖపై మంగళవారం జరిగిన సమీక్షలో ఉన్నతాధికారులతో రేవంత్‌రెడ్డి చర్చించారు. సీఆర్ పాటిల్‌కి తాను రాసిన లేఖలో ప్రస్తావించిన అంశాలను అధికారులకు వివరించారు. తుమ్మిడిహట్టిపై ఏ విధంగా ముందుకెళ్లాలనే అంశంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ లేఖలో పేర్కొన్న ప్రాజెక్టులకు సంబంధించి ప్రాజెక్టుల వారీగా అధ్యయనం చేసి పూర్తిస్థాయి నివేదికలను తయారు చేయాలని అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని డ్యామ్‌లపై స్టేటస్ రిపోర్ట్ తయారు చేయాలని సూచించారు. సుందిళ్ల, అన్నారం, మేడిగడ్డ బ్యారేజీల పరిస్థితిపైనా సీఎం చర్చించారు. బ్యారేజీల రిపేర్లకు అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని, ఇందుకు సంబంధిత ఏజెన్సీలే బాధ్యత వహించేలా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆయా ప్రాజెక్టుల వారీగా పూర్తిస్థాయి నివేదికల ఆధారంగా తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై నవంబర్ రెండో వారంలో మరోసారి సమీక్షా సమావేశం నిర్వహించాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు.

## శృంగేరీ పీఠాధిపతిని కలుసుకున్న సిఎం రేవంత్

### వేములవాడ ఆలయ విస్తరణపై చర్చలు



హైదరాబాద్, అక్టోబర్28( వెలుతురు):

హైదరాబాద్ పర్యటనలో ఉన్న శృంగేరీ పీఠం ఆచార్య శ్రీశ్రీ విధుశేఖర భారతీస్వామిని సిఎం రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌తో కలసి శంకరమఠంలో వేంచేసి వున్న స్వామిని దర్శించుకున్నారు. ఆయనతో వేములవాడ ఆలయ పునరుద్దరణ పనులపై చర్చించారు. సంప్రదాయ దుస్తుల్లో వెళ్లి స్వామి వారి ఆశీర్వాదం తీసుకున్నారు. అలాగే సిఎంకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందించి, వేదాశీర్వచనం చేశారు.

## ఎఐ టెక్నాలజీతో అప్రమత్తం

**- డీప్‌ఫేక్ మోసాలతో జాగ్రత్త**

**- సేఫ్‌వర్డ్ టెక్నిక్ సూచించిన సిపి సజ్జనార్**

హైదరాబాద్, అక్టోబర్28( వెలుతురు):

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఇప్పుడు మన జీవితంలో కీలకంగా మారింది. ఈ టెక్నాలజీ ఎంత శక్తివంతమైందో, అంతే ప్రమాదకరంగా కూడా మారుతోంది. ముఖ్యంగా డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా మన ముఖం, మన గొంతును కూడా కచ్చితంగా నకిలీగా సృష్టించడం సాధ్యమైంది. ఇప్పుడు ఎవరికైనా మీ వీడియో లేదా వాయిస్‌ను వాడి, మీరు మాట్లాడుతున్నట్లుగా నకిలీ సందేశాలు పంపడం, వీడియోలు తయారు చేయడం లేదా కాల్స్ చేయడం సాధ్యమవుతోంది. దీంతో వ్యక్తిగత, ఆర్థిక మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. తాజాగా పలు దేశాల్లోనే కాకుండా మన దేశంలో కూడా డీప్‌ఫేక్ ఆధారంగా మోసాలు జరుగుతున్నాయి. కొంతమంది మోసగాళ్లు మీ స్నేహితులు, బంధువులు, సహచరులు లేదా అధికారులుగా నటిస్తూ డబ్బు లేదా వ్యక్తిగత సమాచారం అడుగుతూ ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి మోసాలను గుర్తించడం చాలా కష్టంగా మారింది, ఎందుకంటే అవి నిజంగా ఉన్నట్లే కనిపిస్తాయి. ఇలాంటి మోసాల నుంచి రక్షణ పొందేందుకు ఒక సులభమైన కానీ అత్యంత ప్రభావవంతమైన పద్ధతి 'సేఫ్ వర్డ్'. అది మీరు మీ కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా సహచరులతో మాత్రమే పంచుకునే ఒక ప్రత్యేక పదం లేదా సంకేతం. ఏదైనా అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వస్తే, ఆ వ్యక్తి నిజమా కాదా తెలుసుకోవడానికి ఆ 'సేఫ్ వర్డ్' అడగాల్సి ఉంటుంది. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ ఈ విషయంలో ప్రజలకు హెచ్చరిక చేశారు. ఇలాంటి విషయాల్లో జాగ్రత్త అవసరమని అన్నారు. సేఫ్ వర్డ్ ఎలా ఉపయోగించాలంటే.. మీకు అత్యంత నమ్మకమైన వారితో ఒక ప్రత్యేక సేఫ్ వర్డ్ నిర్ణయించుకోండి. అనుమానాస్పద కాల్ లేదా మెసేజ్ వచ్చినప్పుడు ఆ వర్డ్ అడిగి ధృవీకరించండి. ఆ సేఫ్ వర్డ్‌ను బయట ఎవరితోనూ పంచుకోకండి. బ్యాంక్ వివరాలు, క్లిక్‌లు లేదా వ్యక్తిగత సమాచారం ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకండి. ఎఐ మన జీవితాన్ని సులభతరం చేస్తుంది, కానీ అదే మన భద్రతకు ప్రమాదం కావచ్చు. టెక్నాలజీపై అవగాహన కలిగి ఉండటం, కొత్త మోసాలపై అప్రమత్తంగా ఉండటం చాలా ముఖ్యం. 'సేఫ్ వర్డ్' వంటి చిన్న జాగ్రత్త ? పెద్ద ప్రమాదాల నుంచి మిమ్మల్ని కాపాడగలదన్నారు. ఇలాంటి మోసాలపై అవగాహన పెంచే ప్రయత్నంగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ ఎక్స్ లో ఒక హెచ్చరిక పోస్టు చేశారు. ఎఐ టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందుతుందో, అంతే జాగ్రత్త అవసరం అని ఆయన పేర్కొన్నారు. ప్రజలు తమ భద్రత కోసం 'సేఫ్ వర్డ్' విధానం తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఒక చిన్న జాగ్రత్త ? పెద్ద మోసాల నుండి కాపాడుతుంది అంటూ సజ్జనార్ విజ్ఞప్తి చేశారు.

## కేసులు నిజమైతే హైదరాబాద్ వీడుతా

**- లేదంటే కెటిఆర్, హరీష్ రావు వీడుతారా**

**- జూబ్లీహిల్స్ అభ్యర్థి నవీన్ యాదవ్ సవాల్**

హైదరాబాద్, అక్టోబర్28( వెలుతురు):



జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారం జోరుగా సాగుతోంది. ప్రచారంలో భాగంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లు నడుస్తున్నాయి. ఈ క్రమంలో జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ పై బీఆర్ఎస్ నేతలు సంచలన ఆరోపణలు చేశారు. దీనికి ప్రతిగా నవీన్ యాదవ్ బీఆర్ఎస్ నాయకులకి గట్టి సవాల్ విసిరారు. తన మీద పెట్టిన కేసులు నిజమైతే తాను రాజకీయాలని వదిలి.. హైదరాబాద్ విడిచి వెళ్లిపోతానని ఛాలెంజ్ చేశారు. కానీ ఆ కేసులు ఫాల్స్ అని తేలితే మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు రాజకీయాల నుంచి తప్పుకోవడానికి సిద్ధమా..? అంటూ సవాల్ విసిరారు. కేసీఆర్ ప్రభుత్వం తనపై, తన కుటుంబ సభ్యులపై, అనుచరులపై ఒకే సంవత్సరంలో 20 నుంచి 30 తప్పుడు కేసులు పెట్టిందని ధ్వజమెత్తారు. తన మీద రౌడీ అని ప్రచారం చేయడంపై బీఆర్ఎస్ నేతల కుట్ర ఉందని విమర్శించారు నవీన్ యాదవ్. తనకు న్యాయవ్యవస్థ నమ్మకం కలిగించిందని.. తనను కాపాడిందని ఉద్ఘాటించారు. అలాగే, కాంగ్రెస్ ప్రచార రథాన్ని తగులబెట్టే ప్రయత్నం చేసిన బీఆర్ఎస్ కార్యకర్తలపై కూడా కేసు నమోదైందని తెలిపారు. పోలీసులు ఈ విషయంపై చర్య తీసుకుంటారని చెప్పుకొచ్చారు. జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్‌పైన విశ్వాసం ఉంచారని నవీన్ యాదవ్ నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ అభివృద్ధి కాంగ్రెస్ గెలుపుతోనే సాధ్యమవుతుందని నవీన్ యాదవ్ స్పష్టం చేశారు.

# సినీ కార్మికులకు ప్రభుత్వం అండ

వచ్చానని గుర్తుచేసిన రేవంత్.. కార్మికుల కోసం ప్రభుత్వం చేయాల్సిన పనులు చేస్తాం. వెల్ఫేర్ ఫండ్‌కు 10 కోట్లు ఇస్తున్నాం. కష్టాల్లో ఉన్న కార్మికుల కోసం ఆ నిధులు వినియోగించండని అన్నారు. అంతేకాకుండా, సినిమా టికెట్ రేట్లు పెంచాలంటే కార్మికులకు 20 శాతం వాటా తప్పనిసరి ఇవ్వాల్సిందేనని అన్నారు.. ఆ వాటా వెల్ఫేర్ ఫండ్‌కు బదిలీ అవ్వాలి. లేదంటే టికెట్ ధరల పెంపుకు జీఓ ఇవ్వం అని స్పష్టం చేశారు. నిర్మాతలు, కార్మికులు కుటుంబ సభ్యుల్లా ఉండాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో భూమి కేటాయిస్తామని తెలిపారు. మీకు అవసరం ఉన్నప్పుడు మీకు అందుబాటులో ఉంటా. ప్రభుత్వం ఎల్లప్పుడూ మీ వెన్నంటే ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారు. సినీ కార్మికుల శ్రమ నాకు బాగా తెలుసు. మీ కష్టాలు తెలుసుకోలేనంతగా నా కళ్లు మూసుకోలేదని పేర్కొన్నారు. సినీ పరిశ్రమకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని సీఎం హామీ ఇచ్చారు.

ఒకప్పుడు సినీ పరిశ్రమ అంటే మద్రాసే అనుకునే వారు. కానీ, నేడు తెలుగు సినిమా ఆస్కార్ అవార్డుల వరకు వెళ్లగలిగింది. ఈ గౌరవం తెర వెనుక కష్టపడే కార్మికుల శ్రమ ఫలితమే అని రేవంత్ అభినందించారు. నిలిచిపోయిన నంది అవార్డులను ప్రజాయుద్ధ నౌక గద్దర్ పేరుతో అవార్డులను ఇస్తున్నామని సీఎం తెలిపారు. హాలీవుడ్ కూడా తెలంగాణకు వచ్చి షూటింగ్ చేసుకునేలా మారాలి. చిన్న సినిమాలను తక్కువ చేసి చూసే ప్రసక్తే లేదు. ఐటీ రంగానికి ఎంత ప్రాధాన్యత ఇస్తామో, సినిమా పరిశ్రమకూ అంతే ప్రాధాన్యత ఇస్తాం అని ఆయన అన్నారు. ఐటీ, ఫార్మా పరిశ్రమలు ఎలాగో.. ఫిల్మ్ ఇండస్ట్రీ కూడా అంతే. మీరు అండగా ఉంటే హాలీవుడ్‌ను హైదరాబాద్‌కు తీసుకువస్తా. హాలీవుడ్ సినిమాలు రామోజీ ఫిల్మ్‌సిటీ, హైదరాబాద్‌లో షూటింగ్‌లు జరిగేలా బాధ్యత తీసుకుంటాం. ప్రభుత్వం చేయగలిగిన పనులు చేస్తాం. సినిమా టికెట్ల పెంపు ద్వారా వచ్చిన ఆదాయంలో 20శాతం కార్మికులకు ఇవ్వాలి. కార్మికులకు లాభాల్లో 20శాతం ఇస్తేనే టికెట్ల ధరలు పెంచుకునేందుకు జీవో ఇస్తాం. త్వరలోనే సినీ కార్మికులకు ఇళ్ల స్థలాలు ఇస్తాం అని సీఎం తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వాలు సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం కృషి చేసినట్లు చెప్పిన సీఎం రేవంత్, 1964లో నంది అవార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిందని చెప్పారు. హైదరాబాద్ కు సినీ పరిశ్రమ రావడంలో మర్రిచెన్నారెడ్డి పాత్ర కీలక పాత్ర పోషించారని చెప్పారు. ఎంతో మందిని సంప్రదించి పరిశ్రమను తెచ్చారని గుర్తుచేశారు. డాక్టర్ ప్రభాకర్ రెడ్డి సినీ కార్మికులను ఆదుకున్నారని.. కార్మికుల కోసం పది ఎకరాలు ఇవ్వాలని తెలిపారు. పరిశ్రమను ప్రోత్సహించేందుకు కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు సీఎం. సినీ కార్మికులకు ఉచిత వైద్యం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నిర్మాత, ఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మొంథా తుఫాన్ ప్రభావం..

### పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలి..

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:

మొంథా తుఫాన్ కారణంగా పత్తి రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రైతులకు విజ్ఞప్తి చేశారు. సచివాలయంలో మంగళవారం రైతు నేస్తం కార్యక్రమంలో ఖమ్మం మంచిర్యాల కామారెడ్డి నల్గొండ వరంగల్ కరీంనగర్ నిజామాబాద్ రైతులతో మంత్రి తుమ్మల మాట్లాడి వారి సందేహాలు నివృత్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో చేతి కందిన పత్తి తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తేమ శాతం 12 శాతం మించకుండా చూడాలని కోరారు. మారిన వాతావరణ పరిస్థితులు దృష్ట్యా తేమ శాతం 20 వరకు ఉన్నప్పటికీ పత్తి కొనుగోళ్లు జరపాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ఈ వానాకాలం సీజన్ పత్తి కొనుగోళ్లు సీసీఐ ప్రారంభించింది, సోమవారం నాడు రాష్ట్ర వ్యాప్తంగా 72 జిన్నింగ్ మిల్లుల్లో కొనుగోళ్లు ప్రారంభించారు. 784 మంది రైతులకు చెందిన 1623 క్వింటాళ్ల పత్తి తొలిరోజు కొనుగోలు చేశారు. పత్తి కొనుగోళ్లకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 318 జిన్నింగ్ మిల్లులు నోటిఫై చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 45 లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేయగా 28 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనాలు. ఈ ఏడాది అధిక వర్షాల కారణంగా పత్తి దిగుబడులు తగ్గడం, మారిన వాతావరణ పరిస్థితుల దృష్ట్యా తేమ శాతం విషయంలో 12 శాతం పైగా ఉన్న పత్తిని కూడా కేంద్ర ప్రభుత్వం రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోళ్లు జరపాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర జౌళి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ చౌహాన్ కు లేఖ రాశారు.

తేమ విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి..

పత్తి రైతులు తేమ విషయంలో 12 శాతం మించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు, తేమ విషయంలో అప్రమత్తంగా లేకపోతే మద్దతు ధర దక్కక రైతులు నష్ట పోతారని మంత్రి తుమ్మల తెలిపారు.

రైతులు కపాస్ కిసాన్ యాప్ సద్వినియోగం చేసుకోవాలి

పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవడం కోసం ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారిక బృందాలు జిల్లాలో పర్యటించి ఏ ఈవో లు మార్కెట్ సెక్రటరీలు, జిల్లా మార్కెటింగ్ అధికారులు రైతులకు అందుబాటులో ఉంటారని మంత్రి తుమ్మల ప్రకటించారు. రైతులు యాప్ లో నమోదు చేసుకుంటే పత్తి అమ్ముకోవడంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉంటాయని తెలిపారు.

**టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు**

పత్తి రైతులకు ఎలాంటి సమస్యలు తలెత్తినా రైతుల సౌకర్యార్థం టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 5779 కి కాల్ చేయొచ్చని మంత్రి తుమ్మల ప్రకటించారు. పత్తి రైతులు ప్రభుత్వ మద్దతు ధరకు అమ్ముకునేలా ప్రజా ప్రభుత్వం లో అన్ని చర్యలు తీసుకున్నట్లు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి రైతులు పత్తి అమ్ముకునేలా సీసీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు.

నేటి నుంచి సోయాబీన్ కొనుగోళ్లు

నేటి నుంచి సోయాబీన్ కొనుగోళ్లు చేస్తున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. ప్రైస్ సపోర్ట్ స్కీమ్ లో మొక్కజొన్న జొన్నలు చేర్చాలని సోయా పై ఉన్న పరిమితులు ఎత్తి వేయాలని మంత్రి తుమ్మల కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

# "ఏరో-ఇంజిన్" రాజధానిగా తెలంగాణ











పేర్కొన్నారు. ఈ లక్ష్య సాధనకు అంతర్జాతీయ, జాతీయ దిగ్గజ ఏరో సంస్థలు రాష్ట్రంలో కొత్తగా పెట్టుబడులు పెట్టేలా సమగ్ర "రోడ్ మ్యాప్"ను సిద్ధం చేస్తున్నామన్నారు. "టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్", "సాఫ్రాన్ ఎయిర్‌క్రాఫ్ట్ ఇంజిన్స్" సంయుక్తంగా రూ.425 కోట్ల పెట్టుబడితో ఆదిభట్లలో ఏర్పాటు చేసిన "ఏరో ఇంజిన్ రొటేటివ్ కాంపోనెంట్స్" న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని మంగళవారం హైటెక్ సిటీలోని ఐటీసీ కోహినూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వర్చువల్‌గా ఆయన ప్రారంభించారు. గ్లోబల్ "ఏరోస్పేస్-డిఫెన్స్ - స్పేస్" హబ్ గా తెలంగాణ ను మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున తీసుకుంటున్న చర్యలను ఈ సందర్భంగా ఆయన వివరించారు. హైదరాబాద్ అంటే కేవలం "సిటీ ఆఫ్ పెరల్స్" మాత్రమే కాదని, ప్రొపల్షన్, ప్రెసిషన్, ప్రోగ్రెస్ నగరంగా మార్చేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామన్నారు. ఏరోస్పేస్, రక్షణ రంగాల ఎగుమతులు 2023-24లో రూ.15,900 కోట్లు ఉండగా, 2024-25 ఆర్థిక సంవత్సరంలో మొదటి 9 నెలల్లోనే ?30,742 కోట్లకు పెరిగాయన్నారు. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదని, తమ ప్రభుత్వ హయాంలో ఈ రంగం సాధించిన వృద్ధి రేటుకు నిదర్శనమన్నారు. ఈ "న్యూ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ"లో ఎయిర్‌బస్, బోయింగ్ సంస్థల లీప్ ఇంజిన్ల తయారీలో వినియోగించే బేరింగ్ హౌసింగ్ (స్టేషనరీ కాంపోనెంట్), లో ప్రెషర్ టర్బైన్ షాఫ్ట్ (రోటేటివ్ కాంపోనెంట్) తయారవుతాయన్నారు. ఫలితంగా తెలంగాణ బ్రాండ్ విశ్వవ్యాప్తమవ్వడంతో పాటు కొత్తగా 500 మందికి ఉపాధి లభిస్తుందన్నారు. "విమాన ప్రయాణ భవిష్యత్తును నిర్మించాలనుకుంటే - దానిని తెలంగాణలో నిర్మించండి" అని ఈ వేదికగా అంతర్జాతీయ దిగ్గజ ఏరో సంస్థలకు పిలుపునిచ్చారు. ఇంజిన్స్, కాంపోనెంట్స్, ఎమ్మార్వో, కన్వర్షన్స్, స్పేస్, డ్రోన్స్, డిజిటల్, ఏఐ మాన్యుఫ్యాక్చరింగ్ తదితర రంగాల్లో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ సీఈవో, ఎండీ సుకరన్ సింగ్, ఈడీ మసూద్ హుస్సేన్, సాఫ్రాన్ ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్స్ వైస్ ప్రెసిడెంట్ డొమినిక్ డూప్, టీజీఐఐసీ ఎండీ శశాంక, తెలంగాణ ఏరో స్పేస్, డిఫెన్స్ డైరెక్టర్ ప్రవీణ్ పీవీ తదితరులు పాల్గొన్నారు.

## లైంగిక వేధింపుల్లో హెచ్‌ఎం, సిబ్బంది పాత్రపై కొనసాగుతున్న విచారణ

భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందనే ఉద్దేశంతోనే ఈ విషయాన్ని బయటకు రానియ్యలేదన్నారు. ఈ వ్యవహారంలో సంబంధిత పాఠశాల హెడ్మాస్టర్ నిర్లక్ష్యం ఉన్నట్లు తేలడంతో ఈరోజు హెచ్‌ఎం ను కూడా సస్పెండ్ చేశారన్నారు. ఒకవేళ లైంగిక వేధింపుల విషయంలో హెచ్‌ఎం, ఇతర సిబ్బంది పాత్రపైనా విచారణ కొనసాగుతోందన్నారు. మంగళవారం రోజున వారి పాత్ర కూడా ఉన్నట్లు తేలితే వారిపైనా పోక్సో కేసు నమోదు చేసేందుకు వెనుకాడొద్దని ఇప్పటికే జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ ను కోరినట్లు తెలిపారు. మంగళవారం రోజున కరీంనగర్ లో ఓ ప్రైవేట్ చైల్డ్ రిహాబిలిటేషన్ సెంటర్ ప్రారంభోత్సవానికి విచ్చేసిన కేంద్ర మంత్రి బండి సంజయ్ వద్ద మీడియా ప్రతినిధులు ఈ అంశాన్ని ప్రస్తావించగా పై విధంగా స్పందించారు. "నిన్న కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలో జరిగిన ఘటన దారుణం. ఇది పోక్సో కేసు. పిల్లల జీవితాలతో ముడిపడి ఉన్న సమస్య. దీనిని ప్రచారం చేయడంలో వాళ్ల జీవితాలు ప్రమాదంలో పడతాయి. దయచేసి మీడియా సంయమనంతో వ్యవహరించాలి"అని అభ్యర్థించారు. "ఈ వ్యవహారంపై జిల్లా కలెక్టర్, పోలీస్ కమిషనర్ గత 5 రోజుల నుండి లోతైన విచారణ జరిపించారు. నివేదిక తెప్పించారు. నిందితుడికి ఏ విధమైన ట్రీట్ మెంట్ ఇవ్వాలో ఆ ట్రీట్ మెంట్ ఇస్తున్నారు. ఈ వ్యవహారంలో హెడ్మాస్టర్ నిర్లక్ష్యం కూడా ఉన్నట్లు తేలింది. దీంతో ఆమెను సస్పెండ్ చేశారు. వారి పాత్ర ఉంటే వాళ్లపైనా పోక్సో కేసు పెట్టేందుకు వెనుకాడవద్దని అధికారులకు చెప్పాను. పిల్లలకు భరోసా ఇవ్వడంతోపాటు వారి తల్లిదండ్రులు ఆందోళన పడకుండా ధైర్యం కల్పించాలని కోరిన. విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి భరోసా కల్పించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు."అని వివరించారు. హుస్నాబాద్ నియోజకవర్గంలోని వంగర గురుకుల పాఠశాలలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని మీడియా ప్రస్తావించగా "వంగర గురుకుల పాఠశాలలో విద్యార్థిని ఆత్మహత్య దారుణం. నిర్భంద విద్య కోసం ఇబ్బంది పెట్టకుండా విద్యార్థుల మానసిక పరిస్థితిని తెలుసుకుని అందుకు అనుగుణంగా వ్యవహరించాలి. దురదృష్టమేమిటంటే ఆనాడు బీఆర్ఎస్ హయాంలోనూ గురుకులాలు, హాస్టళ్లలో విద్యార్థులు పెద్ద ఎత్తున ఆత్మహత్యలు చేసుకున్నారు. బాసర ట్రిపుల్ ఐటీలోనూ ఆత్మహత్యల పరంపర కొనసాగింది. నెలల తరబడి విద్యార్థులు ఆందోళన చేపట్టారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే పరిస్థితి మారుతుందేమోనని అందరూ భావించారు. కానీ కాంగ్రెస్ పాలనలోనూ ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. గురుకులాలు, హాస్టళ్ల దుస్థితి మారలేదు. ఒక ఘటన జరిగితే అది మళ్లీ పునరావృతం కాకుండా కఠినంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కానీ ప్రభుత్వం గురుకులాలను, హాస్టళ్లను గాలికి వదిలేయడంవల్లే ఈ దుస్థితి నెలకొంది. ఇకనైనా ప్రభుత్వంపై గురుకులాలు, హాస్టళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా."అని వివరించారు.

భారీ వర్షాల నేపథ్యంలో....

మొంథా తుఫాను ప్రభావంవల్ల తెలుగు రాష్ట్రాలకు నేడు, రేపు భారీ నుండి అతి భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలందించేందుకు సిద్ధంగా ఉన్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. "ఇప్పటికే ఎన్డీఆర్ఎఫ్ టీంలను అలర్ట్ చేశాం. ఆంధ్రప్రదేశ్ లోని 19 జిల్లాల్లో వర్ష ప్రభావం భారీగా ఉన్నందున ఆ రాష్ట్రానికి అవసరమైన ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ఇప్పటికే పంపించాం. ఎన్డీఆర్ఎఫ్ ఉన్నతాధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతున్నాం. అవసరమైతే అదనపు టీంలను పంపేందుకు సిద్ధంగా ఉన్నాం. తెలంగాణలోనూ పెద్దపల్లి, ములుగు, భూపాలపల్లి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశమున్నందున ఆయా జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలి. అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ప్రాణ నష్టం లేకుండా చూడాలి. కేంద్రం పక్షాన అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం."అని పేర్కొన్నారు.

## 1.27 ఎకరాల పార్క్ స్థలానికి విముక్తి

**- కబ్జా చెరనుంచి విడిపించిన హైడ్రా**

హైదరాబాద్,అక్టోబర్28( వెలుతురు):

అక్రమ కట్టడాలు కూల్చేవేతే ధ్యేయంగా ఏర్పాటైన హైడ్రా.. ఆ దిశగా దూసుకుపోతోంది. మంగళవారం నగరంలో చేర్యాల చోట్ల ఆక్రమణలు తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో సంబంధిత అధికారులతో కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. ఆయన ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకున్నారు. రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్ మండలం కర్మన్‌ఘాట్ విలేజ్‌లోని హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో 1.27 ఎకరాల పార్కు కబ్జా చేశారంటూ అసోసియేషన్ ప్రతినిధులు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన హైడ్రా.. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని పరిశీలించింది. పార్కు స్థలాన్ని లేఔట్‌లో చూపించి తర్వాత ప్లాట్లుగా విక్రయిస్తున్నారని గ్రహించి ఆక్రమణలను హైడ్రా తొలగించింది. చుట్టూ ఫెన్సింగ్ వేసి హైడ్రా కాపాడినట్లు పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. శేరిలింగంపల్లి జోన్ చందానగర్ సర్కిల్ పరిధిలోని గంగారాం కాలనీలో సుభాష్‌నగర్ పేరిట 1974లో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు చెందినవారు లే ఔట్ వేశారు. ఇందులో 700 గజాల స్థలాన్ని ప్రజావసరాలకు కేటాయించారు. పేదల అవసరాల కోసం కేటాయించబడిన ఈ లేఔట్‌లో బదాబాబు పాగా వేశారు. ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాన్ని ఎ+-లాట్లుగా మార్చారు. ఇలా ఆక్రమణలకు గురైన స్థలాన్ని కాపాడాలని అక్కడి నివాసితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. రంగంలోకి దిగిన హైడ్రా ఆక్రమణలు తొలగించి ఫెన్సింగ్ వేసింది.

## వికారాబాద్‌లో 'సర్దార్ ఏ150 ఐక్యతా మార్చ్' పోస్టర్ ఆవిష్కరణ

# సర్దార్ పటేల్ సేవలను స్మరించుకుందాం

**- : ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి**



**వికారాబాద్ జిల్లా వెలుతురు అక్టోబర్ 28:** స్వాతంత్ర్య సమరయోధుడు, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ 150వ జయంతి సందర్భంగా నిర్వహించే 'సర్దార్‌ఏ150ఐక్యతా మార్చ్' పోస్టర్ ను వికారాబాద్ జిల్లా లోని కల్లెక్ట్రేట్ కార్యాలయం సమావేశము హాలు నందు పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి , జిల్లా అదనపు కలెక్టర్ సుదీర్ తో కలిసి ఆవిష్కరించారు. దేశంలోని 560 సంస్థానాలను ఒక్క జెండా కిందకు తెచ్చి, భారతదేశాన్ని ఏకం చేసిన మహనీయుడు సర్దార్ సర్దార్ వల్లభాయి పటేల్ అయన 150వ జయంతి సందర్భంగా జిల్లా ప్రింట్ మరియు ఎలెక్ట్రానిక్ మీడియా ప్రతినిదులతో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో తెలిపారు. మీడియా ను ఉద్దేశించి మాట్లాడుతూ సర్దార్ వల్లభాయి పటేల్ గారిని ప్రతి ఒక్కరు స్మరించుకునేలా దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పాదయాత్రలు నిర్వహించడం జరుగుతుందని, వికారాబాద్ జిల్లాలో పార్టీలకతీతంగా ఉత్సవాలను నిర్వహించాలని తెలిపారు. భారత దేశం లో ఒక దేశం, రాజ్యాలు, రాజులూ నవాబులు చిన్న చిన్న దేశాలను ఒక్కటిగా ఐక్యత చేసింది వల్లభాయి పటేల్ అన్నారు. అయన ఒక రైతు బిడ్డ, పోల్లాలకు వెళ్లి పని చేసే వారని, వ్యవసాయము చేసి దేశాన్నే ఐక్యత చేసారన్నారు. ప్లీడర్ పరీక్షలు రాసి రెవెన్యూ ప్లీడర్ గా పనిచేసారన్నారు. అక్టోబర్ 6 నుండి నవంబర్ 25 వరకు ఎస్ ఎ, క్విజ్ , రీల్స్, కాంపిటిషన్స్ నిర్వహించడం జరుగుతుందని, గెలిచినా వారికీ ప్రపంచ ములో అతి పెద్ద స్టా చ్యూ చూసే యాత్రకు వెళ్ళే అవకాశము కల్పించ బడుతుందని యువతలో ఐక్యతా స్ఫూర్తిని నింపేలా సదరు కార్యక్రమాలకు విస్తృత ప్రచారం కల్పించాలని మీడియాను, సోషల్ మీడియా వారియర్స్ ను కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుదీర్, డి ఆర్ ఓ మంగీ లాల్ , జిల్లా యూత్ ఆఫీసర్ ఐజయ్య, ఉద్యాన వన శాఖఅధికారి సత్తార్, ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు తదితరులు పాల్గొన్నారు.




# ఐఏఎస్ ల పనితీరుపై ప్రజల అసంతృప్తి

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** తెలంగాణ లో ఐఏఎస్ అధికారుల తీరుపై రోజు రోజు ప్రజల్లో నమ్మకం సన్నగిల్లుతుంది. తాజాగా సీనియర్ ఐఏఎస్ రిజ్వి అంశం తరువాత మరికొంత మంది ఉన్నత అధికారుల తీరుపై విమర్శలు వస్తున్నాయి. ఒక్క రిజ్వి ఎపిసోడ్ లోనే దాదాపు రెండు వందల కోట్ల గోల్ మాల్ జరిగినట్లు తెలుస్తుంది. ఇలాంటి ఐఏఎస్ లు ఇంకా తొమ్మిది మంది ఉన్నట్లు సమాచారం. ఫైళ్లు సరిగా చూడని అధికారులు మాణిక్ రాజ్, శ్రీనివాస రాజ్ (ఈయన రిటైర్డ్ అయ్యి ఏడాది అవుతుంది) ఒక్క ఆఫీసర్ ను కలవరు. ఒక్క రివ్యూ చేయరు. ఇక మరో ఆఫీసర్ ఇలంబర్తి దాదాపు వెయ్యి ఫైళ్లు పెండింగ్ లో పెట్టి కాలయాపన చేస్తున్నారు. ఐఏఎస్ శ్రీధర్ పరిస్థితి ఇలాగె ఉంది. పిఆర్ డిపార్ట్మెంట్ లో ఇదే తంతు. నదీమ్ అహ్మద్ పరిస్థితి అలాగే ఉంది. ఇక అత్యంత దారుణంగా సర్ఫా రాజ్ వ్యవహార శైలి ఉందంటున్నారు. మరో సీనియర్ ఆఫీసర్ జయేష్ రంజన్ కూడా అంతే ఎవరిని కలవడు. మరో ఆఫీసర్ బుద్ద ప్రకాష్ కూడా తన శాఖలో ఇలాగె వ్యవహరిస్తున్నారు. ఇక పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సెక్రెటరి వ్యవహార శైలి కూడా దారుణంగా ఉందన్న ప్రచారం ఉంది. వాటర్ వర్క్స్ ఎండి అశోక్ రెడ్డి అడ్మినిస్ట్రేషన్ వదిలేసి భారీగా ఆస్తులు కూడా బెట్టే పనిలో ఉన్నారట. టూరిజం అండ్ మైన్స్ బాధ్యతలు చూసే వాళ్ళురి క్రాంతి కూడా ఇదే కోవలో ఉన్నారు. మరో ఐఏఎస్ ముషారప్ అలీ కూడా ఎవరిని కలవరు. ఇక ప్రజలతో నిత్యం సంబంధాలు కలిగి ఉండి ఎక్కడ సమస్య వచ్చిన వెంటనే స్పందించే ఐఏఎస్ లు గా లోకేష్ కుమార్, వికాస్ రాజ్, శ్రీదేవి, సందీప్ కుమార్ సుల్తానియా, దాన కిషోర్, రాహుల్ బొజ్జ, మహేష్ దత్ ఎక్కా, హరిత, శేషాద్రి, దేవసేన, సృజన లాంటి ఆఫీసర్లకు ప్రజల్లో మంచి అభిప్రాయం ఉంది. కొంతమంది ఆఫీసర్ల వల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. సెక్రెటరీ లెవల్ లో క్లియర్ కావాల్సిన ఫైళ్లు కూడా పైనుండి తమకు ఆదేశాలు వస్తేగాని చేయలేమని చెప్తున్నారట. ఉన్నత చదువులు చదువుకొని సీనియర్ ఐఏఎస్ లు ఇలా పెద్దల ఒత్తిడికి తలొగ్గి ఉండటం వల్ల ప్రజలకు తీరని అన్యాయం జరుగుతుంది.



# జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి





**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో భాగంగా బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి గారు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శ్రీనగర్ కాలనీలో గడప గడపకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి గారు మాట్లాడుతూ కమలం పువ్వు గుర్తుపై ఓటువేసి భారతీయ జనతా పార్టీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గారిని గెలిపించాలని కోరారు. ఈ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో అలవికాని బూటకపు హామీలు ఇచ్చి గద్దెనెక్కి 2 సంవత్సరాలు గడుస్తున్నా, హామీల అమలులో వైఫల్యం చెందారని మండిపడ్డారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి, అరాచకాలు, కుంభకోణాలు పెరిగిపోయాయని, మంత్రులకు ముఖ్యమంత్రి గారికి కమీషన్లు, అవినీతి మీద ఉన్న శ్రద్ధ ప్రజా సంక్షేమం పట్ల లేదని ఎద్దేవా చేశారు.



కేంద్రం లోని బీజేపీ ప్రభుత్వం అనేక విప్లవాత్మక నిర్ణయాలు తీసుకుంటూ దేశాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతూ, మోదీ గారి నాయకత్వంలో ప్రపంచంలో ఒక బలమైన ఆర్థిక శక్తిగా ఏర్పడిందని అన్నారు . బీజేపీ అభ్యర్థి లంకల దీపక్ రెడ్డి గారిని గెలిపిస్తే బీజేపీ తరపున మరో ప్రజా గొంతుకగా మాకు బలం చేకూరుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీజేపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## తక్షణ చర్యలకు ఆదేశించిన టీజీ ఎస్సి పిసిఆర్

**- తెలంగాణ స్టేట్ హెూం పరిరక్షణలో పది రోజుల పసికందు**

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** నాలుగో సారి ఆడబిడ్డ పుట్టిందని కేవలం పది రోజులు పసిగుడ్డును అమ్మేశారు కన్నవారు. ఈ దారుణమైన సంఘటన నల్గొండ జిల్లా కేంద్రంగా చోటు చేసుకుంది. నల్గొండ బిటిఎస్ కి చెందిన కుర్ర బాబుకి నాలుగో సంతానంలో కూడా అమ్మాయి పుట్టడంతో కుటుంబానికి అమ్మాయి భారంగా ఉందనే ఉద్దేశంతో ఆంధ్ర ప్రదేశ్ లోని ఏలూరుకు చెందిన వ్యక్తులకి అమ్మ చూపాడు. నల్గొండ జిల్లా ఐసిడిఎస్ సిబ్బంది, చైల్డ్ ప్రొటెక్షన్, సిడబ్ల్యుసి అధికారులు అతని పట్టుకొని విచారణ చేపట్టారు. ఈ నేపథ్యంలో పాప తండ్రి తను ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న మూలంగా ఈ పని చేసినట్లు తెలిసింది. చట్ట విరుద్ధంగా పసికందు దత్తతను ప్రోత్సహించిన వారి పై చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించిన తెలంగాణ రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్. మరోవైపు నల్గొండ జిల్లా కేంద్రంలో పదే పదే ఈ విదంగా జరుగుతున్న అధికారులు నిర్లక్ష్యాన్ని చూపుతున్నారు, ఈ కారణంగా అధికారుల నిర్వహణ పై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషన్ .

## నల్గొండ జిల్లాలో కన్నబిడ్డ విక్రయ ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క సీరియస్



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** నల్గొండ జిల్లాలో చోటుచేసుకున్న కన్నబిడ్డ విక్రయ ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటనపై మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా తో మాట్లాడి వెంటనే పూర్తి నివేదిక సమర్పించాలని ఆదేశించారు. పిల్లల అమ్మకాలపై, అక్రమ దత్తత పై ప్రత్యేక డ్రైవ్ లు నిర్వహిస్తున్నా.. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. శిశువును సంరక్షణలోకి తీసుకొని తల్లి పరిస్థితిని తెలుసుకోవాలని, సంబంధిత అధికారుల నిర్లక్ష్యం ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. "తల్లి–బిడ్డల రక్షణ మా ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యం. పేదరికం లేదా అజ్ఞానం కారణంగా ఇలాంటి దారుణాలు జరగడం మనసుకు బాధ కలిగిస్తుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తప్పవు" అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ, బాలల సంరక్షణ కేంద్రాల ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆమె సూచించారు. సమాజం కూడా ఇలాంటి అన్యాయాలను నిరోధించడానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# టీకాలతో పశువుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయి

**రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి**



**వెలుతురు , భూపాలపల్లి నియోజకవర్గం అక్టోబర్ 28:** పశువులకు సకాలంలో గాలికుంటు నివారణ టీకాలు వేయించడం ద్వారా పశువుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటాయని రాష్ట్ర పశుసంవర్ధక,పాడి పరిశ్రమాభివృద్ధి, మత్స్య మరియు క్రీడల మరియు యువజన సర్వీసులు శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. మంగళవారం రోజున భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండల కేంద్రంలో పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ జయశంకర్ భూపాలపల్లి జిల్లా వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జాతీయ పశువ్యాధుల నివారణ కార్యక్రమం మరియు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయి కుమార్, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ లతో కలిసి పాల్గొన్నారు. పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసిన అనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పశువులకు టీకాలు వేయించటం ద్వారా పశువుల్లో రోగ నిరోధక శక్తి పెరిగి, వ్యాధుల ప్రభావం తగ్గుతుందన్నారు. గాలికుంటు వంటి వ్యాధులు పశువుల పాలు, ఉత్పత్తితో పాటు రైతుల ఆదాయంపై ప్రతికూల ప్రభావం చూపుతాయన్నారు. ప్రతీ ఒక్క రైతు తన పశువులకు తప్పనిసరిగా 6 నెలల వ్యవధిలో సంవత్సరానికి 2టీకాలు వేయించాలని మంత్రి సూచించారు. గత ప్రభుత్వం పాడిపరిశ్రమ ను పూర్తిగా విస్మరించింది. అస్సలు ఈ శాఖను పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. గత ప్రభుత్వం వరివేస్తే ఉరి అన్నారు కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తరువాత సిరి అని నిరూపించారన్నారు రాష్ట్రంలో అర్హులైన ప్రతిపేదవానికి ఇందిరమ్మ ఇళ్లు పార్టీలకు అతీతంగా ఇస్తుందని తెలిపారు





బీద,బడుగు,బలహీన వర్గాల సంక్షేమానికి పెద్దపీట వేసే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు వారు చేయలేని పనులు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్న అక్కసుతో కొంతమంది మాట్లాడుతున్నారన్నారు. ఎవరు ఎన్ని మాట్లాడినా వారి ప్రజలు పట్టించుకోరున్నారు

# అంగన్వాడీ నియామకాల ప్రక్రియ వేగవంతం

**- సుప్రీం కోర్టు స్టేను తొలగించుకునేలా చట్టపరమైన చర్యలు ప్రారంభించాలని మంత్రి సీతక్క ఆదేశాలు**

**- లా సెక్రటరి, పీఆర్సీ చైర్మన్ తో సమావేశమైన మంత్రి సీతక్క**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. నియామకాలకు ఆటంకంగా ఉన్న సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు వెంటనే చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమయంలో నియామకాలకు ఆటంకంగా ఉన్న సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు చేపట్టాలని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు సచివాలయంలో మంగళవారం నాడు లా సెక్రటరీ బీ. పాపిరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్, పీఆర్సీ చైర్మన్ ఎన్. శివశంకర్‌లతో మంత్రి సీతక్క సమావేశం నిర్వహించారు. అంగన్వాడీల నియామకాల్లో ఎదురవుతున్న న్యాయ చిక్కులపై చర్చించారు. న్యాయ చిక్కులను అధిగమించే దిశలో వారి సలహలు, సూచనలు తెలుసుకున్నారు. సమావేశంలో శాఖ సెక్రటరీ అనితా రామచంద్రన్, డైరెక్టర్ శృతి ఓజా పాల్గొన్నారు. రాష్ట్రంలో సుమారు 14 వేల వరకు అంగన్వాడీ ఖాళీలుండగా, వాటి భర్తీపై గతంలో ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిన సంగతి తెలిసిందే. ఏజెన్సీ ప్రాంతాల్లో టీచర్, హెల్పర్ పోస్టులను ఎస్టీలకు రిజర్వ్ చేసిన ప్రభుత్వం, చిన్నారులు తమ మాతృభాషలో నేర్చుకోవడం సులువవుతుందన్న ఉద్దేశంతో ఆ నిర్ణయం తీసుకుంది. అయితే ఈ రిజర్వేషన్లు 50 శాతం మించిపోవడంతో, కొందరు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించడంతో సుప్రీం కోర్టు స్టే విధించింది. ఈ నేపథ్యంలో స్టేను వెకేట్ చేయించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని, ఆ దిశగా లా సెక్రటరీ పాపిరెడ్డికి మంత్రి సీతక్క సూచించారు. రిక్రూట్‌మెంట్, సర్వీస్ రూల్స్‌లో నిపుణుడైన ఎన్. శివశంకర్ సలహాలతో ముందుకు వెళ్లాలని మంత్రి ఆదేశించారు. అయితే మంత్రి సీతక్క ఆదేశాలతో మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు ఇప్పటికే కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో పర్యటించి అంగన్వాడీ రిక్రూట్‌మెంట్ విధానాన్ని అధ్యయనం చేసి నివేదిక సమర్పించారు. ఆ రాష్ట్రాల్లో అంగన్వాడీ పోస్టులు ప్రభుత్వ సర్వీస్ కిందకు రాకపోవడం వలన సబార్డినేట్ సర్వీస్ రూల్స్ వర్తించవని, దీంతో రిజర్వేషన్లు 50 శాతం పరిమితి వర్తించదని అధికారులు వివరించారు. పోరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఏజెన్సీ ప్రాంతాల్లో అంగన్వాడీ పోస్టులు ఎస్టీలకే రిజర్వ్ చేసిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. దీనికి అనుగుణంగా తెలంగాణలోనూ అదే విధానాన్ని అవలంబించి సుప్రీం కోర్టు స్టేను వెకేట్ చేయించాలని మంత్రి సీతక్క ఆదేశించారు. ఈ మేరకు సుప్రీం కోర్టులో వెకేట్ పిటిషన్ దాఖలు చేసి, స్టేను తొలగించుకునే చర్యలు వెంటనే ప్రారంభించాలని సూచించారు. సుప్రీం కోర్టు స్టేను తొలగించుకునేందుకు చట్టపరమైన చర్యలు ప్రారంభించి, 10 రోజుల్లో నియామక ప్రక్రియకు మార్గం సుగమం చేయాలని మంత్రి సీతక్క ఆదేశించారు. అంగన్వాడీ సేవలను మరింత బలోపేతం చేసే దిశలో కొత్త నియమాకాలు దోహద పడుతాయని..అందుకే అంగన్వాడీల నియమాకాలను సత్వరం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

# సంపాదకీయం.. ఎల్ఐసి ఉనికికే ప్రమాదం !

ఆదానీతో మోడీ బంధం ఎంతో బలమైనది. అది ఫెవికాల్ లాంటిది. దానిని విడదీయడం అంత సులువు కాదు. గత పదేళ్లుగా ఇది రుజువైన విషయం. ఆదానీ కంపెనీపై వరుసగా విమర్శలు వస్తున్నా ..ఏనాడూ చర్యలు తీసుకోలేదు. సరికదా ఖండించడానికి కూడా ప్రధాని మోడీ పెదవి విప్పలేదు. ఆదానీ వ్యవహారంపై గతంలో పార్లమెంట్ స్తంభించింది. ఆదానీ గ్రూపు ఆర్థిక అవతవకలు, అమెరికా సంస్థ ఆరోపణలు అలా ఉండగానే తాజగా ఆ కంపెనీకి ఎల్ఐసి మొత్తాన్ని ధారపోసారు.గుట్టుచప్పుడు కాకుండా వ్యవహారం నడిచింది. ప్రతిష్టాత్మక ప్రభుత్వరంగ సంస్థ అయిన భారత జీవిత బీమా సంస్థ ఎల్ఐసిని అదానీ ప్రయోజ నాల కోసం కేంద్ర ప్రభుత్వం బలి పెట్టడంపై వస్తున్న విమర్శలను సైతం పట్టించుకోవడం లేదు. అంటే ప్రధాని మోడీ తన ప్రధాని పదవిని అడ్డం పెట్టి ఆదానీకి అండగా నిలబడ్డారని వేరుగా చెప్పనక్కరలేదు. కోట్లాదిమంది పాలసీదారుల, ఉద్యోగుల, అధికారుల ప్రయోజనాలను అదానీ వ్యాపార కాంక్షకు సమిధలు చేయడం అమానుషం. నిజానికి గతంలోనే ఎల్ఐసిని ప్రైవేటీకరించాలని చూశారు. దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసనలు వచ్చాయి. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సైతం ప్రైవేటీకరణకు రంగం సిద్ధం చేశారు. కానీ బిజెపికి పూర్తి మెజార్టీ రాకపోవడం, ఎపిలో చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడడంతో ఆగిపోయింది. ఎల్ఐసిని ప్రైవేటీకరిస్తే ఆదానికి అప్పగించేవారేమో అన్న అనుమానాలు ఇప్పుడు కలుగుతున్నాయి. దేశీయంగా ఉన్న కంపెనీలను ఇలా తన తాబేదార్లకు కట్టబెట్టే కుట్ర లోపాయకారిగా జరుగుతున్నదని ప్రజలు గుర్తించాలి. ఎల్ఐసి మొత్తాలను ఆదానికి అప్పుగా బదిలీ చేయడంపై దేశంలో అప్పుడే నిరసనలు మొదలయ్యాయి. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, తెలుగు రాష్ట్రాల్లో లెఫ్ట్ నేతలు కూనంనేని సాంబశివరావు, బివి రాఘవులు వంటివారు, మరికొందరు నిరసనల గళం విప్పారు. బీహార్ ఎన్నికల సందడిలో ఇదంతా గుట్టు చప్పుడు కాకుండా సాగిపోతోంది. సామాన్యుల చెమట చుక్కలే పెట్టుబడిగా ఎదిగిన ఎల్ఐసికి చెందిన వేల కోట్ల రూపాయల మొత్తాన్ని అదానీ గ్రూపునకు గుట్టుచప్పుడు కాకుండా మళ్ళించేందుకు అత్యున్నత స్థాయిలో కుట్ర జరిగిందన్నది చెప్పకనే చెప్పవచ్చు.




అమెరికా నుండి వెలువడే 'వాషింగ్టన్ పోస్ట్' పత్రికలో ఈ కథనం తొలుత రావడం గమనార్హం. అంతర్జాతీయంగా విత్తసంస్థలు అదానీకి అప్పులు ఇవ్వడానికి నిరాకరిస్తున్న సమయంలో కేంద్ర ప్రభుత్వం 3.9 మిలియన్ డాలర్లు అంటే 33 వేల కోట్ల రూపాయలను అదానీ గ్రూపునకు మళ్లించడానికి సిద్ధమైందని వార్తలు వచ్చాయి. ఇందులో భాగంగానే అదానీ పోర్ట్స్ అనుబంధ సంస్థ రుణాల రీఫైనాన్స్ కోసం జారీ చేసిన 585 బిలియన్ డాలర్ల దాదాపు రూ.5,000 కోట్లు బాండ్లను ఎల్ఐసి కొనుగోలు చేసింది. 'అదానీపై లంచం, మోసం ఆరోపణలపై అమెరికా కోర్టుల్లో కేసులు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అనేక అమెరికా, యూరోపియన్ బ్యాంకులు రుణాలు ఇవ్వడానికి వెనుకాడాయి. కానీ.. భారత ప్రభుత్వం మాత్రం అదానీ కోసం ప్రత్యేక ఆర్థిక మద్దతు ప్రణాళికను రూపొందించిందని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది. ఆర్థిక సేవల విభాగం (డిఎఫ్ఎస్), ఎల్ఐసి నుండి పొందిన అంతర్గత పత్రాలు సహా అధికారులు, బ్యాంకర్లతో ఇంటర్వ్యూల ఆధారంగా ప్రభుత్వం ఈ నిధుల మళ్లింపునకు ఏ విధంగా పాల్పడిందో గుర్తించామని వాషింగ్టన్ పోస్ట్ పేర్కొందంటే పథకం ఎంత పకడ్బందీగా రూపొందించారో తేటతెల్లమవుతుంది. ఆదానీ పోర్ట్సు అప్పటికే తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడం కోసం బాండ్లను జారీ చేయాలని నిర్ణయించుకున్న సమయంలోనే ఉన్నత స్థాయిలో ఎల్ఐసి నిధుల తరలింపునకు సంబంధించిన ప్రణాళిక సిద్ధమైందని అర్థం అవుతోంది. మే 30వ తేదీన అదానీ పోర్ట్సు విడుదల చేసిన మొత్తం బాండ్లను ఎల్ఐసి కొనేసింది. అదానీ గ్రూపు షేర్లు, బాండ్లు కొనడానికి విదేశీ విత్త సంస్థలేవీ సిద్ధం కాని నేపథ్యంలో భారత ప్రభుత్వరంగ బీమా సంస్థచేత కొనిపించి, అదానీ గ్రూపునకు విశ్వసనీయత కల్పించాలన్నదే ఆ పథకంలో భాగంగా అర్థం చేసుకోవచ్చు. ఆ పాచిక పారింది కనుకనే అంతకు ముందు వెనక్కి తగ్గిన అమెరికా సంస్థ ఏథెన్ ఇన్సూరెన్స్ జూన్‌లో 750 మిలియన్ డాలర్లు అంటే సుమారు రూ.6,650 కోట్లు పెట్టుబడులు పెట్టింది. ఆదానీ ఆర్థిక అక్రమాలు, అవినీతిపై 2023 జనవరిలో హిండెన్‌బర్గ్ రీసెర్చ్ వరుస రిపోర్టులను విడుదల చేసింది. అదానీ కృత్రిమంగా తన కంపెనీల షేర్లను పెంచుకుంటున్నారని.. డొల్ల కంపెనీలతో పన్నులు ఎగ్గొడుతున్నారని విశ్లేషించింది. అదానీ కంపెనీలు ప్రమాదకర అప్పుల్లో ఉన్నాయని కూడా వెల్లడించిన విషయం తెలిసిందే. దీనికి తోడు తాజాగా వాషింగ్టన్ పోస్ట్ రిపోర్ట్ ఇటు ప్రభుత్వ వర్గాల్లోనూ, అటు ఇన్వెస్టర్లు, కార్పొరేట్ వర్గాల్లో మరోసారి తీవ్ర చర్చకు దారి తీసింది. అయితే అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడులకు సంబంధించి తమపై ఎవరి ఒత్తిళ్లు లేవని ఎల్ఐసి పేర్కొంది. బోర్డు ఆమోదించిన విధి విధానాల మేరకే తాము పెట్టుబడులు పెడతామని, వాటిపై తమదే తుది నిర్ణయమని బుకాయించింది. అందువల్ల ఎల్ఐసిలో ఏం జరుగుతుందో దేశ ప్రజలకు తెలపడం ప్రభుత్వ బాధ్యత. ఈ వ్యవహారంపై పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించడం అవసరమన్న డిమాండ్‌ను కూడా ఆమోదిం చాలి. ఇంతపెద్ద మొత్తంలో వ్యవహారం గుంభనంగా సాగడాన్ని అడ్డుకోవాలి. ఎల్ఐసిని మరోమారు ప్రైవేట్ రంగానికి అప్పగించే కుట్రలో కూడా ఇదో భగంగా చూడాలి. అందుకోసం ప్రభుత్వంపై ప్రజల ఒత్తిడి పెరచాలి. పాలకుల కార్పొరేట్ అనుకూల నిర్ణయాలపై నిలదీయాలి. లేకుంటే ప్రభుత్వరంగ సంస్థలు ప్రైవేట్ కావడం ఖాయం. దీనిపై విపక్ష కాంగ్రెస్ గట్టిగా నిలబడాలి. నిజానిజాలను వెల్లడించేందుకు పోరాటం చేయాలి. ఓట్ చోరీ పక్కన పెట్టి ఎల్ఐసిని రక్షించే పోరాటానికి దిగాలి. అందుకు దేశంలోని ప్రజలు కూడా అడుగులు వేయాలి.

## కేంద్రానికి దివాళాకోరు విధానం

**- ఎల్ఐసి మొత్తాలను ఆదానికి బదలాయించే కుట్ర**

**- టీచర్స్ ఎంఎల్సి బి గోపీమూర్తి తదితరుల ఆందోళన**



**విజయవాడ,అక్టోబర్28( వెలుతురు):**

ఎల్ఐసిలోని వేల కోట్ల రూపాయలను అదానీకి అప్పనంగా అప్పగించిన కేంద్ర ప్రభుత్వ దివాళాకోరు ఆర్థిక విధానాలపై రాజీలేని పోరాటం సాగించాలని ఉభయగోదావరి జిల్లాల టీచర్స్ ఎంఎల్సి బి గోపీమూర్తి పిలుపునిచ్చారు. ఇన్సూరెన్స్ కంపెనీల ప్రయివేటీకరణ నిలుపుదల చేయాలని, ప్రజాధనాన్ని కాపాడాలని, కార్పొరేట్ అనుకూల విధానాలు విడనాడాలని ఆయన డిమాండ్ చేస్తున్నారు. అమెరికా వాషింగ్టన్ పోస్ట్ కథనం ప్రకారం ఎల్ఐసి ధనం రూ.33 వేల కోట్లు అదానీ కంపెనీకి చెల్లించేందుకు జరిగిన చర్చల వివరాలు వెలుగులోకి రావడం దేశ ప్రజలను ఆందోళన గురిచేస్తోందన్నారు. ప్రజలు మౌనంగా ఉంటే ప్రజల ఆస్తులకు రక్షణ ఉండదని, పోరాటంతోనే హక్కులను, ఆస్తులను కాపాడు కోవచ్చని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా 15 లక్షల మంది ఎల్ఐసి ఏజెంట్లు ప్రజలను ఒప్పించి ఎల్ఐసిలో ఖాతాదారులుగా మార్చడం ద్వారా సృష్టించిన సంపదపై కార్పొరేట్ల కన్ను పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరిలోనే అదాని గ్రూపు కంపెనీలో ఎల్ఐసి పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెడితే ఖాతాదారుల కుగాని, దేశ ప్రజలకుగాని తెలియకుండా కేంద్ర ప్రభుత్వం దొంగచాటు వ్యవహారాలు నడుపుతోందని దుయ్యబట్టారు. దేశవ్యాప్తంగా ఎల్ఐసి ఏజెంట్ల సంక్షేమం కోసం తమ సంఘం కృషి చేస్తోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ కొద్దిమంది వ్యక్తుల చేతుల్లో బందీగా మార్చడంలో మోడీ సఫలమయ్యారని విమర్శించారు. ఇదిలావుంటే ఈ దుర్మార్గాన్ని అడ్డుకోవాల్సిందేనని కొత్తగూడెం సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఆదానీకి మేలు చేసేందుకు ఎల్ఐసిని బలిచేస్తున్నారని అన్నారు.

## తిరుమలలో మంచు దుప్పటి

**- ముసురు కమ్ముకోవడంతో భక్తులకు ఇక్కట్లు**




**తిరుమల,అక్టోబర్28( వెలుతురు):**

మొంథా తుఫాన్ ప్రభావంతో సోమవారం తిరుమలలో వేకువజాము నుంచే ముసురు వాతావరణం కనిపించింది. చిరుజల్లులే కావడంతో భక్తులకు పెద్దగా అసౌకర్యం కలుగలేదు. దట్టమైన పొగమంచు తిరుమలను కప్పేస్తోంది. సాయంత్రానికి చలి తీవ్రత పెరిగింది. తుఫాన్ ప్రకటనల నేపథ్యంలో రద్దీ కూడా తక్కువగానే ఉంది. ఆలయ పరిసరాల్లో భక్తులు పలుచగా కనిపించారు.పదిరోజుల నుంచి వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుమల ఘాట్‌రోడ్లపై ఫారెస్ట్, ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక నిఘా ఉంచారు. తరుచూ కొండచరియలు విరిగిపడే ప్రాంతాలపై దృష్టి పెట్టారు. అనుకోకుండా కొండరాళ్లు, చెట్లు విరిగిపడితే వెంటనే స్పందించేలా సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఘాట్‌రోడ్లలో నెమ్మదిగా ప్రయాణించాలని, చెట్ల కింద ఉండకూడదంటూ ప్రకటనలు చేశారు.

## అంతర్జాతీయంగా ట్రేడ్ మార్పులు

**- పెరిగిన బంగారం ధరల్లో తగ్గుదల**

**- మరింతగా తగ్గుతుందన్న అంచనాలు**

**హైదరాబాద్,అక్టోబర్28( వెలుతురు):**

దీపావళి సమయంలో ఉవ్వెత్తున ఎగసిన పసిడి ధర దిగొచ్చింది. అంతర్జాతీయ పరిణామాలు, పసిడి పెట్టుబడుల్లో లాభాల స్వీకరణ వంటి కారణాలతో దిద్దుబాటుకు గురైంది. అంతర్జాతీయ విపణిలో ఔన్సు బంగారం ధర 4 వేల డాలర్ల స్థాయి దిగువకు చేరింది. అమెరికా– చైనా మధ్య త్వరలో ట్రేడ్ డీల్ కుదరొచ్చన్న అంచనాలు ఈ కరెక్షన్‌కు కారణమని నిపుణులు చెబుతున్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ మధ్య అక్టోబర్ 30న జరిగే భేటీలో ఆ మేర కీలక ప్రకటన వెలువడే అవకాశం ఉందన్న అంచనాలతో పుత్తడికి డిమాండ్ తగ్గినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అంతర్జాతీయ ధరలను అనుసరించి దేశీయంగానూ బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ క్రమంలో ఇటీవలి వరకూ చుక్కలనంటిన పసిడి ధరలు క్రమంగా దిగొస్తున్నాయి. మంగళవారం కూడా పసిడి, వెండి ధరల్లో తగ్గుదల కనిపించింది. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం, ప్రస్తుతం దేశంలో 24 క్యారెట్ 10 గ్రాముల బంగారం ధర నిన్నటితో పోలిస్తే రూ. 820 మేర తగ్గి రూ.1,22,460కు చేరుకుంది. ఇక ఆర్నమెంటల్ బంగారం ధర రూ.750 మేర తగ్గి 1,12,250కు చేరుకుంది. వెండి ధరల్లో కూడా భారీ కోత పడింది. కిలో వెండి ధర సుమారు రూ.4 వేల మేర తగ్గి రూ.1,51,000కు చేరుకుంది. ఇక హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర రూ.1,22,460గా ఉంది. ఆర్నమెంటల్ బంగారం ధర రూ.1,12,250గా ఉంది. కిలో వెండి ధర మాత్రం రూ.1.65 లక్షలుగా ఉంది. ఇక అంతర్జాతీయ మార్కెట్ లోనూ పసిడి ధరల్లో భారీ తగ్గుదల కనిపిస్తోంది. ఔన్స్ 24 క్యారెట్ బంగారం 3986 డాలర్ల వద్ద కొనసాగు తోంది. నిన్నటితో పోలిస్తే సుమారు 3 శాతం మేర ధరల్లో కోత పడింది. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో గోల్డ్ డిసెంబర్ ఫ్యూచర్స్ ధర కూడా 2.35 శాతం మేర తగ్గి రూ.1,20,546 వద్ద కొనసాగుతోంది. మలేషియా వేదికగా అమెరికా, చైనా ప్రతినిధుల మధ్య జరిగిన చర్చలు సానుకూల ఫలితాలను ఇచ్చాయి. ఎగుమతుల పై నియంత్రణలు, డ్రగ్స్ కట్టడి, షిప్పింగ్ లెవీల వంటి వాటిపై ఇరు దేశాల మధ్య ప్రాథమిక స్థాయిలో ఏకాభిప్రాయం కుదరడంతో బంగారానికి డిమాండ్ తగ్గింది. టిక్‌టాక్ విక్రయంపై భేదాభిప్రాయాలు తొలగిపోయాయని, చైనాపై 100 శాతం సుంకం కూడా ఉండబోదని అమెరికా ట్రెజరీ సెక్రటరీ బెసెంట్ ప్రకటించడంతో మళ్లీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులు ఆకర్షణీయంగా మారాయి. అమెరికాలో ద్రవ్యోల్బణం తగ్గడం కూడా మదపర్లకు కొత్త ఊపునిచ్చింది.



## దూసుకువస్తున్న మొంథా తుఫాన్


**- కాకినాడ వద్ద తీరం దాటే అవకాశం**

**- తీరం దాటే సమయంలో భారీగా ఈదురుగాలులు**

**- గంటకు 90 నుంచి వంద కి.మీ వేగంతో ప్రచండగాలులు**

**విశాఖపట్నం,అక్టోబర్28( వెలుతురు):**

బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తీవ్ర తుపానుగా బలపడింది. ఈ మేరకు విశాఖలోని వాతావరణ కేంద్రం వెల్లడించింది.గంటకు 15 కి.మీ వేగంతో ఉత్తర వాయవ్య దిశగా తుపాను కదిలిందని తెలిపింది. ప్రస్తుతం మచిలీపట్నానికి 190 కి.మీ, కాకినాడకు 270కి.మీ, విశాఖపట్నానికి 340 కి.మీ దూరంలో తుపాను కేంద్రీకృతమైనట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది. క్రమంగా ఉత్తర వాయవ్య దిశగా కదులుతోందని తెలిపింది. మంగళవారం సాయంత్రం లేదా రాత్రికి మచిలీపట్నం–కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీవ్ర తుపాను తీరం దాటే అవకాశముందని వెల్లడించింది. తుపాను తీరం దాటే సమయంలో గంటకు గరిష్ఠంగా 110 కి.మీ వేగంతో గాలులు వీస్తాయని అంచనా వేసింది.



మొత్తంగా ఆంధ్రా వైపుకు ఎంతో వేగంగా దూసుకొస్తోంది. తుపాను నేపథ్యంలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తమైంది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు సహాయక చర్యలు చేసేందుకు అధికారులు అంతా సిద్ధం చేసుకున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 90–110 కిమీ వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. తుపాను ప్రభావంతో శ్రీకాకుళం నుంచి నెల్లూరు వరకు అతిభారీ వర్షాలు కురవనున్నాయని తెలిపారు. కొన్నిచోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ప్రజలు ఇంట్లోనే సురక్షితంగా ఉండాలని ప్రఖర్ జైన్ సూచనలు చేశారు. తీవ్ర తుఫానుగా రూపాంతరం చెందిన మొంథా మరికొన్ని గంటల్లో తీరం దాటనుంది. దీని ప్రభావంతో ఏపీ, ఒడిశా, తెలంగాణ, తమిళనాడు సహా పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. తుఫాను ప్రభావంతో ఒడిశా, ఏపీలో సముద్రం అల్లకల్లోలంగా మారింది. కెరటాలు ఉవ్వెత్తున ఎగసిపడుతున్నాయి. దీంతో బీచ్‌ల వద్ద అధికారులు భద్రతా చర్యలు చేపట్టారు. అలల ప్రభావం ఎక్కువగా ఉండటంతో పర్యాటకులను సముద్రం వైపు వెళ్లకుండా అడ్డుకుంటున్నారు. అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ మైకలలో అనౌన్స్ చేస్తున్నారు.

## విజయవాడలో భారీ వర్షసూచన

**- ప్రజలను అప్రమత్తం చేసిన అధికారులు**

**విజయవాడ,అక్టోబర్28( వెలుతురు):**

మొంథా తుపాను ప్రభావంతో విజయవాడలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తోంది. నగరంలో 16.2 సెం.మీ వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలతో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) అధికారులు అప్రమత్తమయ్యారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావొద్దని సూచించారు.



తీవ్రత ఎక్కువగా ఉంటే దుకాణాలు, వాణిజ్య సంస్థలు మూసివేయాలని విజ్ఞప్తి చేశారు. మెడికల్ షాపులు, కూరగాయలు, పాల విక్రయ దుకాణాలు తెరుచుకోవచ్చని తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో 41 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొండపై నివసిస్తున్న ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్, వీఎంసీ ప్రధాన కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో 9154970454, వీఎంసీ కార్యాలయంలో 08662424172, 08662422515, 08662427485 నంబర్లను ఏర్పాటు చేశారు.

# సమాజ సేవకుడు ఎంవీ పీ. రమేష్ బాబుకు... ఆత్మీయ సత్కారం...

వెలుతురు, హైదరాబాద్ అక్టోబర్ 28 :



సుస్వరసుగుణ కళాభారతి, డాక్టర్ రవిమన్యు ఆర్ట్స్ స్వచ్ఛంద సేవా సాంస్కృతిక సంస్థ సంయుక్త ఆధ్వ ర్యంలో 'అపాయంబు దాటడానికి ఉపాయం కావాలి' అనే శీర్షికన త్యాగరాయగానసభలోని కళా దీక్షి తులు కళా వేదికలో నిర్వహించిన సీని సంగీత విభావరి ఆకట్టుకుంది. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, గా యకులు, చిత్రకారుడు డాక్టర్ కె.రవి మన్యు ఆధ్వర్యంలో జరిగిన కార్య క్రమంలో ప్రముఖ సినీ నేపథ్య గా యకులు సుశీల, ఘంటసాల గానం చేసిన పలు తెలుగు చిత్రాలలోని పలు యుగళ, ఏక గళ గీతాలను గాయనీ గాయకులు అనురాధ, పద్మావతి, వరలక్ష్మి, అరుణ, రవి మన్యు తదితరులు మధురంగా గానం చేశారు. అమర గాయకుడు ఘంటసాల పాడిన పలు సినీ గీతా లను బహుగళ గాయకుడు రవిమ న్యు రాగ, భావయుక్తంగా ఆలపించి ప్రేక్షకుల మన్నలను అందుకున్నా రు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు, మధుర గాయకుడు డాక్టర్ కే.రవి మన్యు..ప్రముఖ సామాజిక సేవకు లు, వాసవి క్రీడా సాంస్కృతిక మం డలి (వాసవి ట్రస్ట్) చైర్మన్, ఎం.వీ. పీ. రమేష్ బాబు ను ఘనంగా స త్కరించారు. ఈ కార్యక్రమంలో మల్లె పూల వెంకటరమణ, న్యా యవాది రఘునాథ్, కళాభిమాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నా రు.

## హయత్ నగర్ లో ఘనంగా స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ నిర్వహించిన నారాయణ విద్యాసంస్థ





హయాత్ నగర్ వెలుతురు అక్టోబర్ 28:
హయాత్ నగర్ నారాయణ పాఠశాలలో ఘనంగా e-champs స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ (SLC) నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జియం గోపాల్ రెడ్డి, ఏజియం రవీంద్ర బాబు పాల్గొన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో ప్రథమ, ద్వితీయ తరగతులు చదివే విద్యార్థులచే వార్షిక ప్రణాళికలో భాగంగా తెలుగు, హిందీ, ఇంగ్లీష్, గణితం, కంప్యూటర్, జి. కె, సామాన్య శాస్త్రంలో విద్యార్థులు నేర్చుకున్న విషయాలను వారి ద్వారానే వాటి ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థులు ప్రతిభ పాఠాలను తిలకించిన తల్లిదండ్రులు ఎంతో ఆనందించారు. ఏ.జి. యం గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చిన్న తనంలోనే వారు చేస్తున్న అభ్యాసాన్ని వారు గుర్తించి ఆ యొక్క పాఠ్యాంశాల గురించి వివరించడం ఎంతో అభినందనీయంగా ఉందని విద్యార్థుల ప్రతిభను గుర్తించి అభినందించారు. విద్యార్థులు చదువులోనే కాకుండా అన్ని రంగాలలో ముందుండాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ లావణ్య, మానస, ఈ-చాంప్స్ కో ఆర్డినేటర్ దివ్య వైస్ ప్రిన్సిపల్ కవిత మరియు తదితర ఉపాధ్యాయునిలు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న నవీన్ యాదవ్ పై అసత్య ఆరోపణలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలి

### - బీసీ నేత జాజుల లింగంగౌడ్



హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
జూబ్లీహిల్స్ ఎన్నికల్లో పోటీ చేస్తున్న బలహీన వర్గాలకు చెందిన నవీన్ యాదవ్ పై యూట్యూబ్ ఛానల్లో అసత్య ఆరోపణలు చేస్తూన్న వారిపై చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ పేర్కొన్నారు.ఈ సందర్భంగా లింగంగౌడ్ మాట్లాడుతూ బీసీ బిడ్డ నవీన్ యాదవ్ కు వస్తున్న ఆదరణనీ చూసి ఓర్వలేక కొంత మంది నవీన్ యాదవ్ యొక్క వ్యక్తిగత ఇమేజ్ ను దెబ్బతీస్తూ తప్పుడు ప్రచారం చేస్తూ అబద్ధపు రాతలతో పేపర్లలో రాపిస్తూ వారి రాజకీయ పార్టీల ప్రయోజనం కోసం కావాలనే ఒక బీసీ బిడ్డపై కుట్రలు పన్నుతూ అతని బరువుకు భంగం కలిగేలా ప్రవర్తిస్తున్నారని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని లింగంగౌడ్ పోలీసు వారిని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ విద్యార్థి యువజన పరిషత్ రాష్ట్ర అధ్యక్షులు బూర శ్రీనివాస్ బీసీ విద్యార్థి సంఘం ఓయూ ఇన్చార్జి గోదా రవీందర్ పాల్గొన్నారు

## మొంథా నేపథ్యంలో డివిజనల్ వార్ రూమ్‌లు

### - కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశం

హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
'మొంథా' తీవ్ర తుపాను నేపథ్యంలో సత్వర నిర్ణయాలు తీసుకునేందుకు వీలుగా ఒడిశా, తెలుగు రాష్ట్రల్లో డివిజనల్ వార్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలను రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ఆదేశించారు. విజయవాడ, విశాఖపట్నం, గుంటూరు డివిజన్లలో అవసరమైన సామగ్రి, యంత్రాలు, సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. దక్షిణ మధ్య రైల్వే, ఈస్ట్ కోస్ట్ రైల్వే జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మొంథా తుపాను దృష్ట్యా తీసుకుంటున్న చర్యలపై నివేదిక కోరారు. తీసుకోవాల్సిన మరిన్ని చర్యలపై దిశానిర్దేశర చేశారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అత్యవసర వేళల్లో సత్వరం స్పందించాలన్నారు.

# ఆరుట్ల గ్రామంలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న యువతి పంబాల నందిని

- నందిని మృతిపై అనుమానం వ్యక్తం చేస్తూ మంచాల పోలీస్ స్టేషన్ ముందు ఆందోళన చేపట్టిన మృతురాలి బంధువులు
- మృతురాలి ఫోన్ కాల్ డేటా ఆధారంగా దర్యాప్తు చేసి చేదిస్తాం
- మంచాల సీఐ ఏ మధు



ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న యువతి పంబాల నందిని



మంచాల వెలుతురు అక్టోబర్ 28:
మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో పంబాల నందిని (18)అనే యువతి ఇంటిలో ఎవ్వరులేని సమయంలో సోమవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది ఈవిషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న మృతురాలి తండ్రి పంబాల దుర్గేష్ మంచాల పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చాడు వెంటనే స్పందించిన మంచాల సీఐ మధు ఆరుట్ల గ్రామంలోని సంఘటన స్థలానికి చేరుకొని స్థానికులతో వివరాలు తెలుసుకొని పంచనామా చేసి యువతి మృతదేహాన్ని పోస్టుమార్టం చేయడానికి ఇబ్రహీంపట్నం ప్రభుత్వ దవఖానకు తరలించాడు మృతురాలి తండ్రి పంబాల దుర్గేష్ మాట్లాడుతూ నా కూతురు నందిని ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదు మా కూతురి ఆత్మహత్య మీద నాకు అనుమానం ఉంది అని పోలీస్ అధికారులకు చెప్పాడు మా కూతురి చావుకు కారణం ఎవ్వరో తెలిసే వరకు పోస్టుమార్టం చేయొద్దు మృతురాలి తల్లిదండ్రులు బోరున విలపించారు మంగళవారం ఉదయం మృతురాలి బంధువులు పెద్ద ఎత్తున పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకొని స్టేషన్ ముందు రోడ్డుపై బైఠాయించి నందిని ఆత్మహత్యపై అనుమానం వ్యక్తం చేస్తూ నందిని ఆత్మహత్యకు కారణం ఎవరో విచారణ చేసి నిందితున్ని పట్టుకొని కఠినంగా శిక్షించాలని అప్పటి వరకు పోస్టుమార్టం చేయవద్దని రోడ్డుపై బీస్పించి కూర్చున్నారు వెంటనే స్పందించిన సీఐ మధు స్టేషన్ నుండి బయటకు వచ్చి మృతురాలు నందిని మొబైల్లో ఉన్న కాల్ డేట ఆధారంగా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి మృతురాలి ఆత్మహత్యకు కారణాలు ఏమిటో త్వరలో చేదిస్తాం అని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు ఈకార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు గ్రామస్తులు మహిళలు పెద్దఎ త్తున పాల్గొన్నారు

## బిజెపి బిఆర్ఎస్ కాంగ్రెస్ పార్టీల కు గుణపాఠం చెప్పడమే ప్రజారాజ్యం పార్టీ లక్ష్యం

- తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్




బషీర్ బాగ్ వెలుతురు 28 అక్టోబర్ :
రాష్ట్రంలో ప్రజారాజ్యం పార్టీని బలోపేతం చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలంగాణ ప్రజారాజ్యం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు జిలుకర రవికుమార్ తెలిపారు. ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, గత పది ఏళ్ల పాలనలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అభివృద్ధిని విస్మరించి అవినీతి అక్రమాలను పెంచి పోషించారని, బీజేపీ మత వైశ్యామ్యాలను రెచ్చగొడుతూ రాజ్యాంగాన్ని మార్చే కుట్ర చేస్తుందని ఈ మూడు పార్టీలకు బుద్ధి చెప్పడమే లక్ష్యంగా ప్రజా రాజ్యం పార్టీ ముందుకు సాగుతుందని ఆయన వెల్లడించారు. ఈ మేరకు మంగళవారం పార్టీ తొలి వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో విశ్రాంత ఐఐ ఎస్ అధికారి కూనప రెడ్డి హరిప్రసాద్తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్టీ ఆశయాలు సిద్ధాంతాలను నచ్చి చాలామంది పార్టీలో చేరడానికి ముందుకు వస్తున్నారని ఇది శుభపరిణామం అన్నారు. యువత పార్టీలో చేరడానికి ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. నాటికి పార్టీని బలోపేతం చేసే అవినీతి లేని తెలంగాణ నిర్మాణమే లక్ష్యంగా ముందుకు సాగుతామని ఆయన చెప్పారు. వచ్చే స్థానిక సంస్థలు ఎన్నికల్లో తమ పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో చైతన్య రథయాత్ర నిర్వహించి ప్రజారాజ్యం పార్టీని ఆదరించండి- అవినీతి లేని తెలంగాణను నిర్మించుకోండి అన్న నినాదంతో గ్రామ గ్రామానికి వెళ్తామని ఆయన చెప్పారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కండువలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సింగం శ్రీనివాసరావు. పావిల్లా సురేష్ ప్రొఫెసర్ సయ్యద్ జలాల్ ద్దీన్. విజయ రెడ్డి ఉదయ సింగ్. మేకల సారయ్య రత్నరాజ్ ప్రభాకర్ కుమార్ పాల్గొన్నారు.

## బోరబండ లో ఆటోలో ప్రయాణించిన మంత్రి సీతక్క ఉమెన్ కార్పొరేషన్ చైర్మన్ బంధ్రు శోభారాణి

- ఆటో డ్రైవర్ తో మాట్లాడి చేయి గుర్తుకు ఓటెయ్యాలని విజ్ఞప్తి చేసిన మంత్రి సీతక్క
- కాంగ్రెస్ ను గెలిపిస్తామని తేల్చి చెప్పిన ఆటో డ్రైవర్
- మంత్రి సీతక్క



హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
ఆటో డ్రైవర్ల సంక్షేమాన్ని గత ప్రభుత్వం పట్టించుకోలేదు మహిళలకి ఉచిత బస్సు ప్రయాణం వల్ల ఆటో డ్రైవర్ల ఎలాంటి ఇబ్బంది లేదు గల్లీలకు ఆర్టీసీ బస్సులు రావు చిన్న చిన్న దూరాలకు ప్రజలు ఆటోలనే ఆశ్రయిస్తారు టిఆర్ఎస్ హాయంలో ఆటో డ్రైవర్లను ఎన్నో ఇబ్బందులు పెట్టారు స్వయంగా కేసీఆర్ ప్రగతిభవన్లోనే ఓలా, ఉబర్ బైక్ సర్వీసులను కేటీఆర్ ప్రారంభించి ఆటో డ్రైవర్ల ఉపాధి దెబ్బతీశాడు నో పార్కింగ్, ఫిట్మెంట్ చార్జీలు పేరుతో ఆటో డ్రైవర్ల జేబులకు చిల్లులు పెట్టారు తమ బాధలు చెప్పుకుందామంటే ఆటో డ్రైవర్లను అరెస్టు చేశారు కెసిఆర్ నివాసం ప్రగతి భవనం ముందే ఆటో డ్రైవర్ తన ఆటో తగలబెట్టుకున్నాడు కెసిఆర్ పదండ్ల కాలంలో హైదరాబాద్ నగరంలో ఒక్క కొత్త ఆటోకు అనుమతులు ఇవ్వలేదు ఇప్పుడు జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం ఆటో డ్రైవర్ల పట్ల మోసలి కన్నీరు కారుస్తున్నారు తమ తల్లికి చెల్లికి ఉచిత బస్సు ప్రయాణం లభిస్తుందని ఆటోడ్రైవర్లు చెబుతున్నారు ఉచిత కరెంటు, సన్నబియమిస్తున్నాము ఆటో డ్రైవర్ల మహిళా కుటుంబ సభ్యులకు ఇంద్ర మహిళా శక్తి పథకం ద్వారా ఎన్నో సంక్షేమాలను అందిస్తున్నాం వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నాం తమ బాధలను ప్రపంచ బాధలుగా చెప్పడం కెసిఆర్ కుటుంబానికి అలవాటు అధికారం పోయేసరికి అన్ని వర్గాల మీద ప్రేమ కురిపిస్తున్నారు కానీ అధికారంలో ఉన్నప్పుడు ఒకరిని కూడా పట్టించుకోలేదు జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడం ఖాయం

## అన్న నగర్ బస్తీ వాసులకి మంత్రి సీతక్క హామీ



హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
30 సంవత్సరాల క్రితం గత ప్రభుత్వాలు పట్టాలిస్తే అన్నా నగర్ బస్తీ ఏర్పాటు అయింది గత 10 ఏళ్లలో ఒక్కరికి కూడా టిఆర్ఎస్ ప్రభుత్వం ఇక్కడ ఇళ్లు ఇవ్వలేదు జీవో 58 కింద ఇండ్ల పట్టాల కోసం దరఖాస్తులు చేసుకున్న.. వాటిని గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదు మా ప్రజా ప్రభుత్వం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు ఇస్తాము జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మమ్మల్ని గెలిపిస్తే ఈ బస్తీలో కూడా అందరికి ఇల్లు కట్టిస్తాం రేవంత్ రెడ్డి నేతృతంలోనీ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది యువకుడు మీ ప్రాంతానికి చెందిన యాదవ్ గారికి ఒక అవకాశం ఇవ్వండి ఇక్కడ పుట్టలు గుట్టలు, మీ కష్ట సుఖాలు నవీన్ యాదవ్ కు తెలుసు పనిచేసే నవీన్ ఎమ్మెల్యేగా ఉంటే సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు మీ ఇంటికి వస్తాయి ఇప్పటికే 150 కోట్లతో జూబ్లీహిల్స్ అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయి మనది రెండో గుర్తు చేసి జూబ్లీహిల్స్ కాంగ్రెస్ గెలిస్తే మరో 1000 కోట్ల అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయి కాబట్టి చేతి గుర్తుకు ఓటేసి నవీన్ యాదవ్ అని గెలిపించాలి

### జూబ్లీహిల్స్‌లో ప్రచార కార్యక్రమాలు రద్దు చేసుకున్న బిఆర్ఎస్

హైదరాబాద్,అక్టోబర్28( వెలుతురు):
బీఆర్ఎస్ సీనియర్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాటి పార్టీ కార్యక్రమాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రద్దు చేశారు. అదేవిధంగా జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచార కార్యక్రమాలను కూడా రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మరోవైపు జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత.. హరీశ్ రావు తండ్రి తన్నీరు సత్యనారాయణ రావు పార్థివదేహానికి నివాళు లర్పించారు. ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు.

## తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆహ్వానం

### తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహా రెడ్డి



హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:
కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం ప్రతిష్టాత్మకంగా అఖిల భారత సివిల్ సర్వీసెస్ సంగీతం, నృత్యం (All India Civil Services Music, Dance) పోటీలను నిర్వహిస్తుందని తెలంగాణ రాష్ట్ర భాషా, సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహా రెడ్డి తెలిపారు. 2025-26 సంవత్సరానికి గాను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరపున డా. బి. ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయం ఆధ్వర్యంలో జరిగే పోటీలలో పాల్గొనడానికి సంగీతం, నృత్య అంశాలలో నైపుణ్యం ఉన్న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల నుండి ధరఖాస్తులను వాట్సప్ ద్వారా కోరడమైనది. ధరఖాస్తు చేసుకున్న వారికి నవంబర్ 6,7 తేదీలలో రవీంద్ర భారతిలో పోటీలు నిర్వహించి ఎంపిక చేయబడతారు.దఈ పోటీలు హైదరాద్‌లోని రవీంద్ర భారతిలో నవంబర్ 6, 7 - 2025 తేదిలలో ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించనున్నారు. సంగీతం (కర్ణాటక, హిందూస్థానీ, జానపదం, వెస్టర్న్) %డ% స్కిట్ అంశాలకు సంబంధించిన పోటీ నవంబర్ 6, వాయిద్య (ఇన్స్టుమెంట్స్), నృత్యం (డాన్స్) అంశాలకు సంబంధించిన పోటీ నవంబర్ 7న నిర్వహిస్తారు. ప్రదర్శించే అంశానికి కేటాయించిన నిర్ణీత సమయంలోనే పూర్తి చేయాలి లేకపతే వారిని అనర్హులుగా ప్రకటిస్తారు. వివిధ విభాగాలలో పాల్గొనే పోటీదారులు ఆయా దరఖాస్తులను విభాగాల వారిగా ఈ క్రింద సూచించిన వారికి వాట్సప్ ద్వారా అక్టోబర్, 29 నుండి 01 నవంబర్ 2025 లోగా సమర్పించ వలసినదిగా కోరడమైనది. సంగీతం: యన్. సుధీర్ కుమార్ - 9849641839 నృత్యం : నీరజాక్షి - 9704466499 ఇన్స్టుమెంట్స్ : ఆయేషా -9948611766 స్కిట్స్ :బి. శ్రీశైలం- 9959667703 ఈ కార్యక్రమానికి సంబంధించి ఏమైనా సందేహాలు వుంటే యామిని కనక తార, జాయింట్ సెక్రటరి (కల్చరల్ ) - 8309395375, డా. బి. ఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయ సంఘం శ్రీ యన్. సుధీర్ కుమార్ 9849641839 మొబైల్ నెంబర్ లను సంప్రదించవచ్చు.

## నవంబర్ 1 నుంచి 5వ తేదీ వరకు గురునానక్ దేవ్ జీ జయంతి వేడుకలు

### 3న అఫ్జల్ గంజ్ లోని శ్రీ గురు సింగ్ సభ నుండి నగర కీర్తనలు ప్రారంభం



బషీర్ బాగ్ వెలుతురు 28 అక్టోబర్ :
హైదరాబాద్, వెలుతురు అక్టోబర్ 28: సిక్కుల తొలి గురువు గురు నానక్ దేవ్ జీ 556వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు... గురుద్వారా శ్రీ గురు సింగ్ సభ (అఫ్జల్‌గంజ్), గురుద్వారా సాహెబ్ (సికింద్రాబాద్) ప్రబంధక కమిటీ లు సంయుక్తంగా ఏర్పాట్లు చేస్తోంది. ప్రకాశ్ ఉత్సవ్ పేరిట నవంబర్ 1 నుంచి 5 వరకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా నిర్వహించనున్నట్లు... ప్రబంధక కమిటీ అధ్యక్షులు సత్వీందర్ సింగ్ బగ్గా, బల్దేవ్ సింగ్ బగ్గా, హర్ పీతం సింగ్ గులాటి, జస్పాల్ సింగ్ లు తెలిపారు. ఈ మేరకు మంగళవారం, అఫ్జల్ గంజ్ లోని అశోక్ బజార్ గురు ద్వార్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో... వేడుకలకు సంబంధించిన కర పత్రాన్ని వారు ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. నవంబర్ 1న సికింద్రాబాద్ గురుద్వారా సాహెబ్ నుండి... నవంబర్ 3న అఫ్జల్‌గంజ్ గురుద్వారా శ్రీ గురు సింగ్ సభ నుండి... రంగురంగుల నగర కీర్తనలు (పవిత్ర ఊరేగింపులు) నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రత్యేక వాహనంలో మత గ్రంథం గురు గ్రంథ్ సాహిబ్ ని ఊరేగించనున్నట్లు వెల్లడించారు. ఈ ఊరేగింపుల్లో సంప్రదాయ విన్యాసాలైన కత్తి, కర్రసాముల, గుట్కా విన్యాసాలతో పాటు... పంజాబ్ నుంచి మార్షల్ ఆర్ట్స్ కళాకారులు, పంజ్ ప్యారాలు, శాబాద్ కీర్తనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయని పేర్కొన్నారు. విశాల్ దివాన్ ఉత్సవ్ వేడుక నవంబర్ 5న నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరుగుతుందన్నారు. సుమారు 25,000 మందికి పైగా భక్తులు పాల్గొంటారని... దేశ, విదేశాల నుండి ప్రసిద్ధ రాగి జాతాలు గురుబానీ కీర్తనలు పఠిస్తారని తెలిపారు. అదే విధంగా నవంబర్ 4న సికింద్రాబాద్ గురుద్వారాలో, నవంబర్ 5న అఫ్జల్‌గంజ్ గురుద్వారాలో రాత్రి కీర్తనలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఈ సమావేశంలో జనరల్ సెక్రెటరీ జగన్మోహన్ సింగ్, జోగేంద్ర సింగ్ ముజ్రల్, బచన్ సింగ్ లతో పాటు పెద్ద సంఖ్యలో సిక్కు సోదరులు పాల్గొన్నారు.

## మాజీ ఉపసర్పంచ్ పాక పద్మ-చిరంజీవి యాదవ్ దంపతులను సన్మానించిన యాదవ సంఘం నేతలు

**- యాదవ సదర్ సమ్మేళన అభినందపూర్వక సన్మానం**





**చౌటుప్పల్, వెలుతురు అక్టోబర్ 28:**
పట్టణ కేంద్రంలోని గాంధీ పార్క్ లో ఇటీవల నిర్వహించిన యాదవుల సదర్ సమ్మేళనంని, మండల యాదవ సంఘ నాయకుల సహకారంతో విజయవంతం చేసిన ఉత్సవ నిర్వాహకుడు పాక పద్మ-చిరంజీవి యాదవ్ దంపతులను యాదవ సంఘం నేతలు ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జాతీయ యాదవ సంఘం ఉపాధ్యక్షుడు చిలకల శ్రీనివాస్ యాదవ్, యాదవ సంఘ మండల అధ్యక్షుడు చినుకని మల్లేశం యాదవ సంఘ సీనియర్ నాయకులు నల్ల పర్వతాలు యాదవ్, నల్ల గణేష్ యాదవ్, మల్లన్న గుడి అధ్యక్షుడు ఆవుల యేసు యాదవ్,యాదవ సంఘ మండల ఉపాధ్యక్షుడు ఎర్రసాని సతీష్ యాదవ్,యాదవ సంఘం మండల ప్రధాన కార్యదర్శి గంగనబోయిన వెంకటేష్ యాదవ్ , లింగోజిగూడెం మల్లన్న & ఎల్లమ్మ గుడుల ప్రధాన కార్యదర్శి కడారి ఐలయ్య యాదవ్, గుండెబోయిన వేణు యాదవ్ , ఎర్రసాని విజయ్ యాదవ్,ఎర్రగోని మల్లేష్ యాదవ్, వంటల రవి యాదవ్, మెండే మల్లేష్ యాదవ్, ఎర్ర సాని శేఖర్ యాదవ్, గజ్జి పాండు యాదవ్, ఆవుల మల్లయ్య యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## అంతరించిపోతున్న కళల ను ఆదరించండి.



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 28**
ప్రపంచ కళాకారుల దినోత్సవం పురస్కరించుకొని ఈరోజు రామన్నపేట మండల కేంద్రంలో ఉన్న బుర్ర కథ కళాకారుల కళ్లెం సాయిలు పార్వతమ్మ ను సామాజిక కార్యకర్త నోముల యాదగిరి సత్కరించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేటి సమాజంలో నాటి కలలపై ఆధారపడుతూ గ్రామాలలో సార్థకాన్ల రూపంలో తాంబూర దీన్నీసా అంజలి లాంటి వాయిద్యాలతో గత 50 సంవత్సరాల నుండి అనేక రకాల కళలతో ప్రజలను ఆకట్టుకునే కథలతో కూటగడుపుకున్న సంఘటనలు కోకోల్లలని ఆనాటి జానపద, వృత్తి కలలను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గుర్తు చేస్తూ నాటి కలలను బతికించుకోవడం కోసం అంతర్జాతీయ కళాకారుల దినోత్సవం సందర్భాన్ని గుర్తు చేస్తూ ఈ రోజు వృత్తి కళలతో ఆధారపడిన కుటుంబాన్ని సత్కరించడం ఆనందంగా ఉందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిఐ యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కన్వీనర్ కళ్లెం ధర్మ నీల , ధర్మానందన్ , సామాజిక కార్యకర్త వేముల సైదులు, కన్నెబోయిన నరసింహ, సుర్వి శివ, నోముల తిలక్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆదేశానుసారం బీసీ బాలికల హాస్టల్లో హెల్త్ ప్రోగ్రాం



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 28**
కలెక్టర్ ఆదేశాలు మేరకు స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ లో భాగంగా బి సి బాలికల హాస్టల్ విసిట్ చేసిన డాక్టర్ అశ్విన్ సిహెచ్ సూపర్డెంట్ మునిపంపుల డాక్టర్ గోపాల్ హెచ్ డబ్ల్యు ఓ స్వప్న పిల్లల యొక్క హెల్త్ చెక్ చేసి , ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి సరియగు మందులు ఇవ్వటం జరిగింది, అదేవిధంగా కాలానుగుణంగా వచ్చే వ్యాధుల పైన అవగాహన మరియు నివారణ చర్యలు, తీసుకోవలసిన జాగ్రత్తలు, వ్యక్తిగత పరిశుభ్రత , సుబ్రంగా చేతులు కడుకోవటం ఎలా అనేది, కౌమార దశలో ఉన్న ఆడ పిల్లలకు నెలసరి సమయం తీసుకోవలసిన జాగ్రత్తలు తెలియజేయడం జరిగింది.

### కార్మిక రంగాలలో పనిచేసే మహిళలకు రక్షణ , సమాన హక్కులు కల్పించాలి.

**- కోట సంధ్యారాణి భవన కార్మిక సంఘం రాష్ట్ర మహిళ కన్వీనర్**

**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 28**



దేశవ్యాప్తంగా పలు రంగాలలో ఉన్న మహిళలకు సమాన హక్కులు , అవకాశాలు,మహిళ రక్షణ కల్పించాలని భవన నిర్మాణ కర్మిక మహిళ రాష్ట్ర కన్వీనర్ కోట సంధ్యారాణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ రోజు రామన్నపేట మండలంలోని కక్కిరేణి గ్రామంలో సిఐటియు 4 వ జిల్లా మహాసభల కరపత్రాలను హమాలీ , భవన కార్మిక మహిళలతో కలిసి ఆమె ఆవిష్కరించడం జరిగింది.అనంతరం వారు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా నేటి ఆధునిక యుగంలో కూడా 19 నిమిషాలకు ఒక మహిళ పై అత్యాచారానికి గురవుతుందని నేషనల్ క్రైమ్ బ్యూరో రిపోర్టు ఎన్ సి డి ఆర్ సర్వేలో తేలడం మహిళలకు రక్షణ లేని పరిస్థితి నెలకొనడం బాధాకరమని. మహిళలకు పని గంటలు పెంచుతూ,సమాన వేతనాలలో వివక్షత చూపుతూ దోపిడికి గురవుతున్న మహిళలకు అండగా సిఐటియు ఉంటుందని నవంబర్ 08 న రామన్నపేటలో సిఐటియు 4 వ జిల్లా మహాసభలలో పలు రంగాలలో ఉన్న కార్మిక మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కార్మిక మహిళలు పద్మ,అండాలు, సైదమ్మ ,అలివేలు , నాగమ్మ ,రమణమ్మ , కేతమ్మ ,తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

**- జిల్లా కలెక్టర్ హనుమంతరావు**

**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 28**
ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు,వైద్యాధికారులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. అనధికారికంగా విధులకు హాజరు కాని వారిపై కఠిన చర్యలు తప్పవని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు హెచ్చరించారు.మంగళవారం రామన్నపేట ఏరియా ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హనుమంత రావు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించారు. ఈ రోజు ఎంత మంది సిబ్బంది విధులకు హాజరు అయ్యారని రిజిస్టర్ ను పరిశీలించారు.విధులకు అనధికార గైర్హాజర్ అయిన ఆయుర్వేదిక్ డాక్టర్ ను సస్పెండ్ చేస్తూ మిగతా వైద్యులకు షోకాస్ నోటీసులు జారీ చేనున్నట్లు



తెలిపారు.ఆసుపత్రి లో వార్డులను కలియ తిరిగారు. వార్డులను, పరిసరాలను, ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.వైద్యులు అందరూ రోజు విధులకు హాజరు కావాలని నిర్లక్ష్యంగా వహిస్తే కఠిన చర్యలు తప్పవు అనిహెచ్చరించారు.ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో వైద్యులు మంచిగా వైద్యం అందిస్తున్నారా, సిబ్బంది ఏమైనా ఇబ్బంది పెడుతున్నారా, అని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రి ఆవరణలో వర్షం నీరు నిలువ ఉండడంతో నీరు బయటకు వెళ్లేలా మార్గం ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ చిన్ను నాయక్, తాసిల్దార్ లాల్ బహదూర్, వైద్యులు శ్రీనివాస్, వరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 1న హైదరాబాద్ లో లక్షలాది మందితో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ

**MSF జాతీయ అధ్యక్షులు డాక్టర్ చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ**



**నల్లగొండ వెలుతురు అక్టోబర్ 28:**
దేశ రాజధానిలో అత్యున్నత న్యాయవ్యవస్థైన సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవాయ్ మీద దాడి జరిగితే ఇప్పటికీ కేసులు నమోదు చేయకపోవడాన్ని నిరసిస్తూ నవంబర్ 1 న ఛలో హైదరాబాద్ పేరుతో లక్షలాది మందితో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తున్నామని MSF జాతీయ అధ్యక్షులు చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ అన్నారు.నల్గొండ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ కేపీఎం జూనియర్ కళాశాల మరియు వృత్తి విద్య కళాశాలలో MRPS నల్లగొండ జిల్లా అధ్యక్షులు ఇరిగి శ్రీశైలం మాదిగ అధ్యక్షతన సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పాల్గొన్న చిప్పలపల్లి సోమశేఖర్ మాదిగ మాట్లాడుతూ సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ స్థానంలో ఉన్న దళితుడికే రక్షణ లేకపోతే దేశంలో సామాన్య దళితులకు రక్షణ ఎలా ఉంటుందని అన్నారు. ఈ దాడి జరిగి 20రోజుల గడుస్తున్నా ఇప్పటికీ కేసు నమోదు చేయకపోవడం దారుణమని అన్నారు. జస్టిస్ గవాయ్ స్థానంలో ఉన్నత కులాలకు చెందిన జడ్జీ ఉంటే కేసు నమోదు చేయడంలో ఇలా నిర్లక్ష్యం చేసి ఉండే వారా? అని ప్రశ్నించారు. అందుకే జస్టిస్ బిఆర్ గవాయ్ మీద జరిగిన దాడి దళితులపైన జరిగిన దాడిగా చూస్తున్నామని అన్నారు. దళితులు ఎంత ఉన్నత స్థానానికి కష్టపడి ఎదిగినా కుల రక్కసి వెంటాడుతుందని అన్నారు. అందుకే గవాయిపై దాడి ఘటనను నిరసిస్తూ జాతీయ స్థాయిలో దళితుల ఆత్మగౌరవ పోరాటం చేపడుతున్నామని అన్నారు. గవాయ్ గారిపైన జరిగిన దాడి వల్ల దేశంలో ఉన్న దళితుల హృదయాలు తీవ్ర ఆవేదనకు గురయ్యాయని అన్నారు.కానీ 20 రోజులుగా ఎదురు చూస్తున్నా నేటికీ న్యాయం జరగలేదని అన్నారు. కనుకనే ఉద్యమానికి పిలుపునివ్వడం జరిగిందని అన్నారు. తక్షణమే దాడి ఘటన మీద కేసు నమోదు చేయాలి. నిందితుడిని అరెస్టు చేసి జైలులో పెట్టాలి.అలాగే ఈ ఘటన మీద సుప్రీం కోర్టు రిటైర్డు జడ్జీ చేత విచారణ జరిపించి దీని వెనుక ఉన్న శక్తులను గుర్తించాలి.ఇలాంటి ఘటనలు మళ్ళీ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా సహించేది లేదని అన్నారు.చీఫ్ జస్టిస్ గారిపై దాడి విషయంలో న్యాయాన్ని కోరుతూ నవంబర్ 1 న లక్షలాది మందితో ఛలో హైదరాబాద్ పేరుతో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహిస్తామని , ఈ ర్యాలీలో ఆత్మగౌరవంతో జీవించాలని కోరుకునే దళిత ప్రజలు పెద్ద ఎత్తున తరలి రావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎంఈఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు మలపాక వెంకన్న మాదిగ, మాదిగ లెక్చరర్స్ ఫోరంజిల్లా అధ్యక్షులు జిల్లా నరసింహ MSF విద్యార్థులు సాయి కిరణ్ గోపీచంద్ నరేష్ మురళి స్వామి అన్నపూర్ణ శైలజ వాణి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక కేంద్రం యాదాద్రి భువనగిరి జిల్లాలో గౌడ్ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ( గోపా ) నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

**భువనగిరి వెలుతురు అక్టోబర్ 28:**
భువనగిరి పట్టణంలోనీ జిఎంఆర్ బ్యాంకెట్ హాల్ లో యాదాద్రి భువనగిరి జిల్లా "గోపా" సర్వ సభ్య సమావేశం లో నూతన జిల్లా కమిటీ ఏర్పాటు చేశారు. "గోపా " జిల్లా అధ్యక్షుడి గా దంతూరి కుమార స్వామి గౌడ్, ప్రధాన



కార్యదర్శి గా బొమ్మకంటి బాల రాజ్ గౌడ్, కోశాధికారి గా నల్లమాస ప్రవీణ్ గౌడ్, ఉపాధ్యక్షులు గా తిరుమల కృష్ణ గౌడ్ , నారగోని కృష్ణయ్య గౌడ్, కాటేపల్లి ఉపేందర్ గౌడ్, చెక్కిళ్ల శ్రవణ్ కుమార్ గౌడ్, ఉయ్యాల బిక్షమయ్య గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు గా ఆగయ్య గౌడ్, నల్లమాస కుమార్ గౌడ్, బత్తిని శ్రీధర్ గౌడ్, దూడల వెంకటేష్ గౌడ్, నర్సింగ్ యమునా గౌడ్, ఈసీ మెంబర్స్ గా యమగాన్ని బుగ్గయ్య గౌడ్,రాయగిరి గడ్డమీది చంద్రయ్య గౌడ్ (జర్నలిస్ట్), అనంతుల వెంకన్న గౌడ్, ఎరకల నరేష్ గౌడ్, పాండాల మహేష్ గౌడ్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా " గోపా" రాష్ట్ర అధ్యక్షులు బండి సాయన్న గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై, నూతన కమిటీ ప్రమాణ స్వీకారం అనంతరం మాట్లాడుతూ గౌడ్ ఆఫీసియల్స్ , ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆవిర్భవించి యాభై సంవత్సరాలు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవ సంబరాలకు



సిద్ధం అవుతుంది అన్నారు. అన్ని రంగాల్లో గౌడ్ కుల వెనుకబాటును సభ్యులకి గుర్తు చేసారు. అధిగమించాలి అంటే చదువే పరిష్కారం చూపుతుంది కాబట్టి అందరూ నాణ్యమైన విద్య ను అందుకున్నప్పుడే ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయం గా బలపడుతారని వివరించారు. నూతన జిల్లా అధ్యక్షులు దంతూరి కుమార స్వామి గౌడ్ సభాధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో "గోపా" కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు చెక్కిళ్ళ మధు సూధన్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్ లు అంతా ఐక్యం కావలసిన సందర్భాన్ని తెలిపారు. మరో ఉపాధ్యక్షులు ముద్దగౌని రామ్ మోహన్ గౌడ్ మాట్లాడుతూ గౌడ్ ల రాజకీయ ప్రస్థానాన్ని గుర్తు చేశారు. గోపగాని ఆనంద్ గౌడ్ మాట్లాడుతూ ఉన్నత విద్యా అవకాశాలను అందుకునే మార్గాలను సూచించారు.. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ తరపున గుడేపూరి సాయి వేణు గౌడ్, మాదు సైదులు గౌడ్, పొట్లపల్లి అశోక్ గౌడ్(జర్నలిస్ట్) , నల్గొండ జిల్లా " గోపా" అధ్యక్షులు దంతూరి సైదులు గౌడ్, నకరికంటి శ్రీనివాస్ గౌడ్, సిద్దగోని పరమేశ్ గౌడ్, యాదాద్రి జిల్లా గౌడ సంఘం నాయకులు, నల్లమాస మనోజ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## తెలంగాణ ఉద్యమకారులకు ఇండ్లు స్థలాలు, పింఛన్లు, హెల్త్ కార్డులు ఇవ్వాలి.

**- తెలంగాణ ఉద్యమకారుల పోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ చాంద్**



**రామన్నపేట వెలుతురు న్యూస్ అక్టోబర్ 28**
తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ కన్వీనర్ షేక్ చాంద్ టిఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి వినతి పత్రం అందజేశారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు తెలంగాణ ఉద్యమకారులు కృషి చేశారు. వారికి ఇండ్ల స్థలాలు, పింఛన్లు, హెల్త్ కార్డులు ఇవ్వాలని ఉద్యమకారుల త్యాగాలను పర్వద్దని నిక్కాస్ అయినా తెలంగాణ ఉద్యమకారులను గుర్తించాలని తనవంతు ప్రయత్నం చేయాలని వినతి పత్రంలో కోరారు. అదే ఆలోచన చేస్తున్నామని టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వివరణ ఇచ్చారు.

## మునుగోడు డిఈ ఇరిగేషన్ ప్రేమాకుమార్ ను కలిసిన రైతులు

**- కిష్టాపురం చెక్ డ్యామ్ కు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలి**

**- వేదాంతం గోపీనాథ్, ఇప్పర్తి మాజీ ఉపసర్పంచ్ పులకరం సైదులు**



**మునుగోడు వెలుతురు అక్టోబర్ 28:**
మునుగోడు డిఈ ఇరిగేషన్ ప్రేమాకుమార్ పిలుపు మేరకు మునుగోడు కార్యలయంలో రైతులతో సహా కలవడం జరిగింది కిష్టాపురం చెక్ డ్యామ్ కు సంబంధించిన సమస్యలను వివరించడం జరిగింది బుధవారం క్షేత్రస్థాయి పరిశీలన చేసి రైతుల సమస్యలకు పరిష్కార మార్గం చేస్తానని చెప్పడం జరిగింది క్షేత్రస్థాయిలో పరిష్కారం జరగకపోతే రైతుల పక్షాన ఉద్యమించడానికి సిద్ధంగా ఉన్నాము ఈ కార్యక్రమంలో వేదాంతం గోపీనాథ్ ఇప్పర్తి మాజీ ఉపసర్పంచ్ పులకరం సైదులు గ్రామాల రైతులు బూడిది నర్సింహా జుట్టు వెంకటయ్య బూడిది వెంకయ్య దోటి వెంకటేష్ పుల్కరం బాలకృష్ణ చీమల వరుణ్ పుల్కరం రవి దోటి శ్రీను జిల్లా స్వామి చీమల రాకేష్ తదితరులు రైతులు పాల్గొనడం జరిగింది

# ఉడాన్-2025లో మెరిసిన మైనారిటీ గురుకుల ప్రతిభావంతులు

**- విద్యా రంగంలో మైనారిటీ గురుకుల విద్యార్థుల నీట్, ఐఐటీ విజయాలు గర్వకారణం...**

**- మంత్రి అడ్లూరి లక్ష్మణ్ చేతులమీద విద్యార్థులకు సన్మానం...**

**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:**
మైనారిటీ గురుకుల విద్యార్థుల ప్రతిభకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఘన గౌరవం లభించింది. మంగళవారం నాడు హైదరాబాద్‌లోని బంజార భవన్‌లో మైనారిటీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు నీట్, జేఈఈ%-%ఐఐటీ వంటి ప్రతిష్ఠాత్మక పోటీ పరీక్షల్లో విజయం సాధించడంతో ఉడాన్%-%2025 సన్మాన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రధాన అతిథిగా హాజరై విజేతలను సన్మానించారు. ఈ సందర్భంగా అల్గోల్ మైనారిటీ బాలుర మరియు బాలికల




గురుకులాల నుండి నీట్ పరీక్ష ద్వారా ఎంబీబీఎస్ ఫ్రీ ప్రభుత్వ సీట్లు సాధించిన 9 మంది బాలికలు, 7 మంది బాలురకు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మెంటోలు మరియు ల్యాప్‌టాప్‌లను బహుకరించారు. కార్యక్రమంలో భాగంగా టెమరీస్ న్యూస్‌లెటర్, ఎస్.ఓ.పీలను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంలో మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ, గురుకుల విద్యా వ్యవస్థ రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యంతో అభివృద్ధి చేసిన మోడల్ ఇక్కడి విద్యార్థులు జాతీయ స్థాయిలో ప్రావీణ్యం సాధించడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో టెమరీస్ అధ్యక్షులు ఫహీమ్ ఖురేషీ, ప్రభుత్వ సలహాదారు మరియు మాజీ మంత్రి షబ్బీర్ అలీ, టెమరీస్ కార్యదర్శి బీ. షఫీఉల్లా, ఇతర అధికారులు, ఆర్ఎల్సీలు, ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. విజేత విద్యార్థుల భవిష్యత్తు విజయవంతం కావాలని మంత్రి ఆకాంక్షించారు.



# హెచ్‌సీఏ రద్దు చేస్తూ తెలంగాణ రాష్ట్రానికి పూర్తి సభ్యత్వ గుర్తింపు టీసీఏకే ఇవ్వాలని బీసీసీఐని డిమాండ్ చేసిన టిసిఏ

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:**
హైదరాబాద్‌లోని ఎస్ డి రోడ్ 'తాజ్ ట్రై స్టార్' హోటల్ లో జరిగిన రాష్ట్ర వ్యాప్త సమావేశంలో తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టీసీఏ) తన జిల్లా కమిటీల ప్రతినిధులు మరియు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులతో చర్చించింది. సమావేశం అనంతరం టీసీఏ ప్రధాన కార్యదర్శి ధారం గురువా రెడ్డి మరియు గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు డా. జి. ప్రేమేందర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ని పూర్తిగా రద్దు చేయాలని, మరియు బీసీసీఐ రాజ్యాంగం అలాగే జాతీయ క్రీడా పాలనా చట్టం ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన పూర్తి సభ్యత్వ గుర్తింపును టీసీఏకే ఇవ్వాలని అధికారికంగా డిమాండ్ చేసింది. హెచ్‌సీఏ అక్రమంగా కార్యకలాపాలు నిర్వహిస్తోందని ఆరోపించిన టిసిఏ హెచ్‌సీఏ ప్రస్తుతం "వెంటిలేటర్‌పై ఉన్నట్లుగా" చట్టవిరుద్ధంగా పనిచేస్తోందని. దానికి: రాజ్యాంగపరమైన అనుమతి లేదు,పరిపాలనా కోరం లేదు, జిల్లా స్థాయి ప్రతినిధిత్వం లేదు. హెచ్‌సీఏ హైదరాబాద్ నగరానికి వెలుపల ఎటువంటి మౌలిక సదుపాయాలు లేదా క్రికెట్ కార్యక్రమాలు లేకపోయినా, నకిలీ "డిస్ట్రిక్ట్ క్రికెట్ కాన్సెప్ట్"తో ప్రజలను తప్పుదారి పట్టిస్తోందని టీసీఏ పేర్కొంది. హైకోర్టు నియమించిన సింగిల్ మెన్ కమిటీ ఉన్నప్పటికీ, హెచ్‌సీఏ ఎలా కొనసాగుతోందో అర్థం కావడం లేదని టీసీఏ ప్రశ్నించింది. "హెచ్‌సీఏలో ఉన్న చాలా మంది సభ్యులు చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు" అని టీసీఏ వ్యాఖ్యానించింది. "తెలంగాణ యువత ఇక



హెచ్‌సీఏ జోక్యం భరించదు. హెచ్‌సీఏ ఇప్పటికే మృతదేహంలాంటిదే తెలంగాణ యువకులు దాన్ని మోసే పరిస్థితి లేదు," అని ధారం గురువా రెడ్డి అన్నారు.

చట్టపరమైన చర్యలు ఇప్పటికే ప్రారంభం:
జిల్లా టీసీఏ కమిటీలు ఇప్పటికే జిల్లా పోలీసు అధికారులకు ఫిర్యాదులు సమర్పించాయి. గత 10 సంవత్సరాల హెచ్‌సీఏ ఆర్థిక అవకతవకల వివరాలు మరియు పత్రాలు సీఐడీకి సమర్పించబడ్డాయి. ప్రస్తుతం సీఐడీ విచారణలు కొనసాగుతున్నాయి. 33 జిల్లాల ప్రాతినిధ్యం కలిగిన కొత్త టీసీఏ నేతృత్వం టీసీఏ ఇటీవల కొత్త గవర్నింగ్ బోర్డును ఎన్నుకుంది, ఇది తెలంగాణ రాష్ట్రంలోని అన్ని 33 జిల్లాలకు సమగ్ర ప్రాతినిధ్యం కలిగిన కొత్త యాజమాన్య నిర్మాణంగా నిలుస్తోంది. రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్నమెంట్లు ప్రకటించిన టీసీఏ

టీసీఏ రెండు ప్రధాన రాష్ట్ర స్థాయి టోర్నమెంట్లను ప్రకటించింది:

1. తెలంగాణ గోల్డ్ కప్ 2025:
నవంబర్ 15, 2025న ప్రారంభం రాష్ట్రంలోని 33 జిల్లాలు పాల్గొనే ప్రీమియర్ లీగ్ ఫార్మాట్, 5 జోన్లలో నిర్వహణ.
2. టీసీఏ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్:
డిసెంబర్ 2025లో నిర్వహణ.

ఈ రెండు టోర్నమెంట్ల లక్ష్యం ు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల క్రికెటర్లకు సమాన అవకాశాలు కల్పించడం. టీసీఏ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యుడు డా. జి. ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ "బీసీసీఐ గత దశాబ్ద కాలంగా జిల్లాల స్థాయిలో క్రికెట్ అభివృద్ధి కోసం పనిచేసిన టీసీఏ కృషిని గుర్తించాలి. హెచ్‌సీఏని పూర్తిగా రద్దు చేయాలి లేదా కేవలం హైదరాబాద్ నగర పరిమితులకే పరిమితం చేయాలి." "రాష్ట్ర స్థాపన ఉద్యమంలో తెలంగాణ యువత పోరాటం సమాన అవకాశాల కోసం జరిగింది. ఇప్పుడు బీసీసీఐ మరియు రాష్ట్ర ప్రభుత్వం కలిసి, అవినీతి చేసిన వారిని శిక్షించి, టీసీఏకి సరైన గుర్తింపు ఇవ్వాలి." బోర్డ్ సమావేశంలో గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు కపిలవాయి రవీందర్, చిత్తరంజన్ కుమార్, డాక్టర్ కూరపాటి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# అంబరానంటిన అంతర్జాతీయ యానిమేషన్ సంబరాలు రవీంద్రభారతి లో ఘనంగా జరిగాయి




**బషీర్ బాగ్ వెలుతురు 28 అక్టోబర్ :**
అంతర్జాతీయ యానిమేషన్ వేడుకలు ఆహ్లాదకరమైన వాతావరణం, కేరింతలు, హర్షధ్వనాల సందడి మధ్య ఘనంగా జరిగాయి. హైదరాబాద్ రవీంద్ర భారతి కళావేదికపై ఆసిఫా ఇండియా నిర్వహణలో అంతర్జాతీయ యానిమేషన్ దినోత్సవాలు 2025 ఘనంగా జరిగాయి. తొలుత సంప్రదాయబద్ధంగా వక్తలు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను శ్రీకారం చుట్టారు. ఈ వేడుకల్లో సుమారు 1100 మంది విద్యార్థులు, కళాకారులు,. విద్యావేత్తలు సినీ పరిశ్రమల నిపుణులు ఒకే వేదిక వద్దకు చేరారు. ఉత్సవాల్లో సినీ దర్శకులు అశ్విన్ కుమార్, శేషప్రసాద్, రజత్ ఝా, ఉష్మన్య, సినీ నిర్మాత సంజయ్ భీమేసరా, ఆసిఫా ఇండియా అధ్యక్షుడు రాజశేఖర్ బుగ్గావీటి, ఉపాధ్యక్షుడు వినీతా బదానీ పలువురు పాల్గొన్నారు. అంతర్జాతీయ స్థాయిలో మన యానిమేషన్ పరిశ్రమ అభివృద్ధి చెందుతుందని మహా అవతార్ నరసింహ చిత్ర దర్శకులు అశ్విన్ కుమార్ అన్నారు. రానున్న రోజుల్లో యానిమేషన్ పరిశ్రమలో ఉపాధి అవకాశాలు అధికంగా వస్తాయన్నారు. విద్యార్థులు సృజనాత్మకతతో , మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అంది పుచ్చుకొని రాని వాళ్ళని సూచించారు.

# అభివృద్ధి సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- బిఆర్ఎస్ పాలనలో మున్సిపాలిటీల్లో జరిగిన అభివృద్ధి శూన్యం**

**- టిపిసిసి ఉపాధ్యక్షులు నవాబ్ ముజాహిద్ అలంఖాన్**



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:**
మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసిందని టిపిసిసి ఉపాధ్యక్షుడు నవాబ్ ముజాహిద్ అలంఖాన్ అన్నారు. రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీలకు రూ.2,780కోట్లు మంజూరు చేయడం జరిగిందని ఆయన తెలిపారు. మంగళవారం బర్కతపుర్లలోని తన కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత పది సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో తెలంగాణలోని మున్సిపాలిటీల్లో జరిగిన అభివృద్ధి శూన్యం అని విమర్శించారు. తెలంగాణ రైజింగ్ విజన్ 2027లో భాగంగా గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రమంతా ఉన్న పట్టణాలను 'గ్రోత్ హబ్'లుగా తీర్చిదిద్దాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. పట్టణాల్లో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టాలని ఉన్నతాధికారులకు సీఎం సూచించారని ఆయన తెలిపారు. పట్టణాభివృద్ధిలో భాగంగా మౌలిక వసతుల కల్పన, కాలుష్య నియంత్రణ, పౌర సేవలు మెరుగురచడం వంటి వాటికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. నూతనంగా ఏర్పడిన మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు. అదనంగా గ్రామ పంచాయతీలు విలీనమైన మున్సిపాలిటీలకు రూ.20 కోట్లు, పాత మున్సిపాలిటీలకు రూ.15 కోట్లు, కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లకు రూ.30 కోట్లను ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాతనే కొత్త మున్సిపాలిటీలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. మున్సిపాలిటీల్లో అంతర్గత రోడ్ల నిర్మాణం, ప్రధాన కూడళ్ళ అభివృద్ధి, పార్కుల సుందరీకరణ వంటి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలు కూడా పూర్తి స్థాయిలో సహకరించి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవం...

## - కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్



**కూకట్ పల్లి అక్టోబర్ 28 వెలుతురు:**
ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మ బండ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ సమీపంలో గల దర్గా లో మైనారిటీ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన గ్యార్వి షరీఫ్ ముబారక్ ఉత్సవాల్లో డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొని అన్న సమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక గ్యార్వి షరీఫ్ ఉత్సవం అని, అందరూ సామరస్యంగా జరుపుకునే వేడుక అని అన్నారు. ఎంతో పవిత్రంగా కొలిచే గ్యార్వి షరీఫ్ ఉత్సవాన్ని భక్తి శ్రద్ధలతో, శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, పెద్ద ఖాజా, చిన్న ఖాజా, షౌకత్ అలీ మున్నా, రెహమాన్, శివ, మహేష్, బషీర్, ఖలీమ్, సాయి, సందీప్, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# డ్రైనేజ్ వ్యవస్థ నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయండి...

**- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్..**



**కూకట్ పల్లి అక్టోబర్ 28 వెలుతురు:**
నూతన డ్రైనేజ్ లైన్స్ నిర్మాణం కొరకు నిధులు మంజూరు చేయాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ జల మండలి అధికారులను కోరారు. మంగళవారం శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని హైదర్ నగర్ డివిజన్ లోని జలమండలి కార్యాలయంలో జలమండలి ఎండి కే.అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి శాసనసభ్యులు, పిఏసి చైర్మన్ అరెకపూడి గాంధీ సమక్షంలో త్రాగునీటి, డ్రైనేజీ సమస్యలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆల్విన్ కాలనీ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ ఆల్విన్ కాలనీ డివిజన్ లో డ్రైనేజ్, త్రాగు నీరు కొరకు ఇప్పటికే పైప్ లైన్స్ నిర్మించి చాలా వరకు సమస్యలు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. కొన్ని కాలనీ లలో పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ లైన్ నిర్మాణం కొరకు అధికారులకు లిఖితపూర్వక వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. వాటిని సమీక్షించి త్వరలో డ్రైనేజీ వ్యవస్థకు నిధులు మంజూరు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా డివిజన్ల కార్పొరేటర్లు, జలమండలి అధికారులు, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోని పేద విద్యార్థులకు రావలసిన 8500 కోట్ల స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలి

**దిలుషుక్ నగర్ చౌరస్తాలో అర్ధనగ్న ప్రదర్శన - ఏబీవీపీ**





**దిలుషుక్ నగర్ వెలుతురు అక్టోబర్ 28:**
మంగళవారం రోజున అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ దిల్ సుక్ నగర్ నగర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న 8500 కోట్ల స్కాలర్షిప్ లను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రాస్తారోకో ధర్నా నిర్వహించడం జరిగింది, ఈ సందర్భంగా స్టేట్ జాయింట్ సెక్రెటరీ అలివేలి రాజు మాట్లాడుతూ స్కాలర్షిప్ లు ప్రభుత్వం విద్యార్థులకు వేసే బిక్ష కాదు విద్యార్థుల హక్కు అని వెంటనే స్కాలర్షిప్ లు విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ లు విడుదల చేయని యెడల రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున విద్యార్థి ఉద్యమాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ప్రభుత్వం చేపడుతున్న ప్రాజెక్టు పనులలో కమిషన్లు మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్లు తీసుకుంటూ విద్యార్థులకు రావలసిన స్కాలర్షిప్ రిలీజ్ చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు, అదే విధంగా స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్యారీ మహేష్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు పూర్తయిన ఇప్పటికీ విద్యార్థులకు రావలసిన ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయకపోవడం అంటే పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడం పనిగా పెట్టుకున్నారు రేవంత్ రెడ్డి చెప్పే మాటలకు చేసే చేతులకు పొంతన లేకుండా పోయింది.రియంబర్స్మెంట్ రాని కారణంగా ప్రవేట్ కళాశాల యజమాన్యాలు కళాశాలల సిబ్బందికి జీతాలు ఇవ్వని పరిస్థితి అదే విధంగా కోర్స్ కంప్లీట్ చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదు అదేవిధంగా గవర్నమెంట్ కళాశాలలో ఫీజు రియంబర్స్మెంట్ విడుదల కాని కారణంగా మౌలిక వసతులు కల్పించడంలో ఫెయిల్ అవుతున్నాయి కావున కాంగ్రెస్ ప్రభుత్వం మేకపోతు గాంభీర్యం ప్రదర్శించకుండా విద్యార్థులకు రావలసిన రియంబర్స్మెంట్ విడుదల చేయాలి. ఈ ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తూ జూబ్లీహిల్స్ బై ఎలక్షన్ లో సైతం ప్రతి ఏబీవీపీ కార్యకర్త విద్యార్థులు వారి వారి తల్లిదండ్రులను జాగృతం చేసి ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఓడగొట్టడమే పనిగా కార్యచరణ మొదలుపెడతాం అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అక్యారి మహేష్, జిల్లా కన్వీనర్ గంగాధర్, నగర కార్యదర్శి విశ్వ తేజ, నాయకులు విజయ్, రిషిత్, బబ్లు, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరిన బీఆర్ఎస్ నాయకుడు సాయి బాబా చౌదరి...

**కూకట్ పల్లి అక్టోబర్ 28 వెలుతురు:**
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో కూకట్ పల్లి కి చెందిన పలువురు బిఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కూకట్ పల్లి నియోజకవర్గం బిఆర్ఎస్ పార్టీ కేపిహెచ్ బి డివిజన్ మాజీ అధ్యక్షులు మందలపు సాయి బాబ చౌదరి మంగళవారం బిఆర్ఎస్ ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, శేర్లింగంపల్లి శాసనసభ్యులు, పిఏసి చైర్మెన్ అరికేపూడి గాంధీ, కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ బండి రమేష్ ల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా సాయి బాబా చౌదరి కి సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి




ఆహ్వానించారు. అనంతరం సాయిబాబ చౌదరి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి వైపు దూసుకుపోతుందని అన్నారు. అదేవిధంగా బండి రమేష్ నాయకత్వంలో కూకట్ పల్లి నియోజకవర్గాన్ని, కెపిహెచ్బి కాలనీ డివిజన్ లను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుపోవాలని ఆలోచనతో కాంగ్రెస్ పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చౌదరితో పాటు గాదెల అనిల్ కుమార్, వాసు రెడ్డి సుధీర్, దొప్పలపూడి రత్నాకర్, చిలుకూరి గోవిందరాజు, వాసిరెడ్డి ప్రదీప్, మన్నే సుబ్రహ్మణ్యం, కాజా నవీన్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు.

# గుండె ఆపరేషన్ కోసం రక్తదానం చేసి ఆదుకున్న న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి

**- ఓ నెగటివ్ రక్తాన్ని 67 సార్లు దానం చేసిన బేతి మహేందర్ రెడ్డి.**

**- రక్తదానం చేయండి.. ప్రాణదాతలుగా నిలవండి.**

**- బీజేపీ నేత, రక్తదాత బేతి మహేందర్ రెడ్డి పిలుపు.**



**కరీంనగర్ వెలుతురు అక్టోబర్ 28:**
ప్రమాదకర పరిస్థితిల్లో అత్యంత అరుదైన "ఓ నెగటివ్" రక్తాన్ని గత 31 ఏళ్లుగా దానం చేస్తున్నానని, ఎంతోమంది రోగుల ప్రాణాలు కాపాడడంతో పాటు నేటివరకు 67 సార్లు రక్తదానంతో పాటు ప్లేట్ లెట్స్, ప్లాస్మా దానం చేయడం జరిగిందని బీజేపీ నేత, న్యాయవాది బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ జగిత్యాల జిల్లా మల్యాల మండలం మ్యాడంపల్లి గ్రామానికి చెందిన గుర్రం ఆగయ్య (70 ఏళ్ళ) అనే వ్యక్తి కరీంనగర్ లోని ఒక ప్రైవేట్ దవాఖానలో తీవ్రమైన గుండె నొప్పితో భాదపడుతూ చికిత్స నిమిత్తం అత్యవసరంగా ఆపరేషన్ చేయాలని డాక్టర్లు సూచించడంతో పేషెంట్ కు ఓ నెగటివ్ రక్తం అత్యవసరం కాగా నగరంలోని ఒక ప్రైవేట్ బ్లడ్ బ్యాంక్ ద్వారా పేషెంట్ బంధువులు బేతి మహేందర్ రెడ్డి ని ఫోన్ ద్వారా సంప్రదించగా వెంటనే వెళ్లి ఓ నెగటివ్ రక్తాన్ని దానం చేసి ప్రాణాలు కాపాడడం జరిగిందని మహేందర్ రెడ్డి తెలిపారు. ఈ రక్తదానం చేయడం ద్వారా నేటివరకు 67 సార్లు ఓ నెగటివ్ రక్తాన్ని దానం చేయడం జరిగిందని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు. రక్తదానం చేయడం ద్వారా రోగి ప్రాణాలు కాపాడడంతో పాటు వారి కుటుంబాన్ని కూడా రక్షించినవారమవుతామని, అలాగే రక్తదానం చేయడం ద్వారా మనకు కొత్త రక్తం రావడమే కాకుండా ఆరోగ్య%శీ%గా ఉంటామని, అందుకే ఎలాంటి భయాలు లేకుండా ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రతి ఒక్కరు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి కోరారు. రక్తదానం చేసిన బేతి మహేందర్ రెడ్డిని బీజేపీ శ్రేణులు, న్యాయవాదులు, 40వ డివిజన్ వాస్తవ్యులు, శ్రేయోభిలాషులు అభినందించారని బేతి మహేందర్ రెడ్డి తెలిపారు.

# ఎరువుల కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ

**- కంపెనీలకు రూ.37,952 కోట్ల చెల్లింపులు**

**- కేంద్ర కేబినేట్ నిర్ణయంపై కిషన్ రెడ్డి వివరణ**

**న్యూఢిల్లీ,అక్టోబర్28( వెలుతురు):**
ఎరువుల ఉత్పత్తి కంపెనీలకు న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలన్న కేంద్ర కేబినెట్ నిర్ణయంపై.. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి మంగళవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం గత 11 ఏళ్లుగా కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ఈ క్రమంలో మంగళవారం కేంద్ర కేబినెట్ మరో చారిత్రక నిర్ణయం తీసుకుందని తెలిపారు. రైతులపై ఎరువుల ధరలు భారం పడకుండా, ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు రూ.37,952 కోట్ల న్యూట్రియంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. అంతర్జాతీయంగా వివిధ కారణాలతో ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నప్పటికీ.. ఈ ధరల ప్రభావం ఏమాత్రం రైతులపై పడకుండా చర్యలు తీసుకుంటోందని చెప్పుకొచ్చారు. ఈ ప్రయత్నంలో భాగంగా.. ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై పడుతున్న భారాన్ని కేంద్ర ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో ఇవాళ సమావేశమైన కేంద్ర కేబినెట్.. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించి.. డై అల్యూమినియం ఫాస్ఫేట్ , మోనో అల్యూమినియం ఫాస్ఫేట్ , మ్యూరియేట్ ఆఫ్ పొటాష్ , ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ , 3 గ్రేడ్స్ ఆఫ్ సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ , పొటాష్ డెరైవ్‌డ్ మొలాసెస్ , అల్యూమినియం సల్ఫేట్ వంటి దాదాపు 28 ఫెర్టిలైజర్స్‌ను ఉత్పత్తి చేసే కంపెనీలకు న్యూట్రియెంట్ బేస్డ్ సబ్సిడీ అమలు చేయాలని నిర్ణయించిందని వివరించారు కిషన్‌రెడ్డి. ఇందుకోసం.. అంతర్జాతీయంగా పెరిగిన ధరలతో ఈ ఎరువుల ఉత్పత్తి కంపెనీలపై భారం పడకుండా.. రబీ సీజన్ కోసం రూ.37,952 కోట్లు కేటాయిస్తున్నట్లు కేబినెట్ నిర్ణయించిందని వెల్లడించారు. ఇది ఎరువులు ఉత్పత్తి కంపెనీలకు కూడా భారం పడకుండా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని చెప్పుకొచ్చారు.

# నా ప్రజల ఆరోగ్యమే నాకు ముఖ్యం



## బెల్ట్ షాపుల నిర్మూలన పై ప్రత్యేక దృష్టి

- మునుగోడులో మద్యం కంటే ప్రజల ఆరోగ్యానికే పెద్దపీట వేస్తున్న కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి
- సామాజిక రుగ్మతలాగా మారిన అధిక తాగుడుకు కళ్లెం వేసే దిశగా మునుగోడు అడుగులు
- మా మంచికోసమే మా ఎమ్మెల్యే చెపుతుండంటూ మహిళల హర్షం
- మునుగోడులో బెల్ట్ షాపుల నిర్మూలన సక్సెస్, మద్యం షాపుల సమయపాలన మార్పుకు ప్రయత్నం
- ప్రజలను అనారోగ్యానికి గురిచేసే ఆదాయం ముఖ్యమా ప్రజల ఆరోగ్యం ముఖ్యం అన్న ప్రశ్న తలెత్తినపుడు ప్రజల ఆరోగ్యం వైపే ఉంటానంటున్న రాజ్ గోపాల్ రెడ్డి

*ప్రజల సంక్షేమమే సంక్షేమ రాజ్యం యొక్క ప్రధాన లక్షణం. ప్రజల ఆరోగ్యాలను కాపాడడం కూడా సంక్షేమం కిందకే వస్తుంది. సంక్షేమంలో ఒకవైపు ప్రజలకు ఉచిత వైద్యం అందిస్తూ ఆరోగ్యవంతులు గా చేస్తూనే మరోవైపు ప్రజలను అనారోగ్యానికి గురికాకుండా చూసే భాద్యత కూడా రాజ్యానిదే(రాష్ట్రాలదే). ఇదే అంశాన్ని భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలలో పొందుపరిచారు రాజ్యాంగ కర్తలు. ఆదేశిక సూత్రాలలోని అదికరణ 47 ప్రకారం రాష్ట్రాలు ఆరోగ్యానికి హానికరమైన మత్తు పానీయాల వినియోగాన్ని నిషేదించడానికి ప్రయత్నించాలి అని చెపుతోంది. చాలా వరకు రాష్టాలు మద్యపానం నిషేదానికి బదులుగా మద్యం అమ్మకాలను నియంత్రించడం పన్నులు విదించడం వంటి విదానాలను ఎంచుకున్నాయి. అదికారంలోకి రావడానికి ఉచిత హామీలు ఇస్తున్న పార్టీలు ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన తరువాత ఆ ఉచిత హామీలు నెరవేర్చడానికి ఆదాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి. ప్రస్తుతం రాష్టాలను నడిపే ఆదాయ మార్గాలలో మద్యం కూడా చేరిపోయింది. ప్రభుత్వాలే మద్యం విక్రయాలను విపరీతంగా ప్రోత్సహించే స్థితికి చేరుకున్నాయి. మద్యం ప్రభత్వానికి అదిక ఆదాయాన్ని తెచ్చిపెట్టే వనరుగా మారింది...*




### సామాజిక రుగ్మతగా మారిన తాగుడు

### గడచిన పదేండ్లలో తాగుడుకు బానిసై చనిపోతున్న యువకుల సంఖ్య గ్రామాలలో గణనీయంగా పెరిగింది

### చిన్నవయసులోని భర్తలను కోల్పోయి విదవలుగా మారుతున్న యువతులు

ప్రభుత్వాలకు అదిక ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న మద్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. పల్లెల్లో విచ్చల విడిగా బెల్ట్ షాపుల ద్వారా మద్యం విక్రయాలు జరగుతున్నాయి. ఒకప్పుడు ప్రజలకు అవసరమైన సరుకులు మాత్రమే అమ్మే కిరాణ షాపులు బెల్టు షాపులుగా రూపాంతరం చెందాయి. ఏదైనా జ్వరం లాంటిది వస్తే మందుబిల్ల దొరకని గ్రామమైన ఉంటుందేమో కాని మద్యం దొరకని పల్లె మాత్రం ఉండదనేది అతిశయోక్తి కాదు. ఎప్పుడైతే ఎక్కడ పడితే అక్కడ మద్యం విరివిగా అందుబాటులోకి వచ్చిందో పెద్దా, చిన్నా అనే తేడా లేకుండా త్రాగేస్తున్నారు. క్రమ క్రమంగా తాగుడుకు భానిసలుగా మారుతున్న వారి సంఖ్య పెరిగింది. గత పదిసంవత్సరాలలో గ్రామాలలో తాగుడుకు బానిసలుగా మారి చనిపోయిన యువకుల సంఖ్య పెరిగింది. యుక్త వయసులోనే భర్తను కోల్పోయి చిన్నచిన్న పిల్లలను,



వృద్దులైన అత్తా మామలను సాకుతూ కుటుంబాలను పోషించడం మహిళలకు భారంగా మారింది. కూలీనాలీ చేసుకుంటూ చాలీచాలని దుర్భర జీవితాలను గడుపుతున్నారు. తాగుడు సామాజిక రుగ్మతగా మారి ప్రజలను ఆరోగ్యంగా ఆర్థికంగా దెబ్బతీయడమే కాకుంగా గ్రామాలలో ప్రశాంతమై వాతావరణాన్ని చెడగొడుతుంది. ఒకప్పుడు ఎటువంటి గొడవలకు ఆస్కారం లేకుండా ప్రశాంతంగా జీవనం సాగించిన పల్లెలు,మద్యం మహమ్మారి వల్ల నిత్యం గొడవలమయంగా మారాయి..

### 2018 లోనే బెల్ట్ షాపుల నిర్మూలిస్తానని హామీ

### బెల్ట్ షాపులు నిర్మూలించిన గ్రామాలకు 5 లక్షల ఆర్థిక సాయం అందించిన రాజ్ గోపాల్ రెడ్డి

పల్లెల్లో తాగుడు ఎక్కువై ఆరోగ్య కర వాతావరణాన్ని చెడగొట్టడమే కాకుండా కుటుంబాలలో గొడవలు, అప్పులపాలు అవుతున్న తీరును ముందే గ్రహించిన కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లోనే గ్రామాలలో విచ్చలవిడిగా ఏర్పాటైన బెల్ట్ షాపులను నిర్మూలిస్తానని ప్రజలకు హామీ ఇచ్చారు. 2018 ఎన్నికల్లో తాను గెలవగానే బెల్ట్ షాపులు నిర్మూలించిన గ్రామాలకు తన తల్లి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ పేరుతో 5 లక్షల ఆర్థికసహాయం అందిస్తానని చెప్పారు. కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు నారాయణపూర్ మండలం అల్లందేవి చెరువు గ్రామస్తులు తమ గ్రామంలో బెల్ట్ షాపులు నిర్మూలించారు. బెల్ట్ షాపులు నిర్మూలించిన అల్లందేవి చెరువు గ్రామాభివృద్దికి వెంటనే 5 లక్షల ఆర్థిక సహాయం



అందించారు. ఆ నిదులతో గ్రామంలో గ్రామపంచాయతీ నూతన భవనాన్ని నిర్మించుకున్నారు. తాను గెలిచినప్పటికి అదికారంలోకి రెండవ సారి బీఆర్ఎస్ పార్టీ రావడంతో తాననుకున్న లక్ష్యం నెరవేరలేదు. తిరిగి 2023 సాదారణ ఎన్నికల్లో గెలిచి మునుగోడు నియోజకవర్గ వ్యాప్తంగా ఒక్క బెల్టు షాపు కూడా నడవకుండా కట్టడి చేశారు. బెల్ట్ షాపులకు నిర్మూలించిన గ్రామాలకు ప్రభుత్వం నుండి 10 లక్షల రూపాయల అదనపు నిదులను ఇచ్చారు. మునుగోడు మండలంలోని జమస్తాన్ పల్లి, సింగారం, రావిగూడెం, జక్కలివారిగూడెం, కచలాపురం గ్రామాలకు అదనపు నిదులు వచ్చాయి. దీంతో మునుగోడు నియోజకవర్గంలోని గ్రామాలలో మద్యం అందుబాటులో లేకుండా చేయడంలో సక్సెస్ అయ్యారు. దీని ఫలితంగా మునుగోడు నియోజకవర్గంలో క్రైమ్ రేట్ తగ్గింది. మద్యం అందుబాటులో లేకపోవడంతో గొడవలు లేవు, గ్రామాలు ప్రశాంతగా ఉన్నాయి..

### మద్యం షాపులకు టెండర్లు వేసే వారిని ముందే హెచ్చరించిన రాజ్ గోపాల్ రెడ్డి

2018 లో బెల్ట్ షాపులను నిర్మూలద్దామనుకున్న ప్రభుత్వం రాకపోవడంతో అది సాద్యం కాలేదు. 2023 లో కాంగ్రెస్ ప్రభుత్వం అదికారం చేపట్టాక మునుగోడు నియోజకవర్గంలో ఒక్క బెల్ట్ షాపు నడవకుండా చేయడంలో సఫలీక్రుతులయ్యారు. దీంతో నియోజకవర్గంలో క్రైమ్ రేట్ కూడా తగ్గింది. మరో అడుగు ముందుకేసి నియోజకవర్గంలో మద్యం టెండర్లు వేయాలనుకునే వారు సాయంత్రం 4 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు మాత్రమే విక్రయించుకోవాలని తన మనసులో మాట చెప్పారు. ఇది ప్రభుత్వ విదానాలకు వ్యతిరేకం అని తెలిసినా కూడా ప్రజల ఆరోగ్యాలను పాడు చేస్తూ వచ్చే మద్యం ఆదాయం కంటే ప్రజల ఆరోగ్యమే ముఖ్యమని ఈ కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ నిర్ణయం తీసుకోవడం వెనకాల గ్రామాలలో తన భర్త చనిపోయి ఇద్దరు చిన్న పిల్లలతో బ్రతుకు భారంగా ఉందని ఎంతోమంది మహిళల ఆవేదన, తన కొడుకు మద్యానికి బానిసై ఇబ్బంది పెడుతున్నాడంటూ వృద్ధ తల్లితండ్రుల ఆవేదన, గ్రామాలలో ప్రశాంత జీవనం సాగిస్తున్న కుటుంబాలలో అదిక తాగుడు చిచ్చు పెడుతున్న తీరులాంటి అంశాలు రాజ్ గోపాల్ రెడ్డిని కదిలించాయి. తాను తాగుడుకు వ్యతిరేకం కాదని ఉదయం నుండి సాయంత్రం వరకు పనిచేసుకుని శరీరం అలసిపోతే సాయంత్రం పూట మాత్రమే మద్యాన్ని సేవించాలని చెపుతున్నారు. ఎపుడు పడితే అపుడు మద్యం సేవిచండం వల్ల కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయని, తాగుడుకు బానిసలు గా మారిన వాళ్ల ఆరోగ్యం క్షీణిస్తూ ఆ వ్యక్తికి సంబందించిన కుటుంబాలు రోడ్ల పాలవుతున్నాయంటారు. మనం ప్రజలకు చెప్పే ముందు మనం పాటించాలని నియోజకవర్గంలో ని నాయకులకు పగటి పూట మద్యం తాగొద్దని హుకుం జారీ చేశారు. దీంతో మునుగోడు నియోజకవర్గంలో పగటి పూట మద్యం తాగేవిదానం తగ్గింది

### వైన్ షాపు పర్మిట్ రూంలలోకి వెళ్లి మద్యం సేవించే వారికి వార్నింగ్ ఇచ్చిన రాజ్ గోపాల్ రెడ్డి

### మా ఎమ్మెల్యే మా మంచి కోసమే చెబుతున్నారంటూ మహిళల హర్షం

మద్యం మహమ్మారి కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తుందని ఆ మహమ్మారిని తగ్గించాలనే క్రుత నిశ్చయంతో మునుగోడు లో మద్యాహ్నం వైన్ షాపులను తనిఖీలు చేశారు రాజ్ గోపాల్ రెడ్డి. పర్మిట్ రూముల్లో పగటిపూట మద్యం సేవిస్తున్న వ్యక్తులకు వార్నింగ్ కూడా ఇచ్చాడు. దీంతో మునుగోడు నియోజకవర్గంలో క్రమక్రమంగా పగటి పూట మద్యం తాగేవాళ్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. గ్రామాలలోనైతే ఉదయం నుడి సాయంత్రం వరకు పని చేసుకుంటూ నాలుగు పైసలు వెనకేసుకుంటున్నారు. మద్యం అమ్మకాలపై రాజ్ గోపాల్ రెడ్డి తీసుకున్న నిర్ణయాలు గ్రామాలలో చర్చకు తెరలేపాయి. గ్రామాలలో ఇంకా బెల్ట్ షాపుల ద్వారా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయా అంటూ ఎప్పటికప్పుడు స్తానిక పోలీసులకు నాయకులకు ఫోన్లు చేసి ఆరా తీసేవారు. గ్రామాలలో బెల్ట్ షాపులు నిర్వహించకుండా చూడాల్సిన భాద్యత స్థానిక నాయకులకు అప్పగించారు. గ్రామాలలో బెల్ట్ షాపులను నిర్మూలించడానికి మహిళలని భాగస్వామ్యం చేస్తూ కమీటీలు వేశారు. స్థానిక పోలీసులకు బెల్ట్ షాపులు నడిపేవాళ్ల పైన ఉక్కుపాదం మోపాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో మునుగోడు నియోజకవర్గంలో బెల్ట్ షాపుల నిర్మూలన జరిగింది. ప్రతిరోజు గ్రామాలలో తాగుడుకు బానిసలుగా మారిన చాలా మంది తమ పనులు చేసుకుంటూ ఆరోగ్యంగా జీవిస్తున్నారు. రాజ్ గోపాల్ రెడ్డి తీసుకున్న ఈ మంచి నిర్ణయానికి మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు..

### ప్రజలకు అవసరమయ్యే పనులు చేసేవాడే ప్రజానాయకుడు అవుతాడు

అదికార పార్టీ ఎమ్మెల్యే గా ఉండి ప్రభుత్వ విదాన నిర్ణయాలకు వ్యతిరేకంగా మాట్లాడాలంటే ఎంతో దైర్యం ఉండాలి. ప్రజలకు హాని జరగుతున్నపుడు తాను అదికార పక్షంలో ఉన్నా ప్రజల వైపే మాట్లాడుతానని కుండభద్దలు కొట్టినట్లు చెప్పడం రాజ్ గోపాల్ రెడ్డి నైజం. ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజలకు మేలు చేసేవిగా ఉండాలి కాని కీడు చేసేలా ఉండకూడదనేది ఆయన ఆలోచన. మద్యం షాపుల విక్రయ సమయాలను మనుగోడు నియోజకవర్గంలో కుదిస్తామని చెప్పిన ఆయన ఈ ఆలోచనను అవసరమైతే రాష్టవ్యాప్తంగా అమలు పరిచేలా ప్రభుత్వంతో మాట్లాడుతానని చెప్పడం వెనకాల ఎంతో దూరద్రుష్టి ఉన్నట్లు గా స్పష్టమవుతోంది. గ్రామాలలో ఆరోగ్య కరమైన వాతావరణాన్ని బావితరాలకు అందించాలంటే మద్యాన్ని, మాదకద్రవ్యాలను పూర్తిగా నియంత్రించాల్సిందే. మద్యాన్ని నియంత్రించాలన్న రాజ్ గోపాల్ రెడ్డి ఆలోచన సమాజంలో పెద్ద చర్చకే దారితీసింది. రాజ్ గోపాల్ రెడ్డి మద్యం పాలసీ పై చేసిన వ్యాఖ్యలు రాష్ట వ్యాప్తంగా సంచలనంగా మారిన నేపథ్యంలో చదువుకున్న మేథావులు, సామాజిక విశ్లేషకులు, మహిళలు ఈ నిర్ణయం సరైనదే అని అంటున్నారు.



**హరిప్రసాద్ మొకరాల**
సీనియర్ జర్నలిస్ట్



## వరంగల్ జిల్లాలో అంగన్‌వాడీ చిన్నారిపై లైంగిక దాడి ఘటనపై మంత్రి సీతక్క ఆగ్రహం

**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:**

వరంగల్ జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రానికి చెందిన చిన్నారిపై జరిగిన లైంగిక దాడి ఘటన పట్ల మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి అమానుష ఘటనలు సమాజాన్ని కలచివేస్తాయని, దోషులను కఠినంగా శిక్షించాలన్నది ప్రభుత్వ సంకల్పమని ఆమె స్పష్టం చేశారు. మంత్రి సీతక్క ఈ ఘటనపై వెంటనే సంబంధిత మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారుల నుంచి వివరాలు తెప్పించుకున్నారు. చిన్నారి ఇంటికి చేరుకుని కుటుంబానికి అండగా నిలవాలని ఆదేశించారు. బాధిత చిన్నారికి తగిన వైద్య, మానసిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. చిన్నారుల భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికీ తావు ఉండదు. చిన్నారులపై దాడులు చేసేవారిని కఠినంగా శిక్షించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది అని మంత్రి సీతక్క స్పష్టం చేశారు.

## మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది

### భూపాలపల్లి నియోజకవర్గంలో క్రీడా మైదానానికి 5 కోట్లు కేటాయించిన మంత్రి వాకిటి శ్రీహరి

**వెలుతురు భూపాలపల్లి, అక్టోబర్ 28:**

మత్స్యకారుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది మత్స్య శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. భూపాలపల్లి నియోజకవర్గం గణపురం మండలం కేంద్రంలోని గణపసముద్రం చెరువులో వంద శాతం రాయితీపై ఉచిత



చేపపిల్లల పంపిణీ కార్యక్రమంను ప్రారంభించారు. అనంతరం స్థానికంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వం మత్స్యకారుల సంక్షేమానికి కట్టుబడి ఉందన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో అదే సామాజిక వర్గానికి చెందిన వారికి కాకుండా, ఇతరులకు మత్స్యశాఖను కేటాయించి వారి అభివృద్ధికి తోడ్పడలేదు మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత తాను మత్స్య శాఖను ప్రక్షాళన చేసాను ప్రస్తుతం పంపిణీ చేస్తున్న చేప పిల్లల ద్వారా ఐదు లక్షల మత్స్యకారుల కుటుంబాలకు ఉపాధి దొరుకుతుంది పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మత్స్యకారులను పట్టించుకోలేదని,రాష్ట్రంలోని 5 లక్షల మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి కలిగేలా రూ.123 కోట్ల నిధులు మంజూరు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డి ప్రజా ప్రభుత్వానిది నేను కూడ పేదింటి బిడ్డనే ఇప్పటికీ సహకారం సంఘం వచ్చే కైకం 210 రూపాయలు బాధ్యతగా స్వీకరిస్తాను సామాజిక న్యాయం కల్పించాలని ఉద్దేశంతో రాష్ట్రంలో కులగణన చేశాం కులగణనపై



కావాలనే కొంతమంది ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారు సామాజిక న్యాయానికి కేర్ ఆఫ్ అడ్రెస్స్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం నూతన రేషన్ కార్డులు, సన్నబియ్యం లాంటి పథకాలను అమలు చేస్తున్నాం స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ కమిట్మెంట్ ఉన్న నాయకుడు ఈ ప్రాంతాన్ని బాగు చేసుకోవాలని పట్టుదలతో ఉన్న వ్యక్తి మీ ఎమ్మెల్యే కోరిక మేరకు భూపాలపల్లి నియోజకవర్గంలో క్రీడా మైదానానికి 5 కోట్లు కేటాయిస్తున్నన్నారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ,డీసీసీ అధ్యక్షుడు,రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్,ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు

## తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల మంత్రి జూపల్లి సంతాపం



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు తండ్రి సత్యనారాయణ మరణం పట్ల పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సంతాపం తెలిపారు. హరీష్ రావు కుటుంబ సభ్యులకు మంత్రి జూపల్లి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. సత్యనారాయణ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## మాజీ మంత్రి హరీష్ రావు తండ్రి మరణం పట్ల సంతాపం వ్యక్తం చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**హైదరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే శ్రీ తన్నీరు హరీష్ రావు గారి తండ్రి సత్యనారాయణ రావు గారి మృతి ఎంతో బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. హరీష్ రావు గారికి మరియు వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి." అని మంత్రి తన X(ట్విట్టర్) లో పేర్కొన్నారు.

## కార్తీకదీపోత్సవ పత్రిక ఆవిష్కరణ



**వెలుతురు నారాయణఖేడ్ అక్టోబర్ 28 :** సంగారెడ్డి జిల్లా :- నారాయణఖేడ్ పట్టణ శివారులోని వెంకటాపూర్ చౌరస్తాలో గల శ్రీ భక్త మార్కండే ఆలయంలో నవంబర్ 10 కార్తీక మాసం మూడవ సోమవారం రోజున అత్యంత వైభవోపేతంగా నిర్వహించనున్న కార్తీకదీపోత్సవం,తులసీ దామోదర,శివపార్వతుల కళ్యాణ మహోత్సవ పత్రికను రంగంపేట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి, బ్రహ్మశ్రీ గురురాజు శర్మల ఆధ్వర్యంలో మంగళవారం మహతి జ్యోతిష్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీక మాసం శివుడికి అత్యంత ప్రీతిపాత్రమైందని,ఈ మాసంలో శివకేశవుల్ని స్మరించడం,దీపారాధన చేయడం ద్వారా శుభపరిణామాలు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో శ్రీ భక్త మార్కండేయ ఆలయ కమిటీ బాధ్యులు,భక్తులు పాల్గొన్నారు.

## రంజోల్ గ్రామానికి చెందిన యువతి అదృశ్యం

**- జహీరాబాద్ రూరల్ పిఎస్ లో కేసు నమోదు...**

**- వివరాలు వెల్లడించిన రూరల్ ఎస్ఐ కాశీ నాథ్....**



**జహీరాబాద్ వెలుతురు అక్టోబర్ 28:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ పరిధిలోని రంజోల్ గ్రామంలో యువతి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. జహీరాబాద్ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. కాశీ నాథ్ తెలిపిన వివరాల ప్రకారం, రంజోల్ గ్రామానికి చెందిన అలిగి క్రిస్టినా (21) అక్టోబర్ 26వ తేదీ రాత్రి సుమారు 2 గంటల సమయంలో ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె బయటకు వెళ్లిన తర్వాత తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెతికినప్పటికీ ఎటువంటి సమాచారం లభించలేదని ఎస్ఐ పేర్కొన్నారు. ఈ విషయంపై భర్త అలిగి నర్సింలు తండ్రి అలిగి నింగప్ప (31) జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని వారు తెలిపారు. అదృశ్యమైన సమయంలో క్రిస్టినా ఎరుపు రంగు నైటీ ధరించి ఉండి, ఎత్తు సుమారు 5 అడుగులు, చామనచాయ వర్ణం, కొల ముఖం కలిగి ఉన్నారని ఎస్ఐ తెలిపారు. అదృశ్యమైన యువతి ఆచూకీ తెలిసినవారు తక్షణమే పోలీసులకు సమాచారం ఇవ్వాలని జహీరాబాద్ రూరల్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. కాశీనాథ్ కోరారు. సంప్రదించవలసిన నంబర్లు: జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్: 8712661847, SIP: 8712656764, CIP: 8712656731.

## ఢిల్లీ విమానాశ్రయంలో తప్పిన ముప్పు

**- ఎయిరిండియా బస్సుకు అగ్నిప్రమాదం**

**న్యూఢిల్లీ,అక్టోబర్28( వెలుతురు):**

దేశ రాజధాని ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఎయిరిండియా బస్సు దగ్ధమైంది. విమానాశ్రయం మూడో టెర్మినల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఎయిర్‌క్రాఫ్ట్ రెస్క్యూ సిబ్బంది, అగ్నిమాక సిబ్బంది వెంటనే మంటలను అదుపు చేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది. ట్యాక్సీయింగ్ ఏరియాలో నిలిపి ఉంచిన విమానానికి అత్యంత సమీపంలో ఈ ఘటన జరిగినప్పటికీ ఆ సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. గ్రౌండ్ హ్యాండిలర్స్‌కు చెందిన బస్సు మధ్యాహ్నం సమయంలో మంటల్లో చిక్కుకుందని, అయితే ఏఆర్ఎఫ్ఎఫ్ నిపుణుల బృందం రెండు నిమిషాల్లోనే మంటలను అదుపు చేసిందని ఢిల్లీ ఎయిర్‌పోర్ట్ అధికారిక 'ఎక్స్' ఖాతాలో తెలియజేసింది. ఘటన సమయంలో బస్సులో ఎవరూ లేకపోవడంతో ఎవరికీ నష్టం జరగలేదని తెలిపింది. విమాన సర్వీసులు యథాప్రకారం నడుస్తున్నాయని తెలిపింది. ప్రయాణికులు, సిబ్బంది భద్రత తమకు అత్యంత ప్రాధాన్యమని పేర్కొంది.





## తెలంగాణ పత్తి రైతుల కష్టాలు తీర్చండి.. తేమ శాతం తగ్గించండి..

**- అకాల వర్షాలతో పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి మద్దతు ధర పెంచి తెలంగాణ రైతును ఆదుకోండి**

**- మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి**

**- తెలంగాణ పత్తి రైతుల సమస్యలు, తేమ శాతం సడలింపు, MSP పెంపు కోరుతూ సీసీఐ చైర్మన్‌ను కలిసి విజ్ఞప్తి చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**ముంబై వెలుతురు అక్టోబర్ 28:** తెలంగాణ రాష్ట్రంలోని పత్తి రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మంగళవారం ముంబైలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) చైర్మన్ , మేనేజింగ్ డైరెక్టర్ లలిత్ కుమార్ గుప్తాను తో ప్రత్యేకంగా భేటి అయ్యారు. వారిద్దరి మధ్య గంట పాటు సాగిన ఈ సమావేశంలో, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, MSP సేకరణ, మరియు రైతులకు తక్షణ ఉపశమనం అందించాల్సిన అవసరాన్ని మంత్రి సీసీఐ చైర్మన్ కు వివరించారు.

సమావేశంలో మంత్రి ప్రస్తావించిన ప్రధాన అంశాలు:

తేమ శాతం సడలింపు తప్పనిసరి:

తెలంగాణతో సహా దక్షిణ భారత రాష్ట్రాలలో అధిక తేమ స్థాయిలు ఉన్న కారణంగా, ప్రస్తుత FAQ (Fair Average Quality) నిబంధనల ప్రకారం నిర్దేశించిన 8-12% తేమ శాతాన్ని పాటించడం అసాధ్యమని మంత్రి స్పష్టం చేశారు. ఇటీవల కురిసిన అకాల వర్షాలు, తుఫాను వల్ల పంటలు దెబ్బతిన్నాయి. అందుకే, రైతులకు నష్టం జరగకుండా ఉండేందుకు తేమ శాతాన్ని తక్షణమే 14% వరకు సడలించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు.

MSP పెంపు, సేకరణ విస్తరణ:

పెరుగుతున్న సాగు ఖర్చులకు అనుగుణంగా పత్తికి కనీస మద్దతు ధర (MSP)ని సవరించాలని, అలాగే అన్ని పత్తి పండించే జిల్లాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలను విస్తరించి , ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ నుండి రైతులను కాపాడాలని కోరారు.



తక్షణ ఉపశమన చర్యలు:

తెగులు నష్టం (Pink Bollworm Pest) మరియు అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు ప్రత్యేక ఉపశమన ప్యాకేజీ అందించాలి. గత సీజన్లలో సేకరించిన పత్తికి సంబంధించి రైతులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలి. మార్కెట్ యార్డ్ స్థాయిలో ఆధునిక తేమ పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయాలి.తెలంగాణ రైతులకు న్యాయం జరిగి, వస్త్ర సరఫరా గొలుసు బలోపేతం అయ్యేలా సీసీఐ చైర్మన్ వ్యక్తిగత శ్రద్ధ వహించాలి." అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అభ్యర్థించారు. మంత్రి తన విజ్ఞప్తిలో పేర్కొన్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం తో చర్చించి, సానుకూలంగా పరిష్కరిస్తామని సీసీఐ చైర్మన్ లలిత్ కుమార్ గుప్తా..మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి కి హామీ ఇచ్చారు. మంత్రి వెంట జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి కూడా ఉన్నారు.

# హరీష్ రావుకు పితృవియోగం

**- తండ్రి సత్యానారాయణ కన్నుమూత**

**- బావకు నివాళి అర్పించి..అక్కను ఓదార్చిన కెసిఆర్**

**- కెటిఆర్, బిఆర్ఎస్ నేతల నివాళి**

**- మంత్రులు పొన్నం తదితరుల నివాళి**

**- సంతాపం తెలిపిన సిఎం రేవంత్, వైఎస్ జగన్**



**హైదరాబాద్,అక్టోబర్28( వెలుతురు):**

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు ఇంట విషాదం నెలకొంది. హరీశ్ తండ్రి తన్నీరు సత్యనారాయణ కన్నుమూశారు. హైదరాబాద్ కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఆయన పార్థివ దేహాన్ని ఉంచారు. హరీశ్‌రావుకు పితృవియోగంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా పలువురు బీఆర్ఎస్ నేతలు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన అంత్యక్రియలు మంగళవారం మధ్యాహ్నం ఫిల్మ్ నగర్ మహాప్రస్థానంలో నిర్వహించారు. తన్నీరు సత్యనారాయణ మరణం పట్ల బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలిపారు. తన బావతో తనకున్న అనుబంధాన్ని స్మరించుకుని, ఆయన మృతి పట్ల విచారం వ్యక్తం చేశారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సమాచారం తెలిసిన వెంటనే హరీశ్ రావును ఫోన్‌లో పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కోకాపేటలోని హరీశ్ రావు నివాసానికి వెళ్లి, దివంగత సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. తన సోదరిని, కుటుంబ సభ్యులను ఓదార్చనున్నారు. భర్తను కోల్పోయిన అక్క లక్ష్మమ్మకు కేసీఆర్ ధైర్యం చెప్పారు. ఇక హరీశ్‌రావును గుండెలకు హత్తుకుని కేసీఆర్ ఓదార్చారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. తన్నీరు సత్యనారాయణ రావు కన్నుమూశారు. ఆయన పార్థివ దేహానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాళులర్పించారు. కోకాపేటలోని క్రిన్స్‌విల్లాస్‌లో ఉన్న ఆయన భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు. హరీశ్ రావును, ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సతీమణి శోభ.. హరీశ్ రావును ఓదార్చారు. సత్యనారాయణ రావు భౌతికకాయానికి నివాళు లర్పించారు. అదేవిధంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొత్త ప్రభాకర్ రెడ్డి, పాడి కౌశిక్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, కొప్పుల ఈశ్వర్, నిరంజన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు జీవన్ రెడ్డి, బిగాల గణెశ్ గుప్తా, మెతుకు ఆనంద్, హరీశ్ రావును పరామర్శిం చారు. సత్యనారాయణ పార్థివ దేహానికి నివాళులర్పించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు నివాళి అర్పించారు. అలాగే సిఎం రేవంత్ రెడ్డి సంతాపం ప్రకటించారు. కటుఉంబ సభ్యులకు సానుభూతి ప్రకటించారు. ఎపి మాజీ సిఎం జగన్ తదితరులు కూడా సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు హరీశ్‌రావు తండ్రి సత్యనారాయణరావు మృతి పట్ల ఏపీ మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్ సంతాపం తెలిపారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా విచారం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు తండ్రి మృతి పట్ల ఆయన కుటుంబసభ్యులకు తన ప్రగాఢ సంతాపం తెలిపారు. సత్యనారాయణ రావు ఆత్మకు శాంతి చేకూరాలని దేవుడిన ప్రార్థించారు. ఈ నేపథ్యంలోనే వైఎస్ జగన్‌తో ఆయన ఫోన్‌లో మాట్లాడి సానుభూతి తెలియజేశారు.

# మావోయిస్టులకు భారీ దెబ్బ

**- పలువురు అగ్రనేతల లొంగుబాటు**

**- డిజిపి శివధర్ ఎదుట లొంగిపోయిన నేతలు**

**- పుల్లూరి ప్రసాద్ రావు, బండిప్రకాశ్‌లో లొంగుబాటు**

**- లొంగిన వారిని పూర్తిస్థాయిలో ఆదుకుంటామన్న డిజిపి**



**హైదరాబాద్,అక్టోబర్28( వెలుతురు):**

మావోయిస్టులకు మరో దెబ్బతగిలింది. పలువురు అగ్రనేతలు లొంగిపోయారు. జనజీవన స్రవంతిలో కలవాలని తెలంగాణ ప్రభుత్వం పిలుపునిచ్చిన క్రమంలో రాష్ట్ర సర్కార్ పిలుపు మేరకు మావోయిస్టులు అజ్ఞాతం వీడారు. డీజీపీ శివధర్ రెడ్డి ఎదుట మంగళవారం మావోయిస్టు అగ్రనేతలు లొంగిపోయారు. మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న , చంద్రన్నా, మావోయిస్టు స్టేట్ కమిటీ మెంబెర్ బండి ప్రకాష్ అలియాస్ ప్రభాత్ లొంగిపోయారు. అయితే, పుల్లూరి ప్రసాద్ రావుపై రూ.25 లక్షలు రివార్డు ఉంది. బండి ప్రకాష్ అలియాస్ ప్రభాతలపై రూ.20 లక్షలు రివార్డు ఉంది. అయితే, అజ్ఞాతంలో 64 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. ఇప్పటి వరకు 427మంది లొంగిపోయారు. అందులో 8 మంది స్టేట్ కమిటీ, 2 సెంట్రల్ కమిటీ మెంబెర్లు లొంగిపోయారు. 9 మంది మాత్రమే తెలంగాణలో, మిగిలిన వారు వేరే రాష్ట్రాల్లో ఉన్నారు. సెంట్రల్ కమిటీలో 5 మంది తెలంగాణ మావోయిస్టులు ఉన్నారు. 10 మంది స్టేట్ కమిటీ మెంబర్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 20 మంది డిస్ట్రిక్ కమిటీ, 14 మంది ఏరియా కమిటీల్లో, 10 మంది తెలంగాణ కమిటీలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పోలీసుల ఎదుట లొంగిపోయి, జనజీవన స్రవంతిలో కలిసిన మావోయిస్టులపై ఎలాంటి చర్యలు ఉండవని డీజీపీ శివధర్‌రెడ్డి స్పష్టం చేశారు. మావోయిస్టు తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండ ప్రకాశ్‌తో కలిసి మరో కీలక నేత పుల్లూరి ప్రసాదరావు అలియాస్ చంద్రన్న తెలంగాణ డీజీపీ ఎదుట లొంగిపోయారు. మావోయిస్టుల లొంగుబాటు వివరాలను డీజీపీ మీడియా సమావేశంలో వెల్లడించారు. 1980లో పుల్లూరి ప్రసాదరావు కిషన్‌జీకి అనుచరుడిగా మారారు. 1981లో పీపుల్స్‌వార్‌లో చేరి.. 1983లో కమాండర్ అయ్యారు. 1992లో ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శిగా పనిచేశారు. 2008లో మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడయ్యారు. 17 ఏళ్ల పాటు మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ సభ్యుడిగా ఉన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి పిలుపుతో పుల్లూరి ప్రసాదరావు లొంగిపోయారని డీజీపీ శివధర్‌రెడ్డి తెలిపారు. మావోయిస్టు మరో నేత బండ ప్రకాశ్ అలియాస్ ప్రభాత్.. 45 ఏళ్లు వివిధ స్థాయిల్లో పనిచేశారు. అతని స్వస్థలం తెలంగాణలోని మందమర్రి. ఏడో తరగతి చదువుతున్నప్పుడే నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారు. 2004లో జరిగిన శాంతి చర్చల్లో ప్రకాశ్ పాల్గొన్నారు. 2019లో స్టేట్ కమిటీ సభ్యుడయ్యారు. నేషనల్ పార్క్ ఏరియా కీలక ఆర్గనైజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. బండ ప్రకాశ్‌పై ఉన్న రూ.20లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. పుల్లూరి ప్రసాదరావుపై ఉన్న రూ.25లక్షల రివార్డు ఆయనకు ఇస్తాం. తెలంగాణకు చెందిన ఇంకా 64 మంది మావోయిస్టులు కొనసాగుతున్నారు. పోలీసుల ఎదుట లొంగిపోయిన మావోయిస్టు నేతలపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్ కరెక్ట్ కాదు. అవసరమైతే.. వారికి రక్షణ కల్పిస్తాం అని డీజీపీ తెలిపారు. మావోయిస్టులు చంద్రన్నా, బండి ప్రకాశ్ అజ్ఞాతం వీడారని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం పిలుపు మేరకు అజ్ఞాతం నుంచి బయటికి వచ్చి జనజీవన స్రవంతిలో కలిశారని పేర్కొన్నారు. పుల్లూరి ప్రసాద్ రావ్ అ చంద్రన్నది పెద్దపల్లి మండలమని తెలపారు. చంద్రన్న15 ఏళ్ల కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్నారని గుర్తుచేశారు. మొదట రాడికల్ స్టూడెంట్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారని వెల్లడించారు. 1980లో కిషన్‌జీకి కొరియర్‌గా చేశారని గుర్తుచేశారు. 2008లోనే కేంద్ర కమిటీ మెంబర్‌గా చంద్రన్న ఉన్నారని తెలిపారు. 2024 డిసెంబర్ వరకు తెలంగాణ స్టేట్ కమిటీ సెక్రటరీగా ఉన్నారని వివరించారు. అక్టోబరు 21వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన పిలుపు మేరకు చంద్రన్న జన జీవన స్రవంతిలో కలిశారని చెప్పుకొచ్చారు. చంద్రన్న ఆరోగ్యం కూడా సహకరించకాపోవడంతో అజ్ఞాతం వీడారని పేర్కొన్నారు. మావోయిస్టు పార్టీలో చీలిక వచ్చిందని లొంగిపోయిన మావోయిస్టు సెంట్రల్ కమిటీ మెంబర్ పుల్లూరి ప్రసాద్ రావు అలియాస్ శంకరన్న తెలిపారు. తీవ్ర అనారోగ్య కారణాలతో తాను జనజీవన స్రవంతిలో కలిశానని చెప్పుకొచ్చారు. ఇప్పటి నుంచి ప్రజలతో కలిసి పోరాటాలు చేస్తామని వెల్లడించారు. మావోయిస్టు భావజాలానికి తానెప్పుడూ కూడా విజ్ఞుడేనని స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీలో వచ్చిన విభేదాలు, చీలికల వల్లనే ఈ పరిస్థితి ఏర్పడిందని చెప్పుకొచ్చారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నక్సలైట్లు తమ సోదరులని.. లొంగిపోవాలని సీఎం పిలుపునిచ్చారని తెలిపారు. ముఖ్యమంత్రి పిలుపుమేరకు తాము ప్రజలతో కలిసి పని చేయాలని భావించామని పేర్కొన్నారు. అలాగే, తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పిలుపు మేరకు సరెండర్ అయ్యామని పుల్లూరి ప్రసాద్ రావు స్పష్టం చేశారు.



# హుస్సేన్‌సాగర్‌లో అట్టహాసంగా ప్రారంభమైన జాతీయ కెనో స్ప్రింట్ రేసు పోటీలు

## గిరిజన యువత ప్రతిభకు వేదికగా తెలంగాణ

## సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

™VÕ<Šs u²<Žyî\TÔãTsÁT nçÃ¼sY 28:
జాతీయ కెనో స్ప్రింట్ రేసులుదహుస్సేన్‌సాగర్‌లో మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ, తెలంగాణ గిరిజన సాంస్కృతిక పరిశోధన శిక్షణ సంస్థ, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల మరియు వికలాంగుల సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై పది రాష్ట్రాల జట్ల మధ్య జరిగే రేసు పోటీలకు జెండా ఊపి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ... "క్రీడలు గిరిజన యువతలో ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, స్వావలంబనకు మార్గం చూపుతాయి. క్రీడా రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. గిరిజన విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు అన్ని విధాలుగా ప్రభుత్వం సహకరిస్తుంది" అని అన్నారు. "హుస్సేన్‌సాగర్‌లో జరుగుతున్న జాతీయ స్థాయి కెనో స్ప్రింట్ రేసులు తెలంగాణ గిరిజన యువత ప్రతిభకు వేదికగా నిలుస్తాయనీ అన్నారు.. గిరిజన ప్రాంతాల్లో క్రీడా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడం, ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి వారికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమాలు అందించడం ద్వారా క్రీడా రంగాన్ని ఉన్నతస్థాయికి తీసుకెళ్తాం" అని మంత్రి పేర్కొన్నారు.




ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి సబ్యసాచి ఘోష్ మాట్లాడుతూ... "క్రీడలు యువతలో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. నిరంతర సాధన, శాస్త్రీయ శిక్షణా విధానాలు అనుసరించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో విజయాలు సాధించడం సాధ్యమవుతుంది" అని అన్నారు.

జిల్లా కలెక్టర్ హరిచందన మాట్లాడుతూ... "క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. గెలుపు-ఓటములను సమానంగా స్వీకరించే క్రీడాస్ఫూర్తిని యువతలో పెంపొందించుకోవాలి" అని సూచించారు. ఈ జాతీయ కెనో స్ప్రింట్ రేసుల్లో తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అస్సాం, పంజాబ్, తమిళనాడు, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాల జట్లు పాల్గొన్నాయి.

గిరిజన సంక్షేమ శాఖ అదనపు సంచాలకులు సర్వేశ్వర రెడ్డి, సంస్థ డైరెక్టర్ డా. సముజ్వల మాట్లాడుతూ... "ఈ పోటీలు గిరిజన యువతకు ప్రేరణగా నిలిచి, తెలంగాణ క్రీడా చరిత్రలో కొత్త అధ్యాయానికి నాందిగా నిలుస్తాయి" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, గురుకులాల సెక్రటరీ సీతాలక్ష్మి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



















https://epaper.velthuru.com

# వెలుతురు

cinema

## ఎంగేజ్‌మెంట్‌పై రష్మిక ఆసక్తికర సమాధానం

### మీకేమి అనిపిస్తుందో అదే నిజం..

### ఎప్పుడు చెప్పలో అప్పడే చెబుతానంటూ రిప్లై

విజయ్ దేవరకొండతో తన ఎంగేజ్‌మెంట్‌పై నటి రష్మిక ఆసక్తికర సమాధానం చెప్పి తప్పించుకున్నారు. రష్మిక తాజాగా ఓ ప్రెస్‌మీట్‌లో రష్మికను ఓ అభిమాని విజయ్‌తో నిశ్చితార్థం గురించి అడిగారు. దానికి ఆమె ఆసక్తికర సమాధానం ఇచ్చారు. ఎప్పుడు చెప్పాలో అప్పుడే చెబుతాను. ఈ విషయంలో మీకు ఏమనిపిస్తుందో అదే నిజం' అని అన్నారు. ప్రస్తుతం రష్మిక 'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమా ప్రచారంలో బిజీగా ఉన్నారు. నవంబర్ 7న ఈ సినిమా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మీడియా సమావేశాల్లో పాల్గొంటూ జోష్ పెంచుతున్నారు. తనకెంతో ఇష్టమైన 'డియర్ కామ్రేడ్' గురించి మాట్లాడారు. అలాగే విజయ్‌తో ఎంగేజ్‌మెంట్ పైనా స్పందించారు. సినిమా రిలీజ్ అయినప్పుడు కాకుండా కొన్నేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే ఉపయోగం లేదని ఆమె అన్నారు. విజయ్ దేవరకొండ, ఆమె జంటగా నటించిన ప్రేమకథా చిత్రం 'డియర్ కామ్రేడ్'. భరత్ కమ్మ దర్శకుడు. 2019లో విడుదలైన ఈ చిత్రం అనుకున్న స్థాయిలో అలరించలేకపోయింది. ఈ సినిమా తమకెంతో ప్రత్యేకమని విజయ్, రష్మిక ఎన్నో సందర్భాల్లో వెల్లడించారు. తాజాగా రష్మిక దీనిపై స్పందిస్తూ.. అప్పుడు ఆదరణ దక్కలేదని.. కానీ, ఇప్పుడు యూట్యూబ్‌లో అందరూ దీని గురించే మాట్లాడుకుంటున్నారని అన్నారు. డియర్ కామ్రేడ్'ను థియేటర్‌లో ఆడియన్స్‌తో పాటు చూశాను. కానీ, మేం ఆశించిన ఫలితం రాలేదు. నా దృష్టిలో ఇప్పటికీ అది ఒక గొప్ప చిత్రమే. ఆ సినిమాకు సంబంధించిన టాక్ బయటకు వచ్చిన తర్వాత కూడా 'దీన్ని ప్రేక్షకుల్లోకి తీసుకువెళ్ల డానికి మనం ఇంకా ప్రయత్నిద్దాం' అని చిత్ర బృందానికి చెప్పాను. కానీ, అది ఫలించలేదు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆ సినిమా గురించి మాట్లాడుకుంటున్నారు. సోషల్ మీడియాలో, యూట్యూబ్‌లో 'డియర్ కామ్రేడ్' గురించి పోస్ట్‌లు పెడుతున్నారు. ఇది ప్రేక్షకులకు నచ్చుతుందని నేను అప్పుడు చెబితే ఎవరూ వినలేదు. ఒక సినిమా కోసం దర్శకనిర్మాతలు ఎంతో కష్టపడతారు. దానికి తగిన ఫలితం రాకపోతే నిజంగా బాధగా ఉంటుంది. ఆ సమయంలో ఆదరించకుండా రెండు, మూడేళ్ల తర్వాత దాన్ని ప్రశంసిస్తే బాధగా ఉంటుందని తెలిపారు.




## ఖైదీ మూవీకి 42 ఏళ్లు

అగ్ర కథానాయకుడు చిరంజీవి కెరీర్‌లోని హిట్ సినిమాలు అనగానే గుర్తొచ్చే మొదటి పేరు 'ఖైదీ' . 1983లో విడుదలైన ఈ చిత్రం చిరంజీవిని స్టార్ హీరో చేసింది. 'ఖైదీ' విడుదలై నేటికి 42 ఏళ్లు పూర్తయిన సందర్భంగా చిరంజీవి టీమ్ ఓ స్పెషల్ వీడియోను పంచుకుంది. తెలుగు సినిమా చరిత్రలో మార్పు తీసుకువచ్చిన పేరు 'ఖైదీ అని పేర్కొంది. ఈ సినిమా అప్పట్లో సూపర్ డూపర్ హిట్‌గా నిలిచింది. ఇందులో చిరు సరసన మాధవి నటించింది. మిగతా పాత్రల్లో రావుగోపాలరావు, నూతన్ ప్రసాద్, రంగనాథ్, సంగీత తదితరులు నటించారు.




## అడవిశేష్ డెకాయిట్ ఉగాదికి రిలీజ్

అడివి శేష్ హీరోగా తెరకెక్కుతున్న రొమాంటిక్ యాక్షన్ మూవీ 'డెకాయిట్' . తాజాగా కొత్త రిలీజ్ డేట్‌ను ప్రకటించారు. 2026 ఉగాదిని పురస్కరించుకుని మార్చి 19న ఈ సినిమాని విడుదల చేయనున్నారు. సంబంధిత పోస్టర్‌ను అడివి శేష్ సోషల్ మీడియాలో పంచుకుంటూ.. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకు వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరం లేదు' అని క్యాప్షన్ పెట్టారు. షానీల్ డియో దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్నారు. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఆయన నటిస్తున్న తొలి తెలుగు చిత్రమిదే. విభిన్న ప్రేమకథతో తెరకెక్కుతున్న ఈ సినిమాలో తొలుత హీరోయిన్‌గా శ్రుతిహాసన్ ఎంపికైన సంగతి తెలిసిందే. కానీ, ఆమె స్థానంలో ఇప్పుడు మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. డిసెంబరు 25న విడుదల చేయనున్నట్టు చిత్ర బృందం గతంలో వెల్లడించగా.. ఇప్పుడు వాయిదా వేసింది. అడివిశేష్, మృణాల్ ఠాకూర్ కాంబినేషన్‌లో వస్తోన్న చిత్రం డెకాయిట్ ముందుగా వచ్చిన వార్తల ప్రకారం క్రిస్మస్‌కు ప్రేక్షకుల ముందుకు రావాల్సింది. అయితే ఎవరూ ఊహించని విధంగా కొత్త తేదీ ప్రకటిస్తామంటూ తెలిపారు మేకర్స్. ఈ మూవీని ఉగాది కానుకగా మార్చి 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ కొత్త పోస్టర్ విడుదల చేశారు మేకర్స్. అడివి శేష్, మృణాళ్ ఠాకూర్ జీప్‌లో ఉండగా.. ఈ ఇద్దరూ గన్‌తో శత్రువులను ఎదుర్కొంటూ తమను తాము రక్షించుకుంటున్న కొత్త పోస్టర్ నెట్టింట వైరల్ అవుతోంది. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో తెరకెక్కుతున్న ఈ మూవీని సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తుండగా.. సునీల్ నారంగ్ కో ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నాడు. అడివిశేష్ హీరోగా నటించిన క్షణం, గూఢచారి చిత్రాలకు సినిమాటోగ్రఫర్‌గా పనిచేసిన షనీల్ డియో ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేస్తుండటంతో అంచనాలు పెరిగిపోతున్నాయి.




## ఫౌజీ మూవీలో యంగ్ ప్రభాస్‌గా దర్శన్

సూపర్ స్టార్ కృష్ణ చిన్నల్లుడు, మహేశ్ బాబు బావ సుధీర్ బాబు ప్రస్తుతం తెలుగు సినిమా రంగంలో హీరోగా తనకంటూ ఓ గుర్తింపును సంపాదించుకున్నాడు. కృష్ణ చిన్నకూతురు ప్రియదర్శిని భర్త అయిన సుధీర్ బాబు తన కొడుకులనూ సినిమా రంగంలోకే తీసుకొస్తుండటం విశేషం. ప్రియదర్శిని, సుధీర్ బాబు జంటకు ఇద్దరు కొడుకులు. పెద్దబ్బాయి చరిత మానస్. ఇతను గతంలో 'భలే భలే మొగాడివోయ్' చిత్రంలో చిన్నప్పటి నాని (ఔజీనితి) గా నటించాడు. అలానే చిన్న కొడుకు దర్శన్ కూడా కొన్ని సినిమాల్లో నటించాడు. 2018లో వచ్చిన 'గూఢచారి'లో చిన్నప్పటి అడివి శేష్ గానూ, 2022లో వచ్చిన 'సర్కారు వారి పాట'లో చిన్నప్పటి మహేశ్ బాబు గానూ దర్శన్ నటించాడు. తాజాగా సుధీర్ బాబు తనయుడు దర్శన్ 'ఫౌజీ' మూవీలో యంగ్ ప్రభాస్ గా నటిస్తున్నట్టు తెలిసింది. ఈ విషయాన్ని స్వయంగా అతని తండ్రి సుధీర్ బాబు తెలిపాడు. సుధీర్ బాబు నవంబర్ 7న విడుదల కాబోతున్న తన తాజా చిత్రం 'జటాధర' ప్రమోషన్స్ సమయంలో ఈ విషయాన్ని వెల్లడించాడు. ఈ సినిమాలో భారీ సంస్కృత సంభాషణలు ఉన్నాయని, వాటిని చాలా సులువుగా, సునాయాసంగా దర్శన్ చెప్పేశాడని యూనిట్ సభ్యులు అంటున్నారు. 'ఫౌజీ' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. హను రాఘవపూడి దర్శకత్వం వహిస్తున్న 'ఫౌజీ'తో ప్రభాస్ సరసన ఇమాన్వీ హీరోయిన్ గా నటిస్తోంది.




## "మాస్ జాతర" ట్రైలర్ వచ్చేసింది

**హైదరాబాద్ వెలుతురు బ్యూరో (ఉదయ్ కిరణ్) అక్టోబర్ 28:**
రవితేజ శ్రీ లీల జంటగా నటిస్తున్న మాస్ జాతర మూవీ ట్రైలర్ విడుదలైంది రవితేజ యాక్టింగ్ ,డైలాగ్, యాక్షన్ సీన్లు ప్రేక్షకులను అకట్టుకునేలా ఉన్నాయి . ఇప్పటికే విడుదలైన సాంగ్స్ టీజర్ ఆకట్టుకున్నాయి . భాను భోగవరపు దర్శకత్వం వహించిన ఈ మూవీ అక్టోబర్ 31 థియేటర్లో రిలీజ్ కానుంది.




## ఉప్పెన లెవల్లో డ్యూడ్ విజయం



మైత్రీ మూవీ మేకర్స్ అధినేతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ కొత్త దర్శకులకు దన్నుగా నిలుస్తారనే విషయం మరోసారి రుజువైంది. అప్పట్లో వైష్ణవ్ తేజ్ , కృతిశెట్టిని హీరోహీరోయిన్లుగా పరిచయం చేస్తూ మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'ఉప్పెన' సినిమాను నిర్మించింది. ఆ మూవీతో బుచ్చిబాబు సానా దర్శకుడిగా పరిచయం అయ్యాడు. కొత్త వాళ్ళతో తీసిన 'ఉప్పెన' సినిమా ఘన విజయాన్ని సాధించింది. ఏకంగా వంద కోట్ల గ్రాస్ ను వసూలు చేసింది. సింగిల్ లాంగ్వేజ్ లోనే ఆ సినిమా ఆ రికార్డ్ ను సాధించడం విశేషం. ఓ కొత్త హీరో, హీరోయిన్ల సినిమా ఆ స్థాయి వసూళ్ళను గతంలో ఎప్పుడూ చేయలేదు. అయితే దానిని నిర్మించిన మైత్రీ మూవీ మేకర్స్ సంస్థే ఇప్పుడు అదే రికార్డ్ ను రిపీట్ చేసింది. ప్రదీప్ రంగనాథన్ హీరోగా మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ 'డ్యూడ్' మూవీని నిర్మించింది. దీపావళి కానుకగా విడుదలైన ఈ సినిమాతో కీర్తీశ్వరన్ దర్శకుడిగా పరిచయం అయ్యాడు. గతంలో ప్రదీప్ రంగనాథన్ హీరోగా నటించి 'లవ్ టుడే', 'డ్రాగన్' చిత్రాలు మంచి విజయాన్ని సాధించాయి. ఇప్పుడు 'డ్యూడ్' సైతం చక్కని విజయాన్ని అందుకుని అతనికి హ్యాట్రిక్ ను అందించింది. ఈ సినిమా ఇంతవరకూ వంద కోట్లకు పైగా గ్రాస్ ను వసూలు చేసినట్టు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. దాంతో చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సైతం హర్షం వ్యక్తం చేసింది. 'ఉప్పెన' తర్వాత నూతన దర్శకుడితో తాము తీసిన 'డ్యూడ్' సైతం వందకోట్ల గ్రాస్ వసూలు చేయడం ఆనందంగా ఉందని, రాబోయే రోజుల్లోనూ కొత్త దర్శకులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తామని తెలిపింది.

## వర్షపునీటిలో మునిగిన గిరిజన కాలనీ



**నెల్లూరు,అక్టోబర్28( వెలుతురు):**
కోవూరు మండల పరిధిలోని పోతిరెడ్డి పాలెం చంద్రశేఖరపురం గిరిజన కాలనీ వర్షపు నీటితో మునిగి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వరుసగా కురుస్తున్న వర్షాల కారణంగా కాలనీ మొత్తం మడుగులా మారిపోయింది. ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు లబోదిబో మంటున్నారు. చిన్నారులు, వృద్ధులు నీటిలో ఇరుక్కుపోయి ఇబ్బందులు పడుతున్నారు. తాగునీరు, విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. స్థానికులు చెబుతూ ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి. నీరు వెళ్లే దారులు లేకపోవడం వల్ల మా ఇళ్లు ఎప్పుడూ మునుగు తున్నాయి. అధికారులు ఒక్కసారి వచ్చి చూస్తే చాలు మా కష్టాలు అర్థమవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే నీటి మునగటం సమస్యను పరిష్కరించాలని, కాలనీలో డ్రైనేజ్ సదుపాయాలు కల్పించాలని స్థానికులు విజ్ఞప్తి చేశారు

## తుపాన్ ప్రభావంపై మంత్రి లోకేశ్ ఆరా

**- ఎమ్మెల్యేలతో ఫోన్లో మాట్లాడి వివరాలు సేకరణ**

**- అప్రమత్తంగా ఉంటూ ప్రజలకు అండగా ఉండాలని సూచన**



**అమరావతి,అక్టోబర్28( వెలుతురు):**
రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మొంథా తుపాను తీవ్రతపై మంత్రి నారా లోకేష్ ఆరా తీశారు. వివిధ నియోజకవర్గ ఎమ్మెల్యేలతో ఫోన్లో మాట్లాడి క్షేతస్థాయి పరిస్థితులను వాకబు చేశారు. ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, తుని ఎమ్మెల్యే యనమల దివ్య, వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో మంత్రి మాట్లాడారు. అలాగే గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య, దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్, పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణతో ఫోన్లో మాట్లాడి తుపాను పరిస్థితులపై ఆరా తీశారు. మొంథా తీవ్ర తుపానుగా మారిన నేపథ్యంలో ఈరోజు చాలా ముఖ్యమని, మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. అన్ని రకాల ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, ఎలాంటి సాయం కావాలన్నా తమను సంప్రదించాలని శాసనసభ్యులకు సూచించారు. సంక్షోభ సమయంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండి బాధితులకు అవసరమైన సహాయక, పునరావాస చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. డ్రెయిన్లు పొంగి ప్రవహించకుండా అవసరమైన చర్యలు చేపట్టినట్లు లోకేష్‌కు డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు వివరించారు. అలర్ట్స్ ట్రాకింగ్ మెకానిజం ద్వారా ప్రతి రెండు గంటలకోసారి క్షేత్రస్థాయి పరిస్థితులను సమీక్షించాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు.

## కోనసీమలో అప్రమత్తంగా ఎన్డీఆర్ఎఫ్ దళాలు

**- అత్యవసర సేవలకు రంగంలోకి దిగేలా చర్యలు**

**కోనసీమ,అక్టోబర్28( వెలుతురు):**
మొంథా తుపాన్ హెచ్చరికలు అంబేద్కర్ కోనసీమ జిల్లా ప్రజలను తీవ్రంగా వణికిస్తున్నాయి. 1996 నాటి పెను తుపాన్‌ను గుర్తుచేసుకొని కోనసీమ వాసులు భయాందోళన చెందుతున్న పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలోని సముద్ర తీరంలో ఉన్న 34 గ్రామాలు సహా కచ్చా ఇల్లు, పూరి గుడిసెల్లో ఉన్నవారిని తుపాన్ పునరావాస కేంద్రాలకు అధికార యంత్రాంగం తరలిస్తోంది. దాదాపు 6 వేల మందిని తరలించేందుకు 120 పునరావాసు కేంద్రాలు ఏర్పాటు చేవారు. అమలాపురం, సఖినేటిపల్లిలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మోహరించాయి. ఎక్కడైనా ఘటన జరిగితే 30 నిమిషాల్లో చేరుకునేలా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయి. కాట్రేనికోన, అల్లవరం, ఉప్పలగుప్తం, ఐ.పోలవరం, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో తీర ప్రాంత మత్స్యకారులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. అంతర్వేది పల్లిపాలెం మినీ ఫిషింగ్ హార్బర్ వద్ద బోట్లను నిలిపివేశారు మత్స్యకారులు. మలికిపురం మండలం కేశనపల్లి తుపాన్ షెల్టర్‌లో మత్స్యకారులంతా ఆశ్రయం పొందుతున్నారు. తుపాన్ సహాయక చర్యలను ప్రత్యేక అధికారి వి.విజయ రామరాజు, జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. పునరావస కేంద్రాల్లో ఆహారం తయారీ, వసతి, వైద్యశిబిరం తదితర ఏర్పాట్లు చేసి ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూస్తున్నారు.

## తుపాను వల్ల ప్రాణ, ఆస్తి నష్టాలు జరగకుండా చర్యలు

**- సహాయాక చర్యలపై సీనియర్ అధికారి శశిభూషణ్ కుమార్**

**- కలెక్టరేట్ లోని కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా పరిశీలన**




**విజయవాడ,అక్టోబర్28( వెలుతురు):**
సాంకేతిక పరిజ్ఞానంతో తుపానును ఎదుర్కోవడానికి జిల్లా యంత్రాంగం సంసిద్ధంగా ఉందని ఎన్టీఆర్ జిల్లా తుపాను ప్రత్యేక అధికారి, శశిభూషణ్ కుమార్ అన్నారు. మంగళవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి. లక్ష్మీశ తో కలసి కలెక్టరేట్లో ఏర్పాటుచేసిన కమాండ్ కంట్రోల్ రూమ్ ను ఆయన పరిశీలించి, జిల్లావ్యాప్తంగా చేపట్టిన చర్యలను అడిగి తెలుసుకున్నారు. విపత్తు ఎదుర్కోవడానికి అవసరమైన జెసిబి, ట్రాక్టర్లు, యంత్రాలను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... గౌరవ ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, కీలక శాఖల సిబ్బంది తుపాను ప్రతిస్పందన చర్యలలో నిమగ్నమై ఉన్నారని చెప్పారు. అన్ని వసతులతో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారని, క్షేత్రస్థాయి యంత్రాంగమంతా సమర్థవంతంగా పనిచేస్తోందని చెప్పారు. అవసరమైన యంత్రాలు, సామాగ్రి అందుబాటులో ఉన్నాయని, ఆస్తి ప్రాణ నష్టాలు సంభవించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. ఇప్పటివరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని తెలిపారు. ఇది తీవ్ర తుపాను అని, ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఏర్పాట్లు, చర్యలపై తమ ఫీడ్ బ్యాక్ ఇవ్వొచ్చని చెప్పారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ మాట్లాడుతూ... అవేర్ వెబ్సైట్ ద్వారా తుపాను గమనాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇప్పటికే తుపాను ముప్పు పొంచి ఉన్న గ్రామాల, ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశామని చెప్పారు. వర్షపు నీరు రోడ్లపై నిలవకుండా కాలువల్లోని నీటిని నియంత్రిస్తున్నామని, బుడమేరుపై దృష్టి సారిస్తున్నామని చెప్పారు. మంగళవారం నగరంలో భారీ వర్షం కురుస్తుందన్న హెచ్చరికల నేపథ్యంలో నగరవాసులు బయట తిరగవద్దని, దుకాణాలు మూసి ఉంచాలని సూచించారు. రైతులు పంట కోతలు కోయరాదని, మత్స్యకారులు సముద్రంలోకి వెళ్ళవద్దని సూచించారు.

# ప్రజల రక్షణలో ప్రాణాలర్పించిన పోలీసు అమర వీరులకు నివాళులు

**- పోలీసు సంస్మరణ దినోత్సవం సందర్భంగా తూప్రాన్‌లో 2కే రన్**

**- యువతతో కలిసి నేర రహిత సమాజ నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయించిన డీఎస్పీ నరేందర్ గౌడ్**




**తూప్రాన్, వెలుతురు అక్టోబర్ 28:**
ప్రజల కోసం ప్రాణాలు అర్పించిన పోలీసు అమర వీరులను స్మరించుకుంటూ తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్ ఘనంగా నివాళులు అర్పించారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఉదయం నర్సాపూర్ చౌరస్తా నుండి తూప్రాన్ పెద్ద చెరువు కట్ట వరకు 2కే రన్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ డీఎస్పీ నరేందర్ గౌడ్, "పోలీసులు చట్ట వ్యతిరేక



కార్యకలాపాలను అరికట్టి ప్రజల రక్షణ కోసం శ్రమిస్తున్నారు. యువత కూడా పోలీసులకు తోడ్పాటు అందించి సమాజ భద్రత, శాంతి, శ్రేయస్సు కోసం కృషి చేయాలి" అని పిలుపు నిచ్చారు. డ్రగ్స్, గుట్కా, జూదం వంటి వ్యసనాల నుంచి దూరంగా ఉండి మంచి పౌరులుగా మారాలని, సైబర్ నేరాలను అరికట్టడంలో పోలీసులకు సహకరించాల ని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలు గమనిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా డయల్ 100కు సమాచారం అందించాలని యువతకు సూచించారు. 2కే రన్‌లో తూప్రాన్, మనోహరాబాద్, వెల్దుర్తి, శివ్వంపేట మండలాల నుండి సుమారు వెయ్యి మంది యువత, పోలీస్ సిబ్బంది, గీతా కాలేజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ 2 కే రన్ పోటీలో మొదటి స్థానం లో తూప్రాన్ పోలీస్ స్టేషన్ కానిస్టేబుల్ సలక్షన్ గౌడ్, ద్వితీయ స్థానం శ్రీ చైతన్య కాలేజీ విద్యార్థి మధు తేజ, తృతీయ స్థానం గీతా కాలేజీ విద్యార్థి సాయి తేజ దక్కించుకున్నారు. విజేతలకు డీఎస్పీ నరేందర్ గౌడ్ చేతుల మీదుగా మెమెంటోలు బహుకరించి సన్మానించగా, అన్ని పాల్గొన్న యువతకు మెడల్స్ అలంకరించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సి.ఐ రంగ కృష్ణ, ఎస్.ఐ శివానందం, ఎస్.ఐ (2) యాదగిరి, మనోహరాబాద్ ఎస్.ఐ సుభాష్ గౌడ్, వెల్దుర్తి ఎస్.ఐ రాజు, తూప్రాన్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ జీ. రామేశ్వర్ రెడ్డి, యువ నాయకులు ఇస్లాంపూర్ సంతోష్ రెడ్డి, కిష్టాపూర్ మహమ్మద్ హమ్మద్, వెంకటాయపల్లి లంబ రమేష్ యాదవ్, సతీష్ చారి, బిజెపి అధ్యక్షులు భూమన్నగారి జానకిరామ్ గౌడ్, ఇమామ్ పూర్ నవీన్ గౌడ్, గీతా కాలేజీ ప్రిన్స్ పాల్ రాజు, లెక్చరర్స్ అశోక్, రాజు, యాదగిరి, ప్రవీణ్, సీనియర్ జర్నలిస్ట్ లు లయన్ డాక్టర్ జానకిరామ్, అర్.శివశంకర్ గౌడ్, వి.శివకృష్ణ గౌడ్, నవీన్, చిరంజీవి తోపాటు నాలుగు మండలాల యువకులు తదితరులు పాల్గొన్నారు.









Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com